



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 183 ఆదివారం 01 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


## రైతులను నాశనం చేస్తున్న భారత్, అమెరికా ఒప్పందం



- వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా నాలుగు నెలలు నిలిచిన ఒప్పందం
- 15 నిమిషాల్లో ఎలా పూర్తయింది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్న
- ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంది

## 'ఇకపై హార్డ్‌వేర్ రంగంలోనూ భారత్ సత్తా'



- సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ
- సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ.22,516 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుచేసిన మైక్రాన్ టెక్నాలజీ?



## పశ్చిమాసియా గగనతలం మూసివేత

- అన్ని విమాన సర్వీసులు రద్దు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా రణరంగాన్ని తలపిస్తోంది
- భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసేశాయి
- ఫలితంగా మిడిల్ ఈస్ట్ గుండా వెళ్లే అన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి.

# ఘోర ప్రమాదం

**వేట్లపాలెంలో భారీ పేలుడు..23 మంది సజీవ దహనం**

**బాణసంచా పరిశ్రమలో భారీ విస్ఫోటనం..**





- 13 మందికి తీవ్ర గాయాలు
- పరిశ్రమ యజమాని పరారీ
- 5 కిమీ మేర శబ్దం, పలువురి మంత్రుల దిగ్భ్రాంతి
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**కాకినాడ**

కాకినాడ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో భారీ పేలుడు సంభవించింది. ఓ బాణాసంచా తయారీ కేంద్రంలో టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో భారీగా ఎగిసి పడుతున్న మంటల్లో చిక్కుకుని 23 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడుధాటికి మృత దేహాలు స్థానిక పంట పొలాల్లోకి ఎగిరిపడ్డాయని స్థానికులు చెబుతున్నారు.

అందిన సమాచారం మేరకు మృతుల వివరాలు : అడబాల శ్రీను, కడిపల్లి కృపమ్మ, ధనరాజు, సాధనాల సత్యవతి, వల్లూరి రవి, రాము, గంపల - మిగతా3లో



## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం

- మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి
- పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడి

**అమరావతి**

కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగి 21 మంది మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ - మిగతా3లో



## తుది 'జాబితా' విడుదల..

## ఓటర్లలో టెన్షన్!

- బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) విడతల వారీగా ఈ జాబితాలను సేకరించి, ఆయా కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచారు.
- ఈ సవరణ ప్రక్రియలో దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లపై సందిగ్ధత నెలకొనడం సర్వత్రా ఆందోళన
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో జాబితా అప్‌లోడ్ అయ్యేలోపు క్షేత్రస్థాయిలో పారదర్శకతను పెంచేందుకే ఆఫ్‌లైన్ పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చామని ఎన్నికల సంఘం స్పష్టం

## గత పాలకులు ప్రజలకే కాదు

# దేవుడికీ ద్రోహం



- పింఛనుతో పేదల జీవితాల్లో వెలుగులు
- సుపరిపాలన-- ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం
- కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు
- విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు

**విజయనగరం**

గత పాలకులు తిరుమల వేంకటేశ్వర స్వామికే అపచారం తలపెట్టారు. స్వామి ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు. కెమికల్స్‌తో లడ్డూ తయారు చేసి స్వామికి నైవేద్యంగా పెట్టారు. ప్రజలకే కాదు దేవుడికి కూడా ద్రోహం చేయాలని చూశారు. అలాంటి వారు రాజకీయాల్లో ఉంటే సమస్యలు వస్తాయి. దేవుడికి కూడా ద్రోహం చేసే వారికి వదిలిపెట్టకూడదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావి వలసలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ , పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు - మిగతా3లో



## కాంగ్రెస్ దేశ ప్రతిష్ఠను దిగజార్చుతోంది

- ముస్లిం లీగ్‌లా ద్వేషపూరిత రాజకీయాలు చేస్తోంది
- రాజస్థాన్ పర్యటనలో ప్రధాని మోదీ
- హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం
- కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు
- "భారతదేశంపై ముస్లిం లీగ్‌కు ఉన్న విద్వేషమే దేశ విభజనకు కారణమైంది
- యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్‌లో నిరసనలు వ్యక్తం చేశారు

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

- ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలపై మంత్రి లోకేశ్ సమీక్ష
- ఏయూని ప్రపంచస్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చడమే లక్ష్యం
- మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకు పూర్వ విద్యార్థులతో వేడుకలు
- యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం



**అమరావతి**

చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్ లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి - మిగతా3లో

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# 'ఇకపై హార్డ్‌వేర్ రంగంలోనూ భారత్ సత్తా'

గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారత్ వేగంగా భాగం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ కీలక పాత్ర పోషించబోతుందని మోదీ తెలిపారు. గుజరాత్‌లోని సానంద్‌లో ఏర్పాటు చేసిన మైక్రాన్ టెక్నాలజీ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ప్లాంట్?ను సందర్శించారు. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ల విప్లవంలో భారత్ పాత్ర గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

**మూడేళ్ల కిందటే కుదిరిన మీఖ**

ఈ ప్లాంట్‌కు సంబంధించిన ఎంవోయూ మూడేళ్ల కిందటే జరిగింది. ఇందులో అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్‌కు చెందిన పనులు జరుగుతాయని మోదీ తెలిపారు. అమెరికాకు చెందిన మైక్రాన్ టెక్నాలజీ రూ. 22 వేల 516 కోట్ల భారీ పెట్టుబడితో ఈ కేంద్రాన్ని నెలకొల్పినట్టు వెల్లడించారు. ఈ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వాణిజ్యంలో భారత్ పాత్రను బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. గత శతాబ్దాన్ని చమురు నియంత్రిస్తే ఈ శతాబ్దాన్ని సెమికండక్టర్లు నియంత్రిస్తాయని అభిప్రాయపడ్డారు.

'10, 11 ఏళ్ల క్రితం భారత్‌లో 'డేటా', 'చిప్స్' గురించిన చర్చ కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైంది. టెక్నాలజీ గురించి మాట్లాడుకున్నప్పుడు మన చర్చలు ఎక్కువగా ఐటీ సేవల చుట్టూనే తిరిగేవి. కానీ ఈరోజు చూడండి, సాఫ్ట్‌వేర్ రంగానికి



పేరుగాంచిన భారత్ ఇప్పుడు 'హార్డ్‌వేర్' రంగంలో కూడా తన ఉనికిని చాటుకుంటూ శక్తిమంతంగా మారుతోంది. ఈరోజు సానంద్‌లో సరికొత్త భవిష్యత్తు ఆవిర్భవించడాన్ని మనం చూస్తున్నాం. మైక్రాన్ సంస్థకు చెందిన ఈ ఏటీఎంపీ ఫెసిలిటీలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కావడం అనేది గ్లోబల్ టెక్నాలజీ వాల్యూ చైన్‌లో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేయనుంది. నేడు భారత్ అత్యంత వేగంగా 'గ్లోబల్ సెమీకండక్టర్ వాల్యూ చైన్'లో అంతర్భాగమవుతోంది' అని మోదీ తెలిపారు.

అప్పుడు చమురు- ఇప్పుడు మైక్రోచిప్?

అలాగే ఒకప్పుడు ప్రపంచాన్ని చమురు నియంత్రించేదని, ఇప్పుడు మైక్రోచిప్?ల కాలం నడుస్తుందని మోదీ అన్నారు. 'ఇది ఏఐ విప్లవ శతాబ్దం. ఈ విప్లవానికి సెమీకండక్టర్ అనేది ఒక వారధిలాగా పని చేస్తుంది. ప్రపంచాన్ని గత శతాబ్దంలో చమురు నియంత్రిస్తే, ఈ శతాబ్దాన్ని సెమీకండక్టర్లు నియంత్రిస్తాయి. ఇది అమెరికా- భారత్ మధ్య బలమైన సహకారం, భాగస్వామ్యాన్ని కూడా సూచిస్తుంది. ఇది అత్యంత కీలకమైంది. ముఖ్యంగా ాూ×, చిప్స్ రంగాలలో ఈ రెండు టెక్నాలజీలకు సరఫరా గొలుసులు భద్రపరచడానికి ప్రపంచం మొత్తం కృషి చేస్తోంది. అలాగే ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కూడా ఈ లక్ష్యం కోసం పనిచేస్తున్నాయి. ఏఐ సమ్మిట్ సందర్భంగా అమెరికా- భారత్ మధ్య పాక్స్ సిలికా చొరవ ఈ దిశలో మరొక అడుగు లాంటిదే. మా ఉమ్మడి ప్రయత్నాలు ప్రపంచ ముఖ్యమైన ఖనిజాల సరఫరా గొలుసును మరింత సురక్షితంగా చేస్తాయి. భారతదేశ సెమీకండక్టర్ తయారీ ప్రయాణంలో ఈ ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది' అని మోదీ అన్నారు.

**2023లో శంకుస్థాపన!**

కాగా, 2023 సెప్టెంబర్?లో ఈ ప్లాంట్?నకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్?లో మొదటి ప్రతిపాదనగా ఈ ప్రాజెక్ట్?ను ఆమోదించారు. రూ. 22,500 కోట్లకు పైగా వ్యయంతో దీని నిర్మాణం జరిగింది. ఇది దేశంలో వ్యూహాత్మక సెమీకండక్టర్ పెట్టుబడులను ట్రాక్ చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత దాదాపు 5 లక్షల చదరపు అడుగుల క్లీన్‌రూమ్ స్పేస్ కలిగి ఉంటుంది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్లీన్‌రూమ్‌లలో ఒకటిగా ఇది మారనుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెమరీ స్టోరేజ్, హై స్పీడ్ పెర్ఫార్మెన్స్ లాంటి సేవలు అందించేందుకు అందుబాటులోకి రానుంది.

# రైతులను నాశనం చేస్తున్న భారత్, అమెరికా ఒప్పందం

భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ రైతులను నాశనం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఏటా భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని గాంధీ అన్నారు. ఈ మేరకు పంజాబ్?లో బర్నాలాలో జరిగిన మజ్దూర్ కిసాన్ మహా ర్యాలీలో పాల్గొన్న రాహుల్, పలు వ్యాఖ్యలు చేశారు.

వ్యవసాయ రంగంపై భిన్నాభిప్రాయాల కారణంగా ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందని ఆరోపించారు రాహుల్ గాంధీ. "పెద్ద ప్రశ్న తలెత్తుతుంది, ప్రధానమంత్రి నాలుగు నెలలుగా చేయని పని, ఆయన 15 నిమిషాల్లో ఎందుకు చేశారు?" అని ఆయన అన్నారు. వాణిజ్య ఒప్పందం అకస్మాత్తుగా ఎలా కుదిరిందని పశ్నించారు. ప్రతి సంవత్సరం భారత్ రూ. 9 లక్షల కోట్ల విలువైన యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని మోదీ ట్రంప్‌నకు హామీ ఇచ్చారని ఆరోపించారు.

**ఆ పుస్తకం కోసం మాట్లాడాలని అనుకున్నా!**

మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకంపై మాట్లాడాలని అనుకున్నానని, కానీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడటానికి తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్ గాంధీ తెలిపారు. సరిహద్దు సమీపంలో చైనా దళాల కదలికల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని ఆ పుస్తకం వివరించిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటికే పలుమార్లు రాహుల్ గాంధీ, భారత్- అమెరికా ఒప్పందంపై మాట్లాడారు. ఇటీవల అమెరికాతో మధ్యంతర వాణిజ్య



ఒప్పందంతో కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు.

**ఆధారపడేలా చేయదా?**

డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్? ఎక్స్?లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు. అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యయేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా!**

ఆ తర్వాత అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు. ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్? గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ? ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్? గాంధీ విమర్శించారు.

# కాంగ్రెస్ దేశ ప్రతిష్ఠను దిగజార్చుతోంది

ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ చొక్కాలు విప్పి చేపట్టిన నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మండిపడ్డారు. కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లిం లీగ్?-మావోయిస్ట్ కాంగ్రెస్'గా మారిందని, దేశప్రతిష్ఠను దిగజార్చేందుకు ఎక్కడ వీలైతే అక్కడ చొరబడేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శిం చారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ కాయద్ విశ్రామ్ స్థల్?లో జరిగిన ర్యాలీలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్?పై విరుచుకుపడ్డారు.

"భారతదేశంపై ముస్లిం లీగ్‌కు ఉన్న విద్వేషమే దేశ విభజనకు కారణమైంది. నేడు కాంగ్రెస్ కూడా అదే రీతిలో వ్యవహరిస్తోంది. యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్‌లో నిరసనలు వ్యక్తం చేశారు. వాస్తవానికి వాళ్లు విదేశీ ప్రతినిధుల ముందు భారతదేశాన్ని అవమానించడానికి నాటకాలు ఆడారు. ఏఐ సమ్మిట్?ను చూసి దేశ ప్రజలు గర్వపడుతూ ఉంటే, కాంగ్రెస్ మాత్రం విదేశీ అతిథుల ముందు దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్? దేశవ్యాప్తంగా వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోంది. ఆ కోపంతోనే దేశ ప్రతిష్టను దెబ్బతీస్తూ ప్రతీకారం తీర్చుకుంటోంది. ఒకప్పుడు కాంగ్రెస్? ఐఎన్?సీ (ఇండియన్ నేషనల్? కాంగ్రెస్?)గా ప్రసిద్ధి చెందింది. కానీ నేడు ఐఎన్?సీ లేదు. అది ఎంఎంసీ (ముస్లింలీగ్? – మావోయిస్టు కాంగ్రెస్?)గా మారింది."

మరోవైపు 'మావోయిస్టులు కూడా భారతదేశ శ్రేయస్సును, మన రాజ్యాంగాన్ని, మన విజయవంతమైన ప్రజాస్వామ్యాన్ని చూసి అసూయ పడతారు. వారు మనపై దాడులు చేస్తారు. అదే



విధంగా కాంగ్రెస్ కూడా దేశాన్ని కించపరిచేందుకు, అప్రతిష్ఠపాలు చేసేందుకు ఎక్కడికైనా చొరబడుతుంది' అని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ చేసిన తప్పులను దేశం ఎన్నటికీ క్షమించదని, దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయడం, సాయుధ దళాలను బలహీనపరచడం ప్రతిపక్ష పార్టీకి పాత అలవాటేనని ప్రధాని అన్నారు. 'మన సాయుధ దళాలు తమ పరాక్రమంతో ప్రపంచ గుర్తింపు పొందాయి. కానీ కాంగ్రెస్ నేతలు, మన ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలనే పదేపదే వినిపించారు. దేశానికి ఏది మంచిదో, దేశానికి, పౌరులకు ఏది ప్రయోజనకరమో కాంగ్రెస్ వాటన్నింటినీ వ్యతిరేకిస్తుంది. అందుకే ఈ రోజు దేశం కాంగ్రెస్?కు తగిన బుద్ధి చెబుతోంది' అని మోదీ పేర్కొన్నారు.

**లీకేజీలకు చెక్?**

రాజస్థాన్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు పేపర్ లీకేలు యువత భవిష్యత్తును అంధకారం చేశాయని, ప్రస్తుత బీజేపీ సర్కార్ వాటికి అడ్డుకట్ట వేసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 21వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఆయన, "గతంలో పేపర్ లీకేజీ వార్తలు వినేవాళ్లం. ఇప్పుడు నియామక పత్రాల పంపిణీ చూస్తున్నాం" అన్నారు.

**ఆడబిడ్డల కోసం**

ఇక మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, దేశవ్యాప్తంగా గర్భాశయ క్యాన్సర్? నివారణ కోసం హెచ్?పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అజ్మీర్?లో ప్రధాని మోదీ ప్రారంభించారు. 14 ఏళ్ల వయస్సున్న బాలికలకు ఈ టీకాలను ఉచితంగా అందించే కార్యక్రమం 1.15 కోట్ల మందికి లబ్ధి చేకూరనుందని ఆయన చెప్పారు. రాజస్థాన్?లో రూ.16,680 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసిన ఆయన, నేడు ఆ రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధితో దూసుకుపోతోందని అన్నారు. కాగా, మార్కెట్‌లో వేల రూపాయల ఖరీదు చేసే ఈ వ్యాక్సిన్?ను, ప్రభుత్వం నేడు ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో, (ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), సబ్-డిస్ట్రిక్ట్, జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు) అలాగే ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఈ టీకా ఉచితంగా అందుబాటులో ఉంటుంది. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నుంచి 'ఇన్ఫార్మ్డ్ కన్సెంట్' తీసుకున్న తర్వాతే ఈ వ్యాక్సినేషన్? టీకా ఇవ్వనున్నారు.

## హాస్టల్‌లో అసభ్యకర ప్రవర్తన..
## విద్యార్థినిని బహిష్కరించిన యూనివర్సిటీ

**భోపాల్:** యూనివర్సిటీలో చదువుతున్న ఒక విద్యార్థిని హాస్టల్‌లో అసభ్యకరంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించింది. దీంతో తోటి లేడీ స్టూడెంట్స్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ హాస్టల్ నుంచి ఆ యువతిని బహిష్కరించారు. (బఅఅజవతీంఓఎ వఇజూవశ్రీం టవమ్మిశ్రీవ ర్బఎవత్) మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. దేవి అహల్య విశ్వవిద్యాలయంలో ఒక యువతి మొదటి సంవత్సరం చదువుతున్నది. క్యాంపస్‌లోని హాస్టల్‌లో నివసిస్తున్న ఆమె అనుచితంగా ప్రవర్తిస్తున్నది. మగవారితో వీడియో కాల్స్ మాట్లాడుతూ అసభ్యకర చేష్టలు చేస్తున్నది. అలాగే మొబైల్ అప్లికేషన్ ద్వారా తెలియని పురుషులతో స్నేహం చేసి మాట్లాడాలని లేడీ స్టూడెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నది. కాగా, ఆ విద్యార్థినిపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో దర్యాప్తు కోసం అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ యువతి గదిలో హాస్టల్ వార్డెన్ సోదా చేశారు. అభ్యంతరకరమైన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఆ విద్యార్థిని వల్ల హాస్టల్‌లోని ఇతర విద్యార్థినులకు తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చని దేవి అహల్య




యూనివర్సిటీ యాజమాన్యం భావించింది. ఈ నేపథ్యంలో ఆ యువతిని వెంటనే హాస్టల్ నుంచి బహిష్కరించినట్లు వైస్ ఛాన్సలర్ రాకేష్ సింఘై తెలిపారు.

## పశ్చిమాసియా గగనతలం మూసివేత



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇరాన్?పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మిస్సైళ్లతో విరుచుకపడుతున్నాయి. మరోవైపు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ రాకెట్ల వర్షం కురిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాంతంలో విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, టర్కీ సహా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, దోహా వంటి అంతర్జాతీయ విమాన విమానాశ్రయాల్లోనే భారీ సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు.

**భారతీయ విమానయాన సంస్థలపై ప్రభావం**

ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ పరస్పర దాడుల ప్రభావం భారతీయ విమానయాన సంస్థలపై పడింది. మధ్యప్రాచ్య దేశాలకు నడిచే అన్ని సర్వీసులను శనివారం అర్ధరాత్రి వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. "ఇరాన్, మధ్యప్రాచ్య గగనతలంలో విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో అటువేపు వెళ్లే, వచ్చే అన్ని విమానాలను రద్దు చేస్తున్నాం" అని ఇండిగో ట్వీట్ చేసింది. దీంతో దుబాయ్, జెడ్డా, దోహా, అబుదాబి, దమ్మామ్, బహ్రెయిన్, షార్జా, కువైట్, రస్ అల్-ఖైమా నగరాలకు సర్వీసులు నిలిచిపోయాయి. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఇండిగో స్పష్టం చేసింది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పశ్చిమాసియా వెళ్లే అన్ని అంతర్జాతీయ విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం ఎయిర్ ఇండియా కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలోని అన్ని గమ్యస్థానాలకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ (టెల్ అవీవ్) వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం (ూ×139) గాలిలో ఉండగానే భద్రతా కారణాల దృష్ట్యా వెనక్కి మళ్లింది. దీన్ని ముంబైలో సురక్షితంగా పైలెట్లు ల్యాడ్ చేశారు. బోయింగ్ 777 విమానం గాలిలో సుమారు ఐదు గంటల పాటు ప్రయాణించింది. సౌదీ అరేబియా గగనతలంలో ఉన్న సమయంలో, ఇజ్రాయెల్ ఎయిర్‌స్పేస్ మూతపడటంతో పైలట్లు విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీనివల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్ ఇండియా విచారం వ్యక్తం చేసింది. గగనతలాల మూసివేత కారణంగా అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విమానాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ కూడా వెల్లడించింది.

**విదేశీ సర్వీసులు**

ఖతార్ ఎయిర్‌వేస్ తమ గగనతలం మూసివేత వల్ల దోహాకు రావాల్సిన, అక్కడి నుంచి వెళ్లాల్సిన అన్ని విమానాలను తాత్కాలికంగా రద్దు చేసింది. దుబాయ్ కేంద్రంగా నడిచే పలు సర్వీసులు నిలిచిపోయాయని, ప్రయాణికులు తమ విమాన స్థితిని ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవాలని ఎమిరేట్స్ సూచించింది. లెబనాన్, సిరియా, ఇరాక్, ఇరాన్,జోర్డాన్ దేశాలకు సోమవారం వరకు విమానాలను నిలిపివేసినట్లు టర్కిష్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. లండన్ నుంచి దుబాయ్‌కి వెళ్లే విమానాలను వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్?లైన్స్ రద్దు చేసింది. ఇరాక్ మీదుగా వెళ్లే మార్గాన్ని మళ్లించడం వల్ల భారత్, మాల్దీవులు, రియాద్, దుబాయ్ వెళ్లే విమాన ప్రయాణ సమయం మరింత పెరుగుతుందని తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో దారి మళ్లించడానికి వీలుగా విమానాల్లో అదనపు ఇంధనాన్ని నింపుతున్నట్లు పేర్కొంది. డచ్ విమానయాన సంస్థ కేఎల్ఎం ఆదివారం నుంచి టెల్ అవీవ్‌కు విమానాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధ వల్ల వేలమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. కొన్ని విమానయాన సంస్థలు విమాన మార్గాలను మళ్లించడం వల్ల ఇంధన ఖర్చులు పెరగడంతో పాటు, ప్రయాణ సమయం కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో రానున్న రోజుల్లో మరిన్ని విమాన సంస్థలు సర్వీసులను నిలిపివేసే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరగనున్నాయి

## తుది 'జాబితా' విడుదల.. ఓటర్లలో టెన్షన్!

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్)లోని తుది ఓటర్ల జాబితా శనివారం అందుబాటులోకి వచ్చింది. ఈ జాబితాను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికంటే ముందే నేరుగా పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా కలకలం చెలరేగింది. తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకునేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివస్తుండటంతో అన్ని జిల్లాల్లోనూ కోలాహలం నెలకొంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజాము నుంచే ఓటర్ల జాబితా హార్డ్ కాపీలను జిల్లా మేజిస్ట్రేట్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు చేరవేశారు. అక్కడి నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) విడతల వారీగా ఈ జాబితాలను సేకరించి, ఆయా కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా ఈ సవరణ ప్రక్రియలో దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లపై సందిగ్ధత నెలకొనడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియలో భాగంగా ఈ పేర్లను 'పరిశీలన' విభాగంలో ఉంచారు. తాజాగా విడుదలైన తుది జాబితాలో వారిలో ఎంతమంది పేర్లు మనుగడలో ఉన్నాయి? ఇంకెంతమంది పేర్లు తొలగించారనే అంశం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో జాబితా అప్‌లోడ్ అయ్యేలోపు క్షేత్రస్థాయిలో పారదర్శకతను పెంచేందుకే ఆఫ్‌లైన్ పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చామని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ, ఓటర్లలో నెలకొన్న ఉత్కంఠ కారణంగా పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరుతున్నారు. తమ ఓటు హక్కు సురక్షితంగా ఉందో లేదోనన్న ఆందోళన ఓటర్లలో వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ పరిణామం బెంగాల్ రాజకీయ వర్గాల్లో సెగలు పుట్టిస్తోంది. తుది జాబితా వెలువడటంతో అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు అప్రమత్తమయ్యారు. ప్రతి నియోజకవర్గంలోనూ బూత్‌ల వారీగా డేటాను విశ్లేషించేందుకు పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయికి చేరుకున్నారు. ఓట్ల తొలగింపుపై అప్పుడే ఆరోపణలు, ప్రత్యారోపణలు మొదలయ్యాయి. స్వల్ప మార్పులు కూడా గెలుపోటములను శాసించే అవకాశం ఉండటంతో, తమ పార్టీ మద్దతుదారులైన ఓట్లర్ల పేర్లను నిర్ధారించుకునే పనిలో పడ్డారు. ఎన్నికల సంఘం మాత్రం పారదర్శకతే తమ ప్రథమ కర్తవ్యమని పునరుద్ఘాటించింది. అర్హులైన ఓటర్ల పేర్లు ఎవరివైనా జాబితాలో లేకపోయినా లేదా ఏవైనా తప్పులున్నా తక్షణమే ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఆశ్రయించవచ్చని అధికారులు సూచించారు.



# మండలిలో మంటలు

**విజయవాడ**

ఏపీలో మండలి సమావేశాలు ఇంట్రెస్టింగ్‌గా నడుస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అయినా..ఇప్పుడు కూటమి పవర్‌లో ఉండగా..మండలిలో మాత్రమే చర్చ జరుగుతుండటం ఆసక్తికరంగా మారింది. 2020లో మండలిలో టీడీపీ బలంగా ఉండేది. అప్పుడు అసెంబ్లీలో వైసీపీకి 151 సీట్లు ఉండటంతో వార్ వన్ సైడ్ అన్నట్లుగా సమావేశాలు నడిచాయి. టీడీపీ సభకు వెళ్లినా గొడవ జరగడం, వాకౌట్‌లు అంటూ నిరసన వ్యక్తం చేయడం నడిచేవి. దీంతో సంఖ్యాపరంగా అప్పుడు వైసీపీ అసెంబ్లీలో బలంగా ఉండటంతో వారిదే అప్పర్ హ్యాండ్‌గా ఉండేది. అదే సమయంలో మండలిలో మాత్రం అప్పుడు టీడీపీ బలంగా ఉంటూ పోరాడుతూ వచ్చింది. అప్పుడు టీడీపీకి మండలిలో ఎమ్మెల్సీల బలం ఉండటంతో పాటు ఛైర్మన్ కూడా ఆ పార్టీ నియమించిన వ్యక్తి ఉండటంతో.. పెద్దల సభలో వైసీపీ దూకుడును అడ్డుకోగలిగింది. అమరావతి బిల్లును వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసినా..మండలికి వచ్చేసరికి టీడీపీ బ్రేకులు వేయడంతో ఆగిపోయింది. దీంతో ఒకానొక సమయంలో అప్పటి వైసీపీ సర్కార్ మండలిని రద్దు చేసే ఆలోచన కూడా చేసింది. ఇప్పుడు సీన్ మారింది. సీట్లు కూడా మారాయి. విపక్షంలో ఉన్న వైసీపీ అసెంబ్లీకి వెళ్లడం లేదు. మండలిలో మాత్రం తమకున్న బలంతో స్ట్రాంగ్ వాయిస్ వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో 164 సీట్లతో బలంగా ఉన్న కూటమి అక్కడ తమ వాయిస్‌ను వినిపిస్తూ, వైసీపీ తప్పులను ఎత్తిచూపుతోంది. మండలిలో వైసీపీ బలంగా ఉండటంతో..కూటమి సర్కార్ ఏం చేసినా అడ్డుకుంటుండంతో కూటమికి అక్కడ సవాల్‌గా మారింది. కల్తీ నెయ్యిపై చర్చ సందర్భంగా..రచ్చ రచ్చ అయింది. కల్తీ నెయ్యి అంశంపై షార్ట్ డిస్కషన్‌కు ఛైర్మన్ మోషేన్ రాజు అనుమతించారు. వైసీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అయితే స్వల్పకాలిక చర్చ కోసం వైసీపీ నోటీసు ఇవ్వకపోయినా..ఆ పార్టీ సభ్యుడికి మాట్లాడే అవకాశమిచ్చారంటూ టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందిసేమ్‌టైమ్ దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్తీ నెయ్యి అంశంపై ప్రకటన చేసేందుకు లేచి నిలబడ్డారు. అయినా మండలి ఛైర్మన్..వైసీపీ సభ్యుడికే




లఘు చర్చను ప్రారంభించే అవకాశం ఇచ్చారంటూ టీడీపీ మ-రోసారి అబ్జక్షన్స్ వ్యక్తం చేసింది. ఈ సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మధ్య తీవ్ర వాదనలు జరిగాయి. వైసీపీ ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించి లఘు చర్చకు అనుమతించడమే కాకుండా, ప్రభుత్వం తరఫున ప్రకటనకు నిరాకరించడం సరైంది కాదంటూ..టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వాదోపవాదాలు, అధికార-విపక్ష సభ్యుల ఆందోళనలతో మండలిలో గందరగోళం ఏర్పడింది. చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది. అయితే ఇప్పుడు మండలిలో వైసీపీకి మెజార్టీ ఉంది. పైగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు కూడా వైసీపీ హయాంలో నియమించబడ్డారు. దీంతో పెద్దల సభలో ఆ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధించే ప్రయత్నం చేస్తుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే షార్ట్ డిస్కషన్‌పై నిబంధనలు పక్కన పెట్టి మండలి ఛైర్మన్ వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తుంది. మోషేన్ రాజు మాత్రం..అధికార పక్షం అలిగేషన్స్‌ను తప్పుబడుతున్నారు. నోటీస్ విషయంలో పక్కదారి పట్టించేలా మాట్లాడటం సరికాదంటున్నారు. దీంతో మండలిలో కూటమి వర్సెస్ వైసీపీ ఫైట్ ఆసక్తికరంగా మారింది. మరోవైపు మండలిలో అప్పర్ హ్యాండ్ సాధించేందుకు కూటమి ప్లాన్స్ చేస్తుంది. ఇప్పటికే ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరారు. ఇందులో ఐదుగురు రాజీనామా చేయగా..స్పీకర్ వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటున్నారు. ఈ ఐదుగురి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదిస్తే..ఆ సీట్లు కూటమి ఖాతాలోకి వెళ్లనున్నాయి. అప్పుడు మండలిలో కూటమి బలం పెరగనుంది. తర్వాత మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలను కూడా ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి కూటమి గూటికి చేరేందుకు రెడీగా ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ కొందరు ఎమ్మెల్సీల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ సీట్లు కూడా కూటమినే కైవసం చేసుకోనుంది. ఏదైనా మండలిలో జరుగుతున్న ఫైట్..పొలిటికల్ హాట్ టాపిక్‌గా..పబ్లిక్ అటెన్ష-న్‌ను గ్రాబ్ చేసేలా ఉందనడంలో డౌటే లేదు.

# ప్రకాశంలో ఐరన్ ఓర్ నిల్వలు

**ఒంగోలు :** ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలటంతో.. జియోలాజికల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. మాగ్నటైట్ నిల్వలు ఎంతమేరకు ఉన్నాయనే దానిపై డ్రిల్లింగ్ పనులు చేపట్టాయి. ప్రాథమిక అంచనా మేరకు ప్రకాశం జిల్లాలో భారీగా ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు తేలితే.. ఏపీ మైనింగ్ రంగానికి ఓ బిగ్ బూస్ట్ కానుందని అధికారులు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడించాయి. భూ ఉపరితలం కిందిభాగంలో మాగ్నటైట్ నిల్వలు గణనీయమైన స్థాయిలో ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాగ్నటైట్ ఖనిజం పరిధి, లోతు, నాణ్యతను అంచనా వేయడానికి జియోలాజికల్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించాయి. ప్రకాశం జిల్లాలోని ఎంపిక చేసిన మండలాల్లో డ్రిల్లింగ్ కార్యకలాపాలను నిర్వహించాయి. ప్రకాశం జిల్లాలో సేకరించిన మాగ్నెటైట్ నమూనాలలో ఇనుము 18 నుంచి 25 శాతం వరకు ఉందని నిపుణులు తెలిపారు. సాధారణంగా దీనిని లోగ్రేడ్ ఐరన్ ఓర్‌గా పిలుస్తుంటారు. అయితే ప్రాసెసింగ్ చేసిన తర్వాత పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రకాశం జిల్లాలో సుమారుగా 800 మిలియన్ టన్నుల మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు అంచనా. అయితే ఎంత మొత్తంలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నాయి, వాణిజ్య పరమైన ఉపయోగాలు వంటి అంశాలపై మరింత స్పష్టత కోసం జియోలాజికల్ మ్యాపింగ్, ఫీజబులిటీ అధ్యయనాలు జరుగుతున్నాయి. ప్రాథమిక అంచనాలు నిజమై ప్రకాశం జిల్లాలో గణనీయమైన స్థాయిలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు తేలితే ప్రకాశం జిల్లా ఏపీ ఖనిజ



రంగానికి గణనీయమైన సహాయకారిగా మారుతుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు మాగ్నటైట్ అన్వేషణ కోసం ప్రైవేట్ ఉక్కు దిగ్గజం ఏఎంఎన్ఎస్ స్టీల్ బిడ్ గెలుచుకుంది. పైలట్ స్టడీ కింద ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. మరోవైపు ఖనిజాలను ముడి పదార్థం రూపంలో ఎగుమతి చేయబోమని అధికారులు చెప్తున్నారు. ధాతువును శుద్ధి చేయడానికి, మలినాలను తొలగించడానికి, ఇనుము శాతాన్ని పెంచడంతో పాటుగా లోగ్రేడ్ మాగ్నటైట్‌ను ఉక్కు తయారీకి అనువైన హైగ్రేడ్ పదార్థంగా మార్చడానికి జిల్లాలో బెనిఫిషియేషన్ ప్లాంట్ ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనివలన ఆర్థికపరమైన కార్యకలాపాలు పెరగటంతో పాటుగా స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలతో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధి ఊపందుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఇంకా ఖనిజాన్ని కనుగొనే దశలోనే ఉందని.. మైనింగ్‌కు ముందు అనుమతులు, పర్యావరణ అధ్యయనాలు, ప్రజా సంప్రదింపులు ఉంటాయని అధికారులు వెల్లడించారు

## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం

-మొదటిపేజీ తరువాయి

ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ వద్ద ఇంకా పేలుళ్లు చోటుచేసుకుంటున్నట్టు అధికారులు తెలియజేశారని, పేలుళ్లకు కారణాలపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకి ధైర్యం చెప్పి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటనాస్థలానికి పంపించినట్లు తెలిపారు.

# మార్చి 1 నుంచి మండే ఎండలు

**విశాఖపట్టణం :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడ్రోజుల నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని మాత్వాడా వరకు వ్యాపించి ఉన్న ద్రోణి వాయువ్య దిశగా కదులుతుంది. దీని ప్రభావంతో శుక్రవారం సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ణి ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని



ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 4.36 సెంటీమీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో అత్యల్పంగా 1.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి వంటి పలు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ అకాల వర్షాలకు రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పలు జిల్లాల్లో మొక్కజొన్న, శనగ, జొన్న పంటలు నేలకొరిగాయి. గింజ పాలు పోసుకునే దశలో మొక్కజొన్న నేలవాలడంతో ఎదుగుదల కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో శుద్ధి చేసి ఆరబెట్టిన పసుపు గాలివానకు తడిసిపోయింది. శనివారం నుంచి వాతావరణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. ఉక్కపోతలు కూడా రేపట్నుంచి మొదలవుతాయని వాతావరణ కేంద్రం వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21గా నమోదవుతున్నాయి. మార్చి 1 నుంచి ఎండలు మండిపోతాయని జనాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## ఘోర ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

మంగ, గోడత మహేష్, మందపల్లి చిన్ని, నిమ్మడ కరుణ, గొట్ట మహేష్, రమణ, నానిలు ఉన్నారు.

**డీఎన్ఏ టెస్టుల ఆధారంగా మృతదేహాల అప్పగింత**

డీఎన్ఏ టెస్టుల ఆధారంగా మృతదేహాలను అప్పగించే పనిలో పడ్డారు అధికారులు. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత మృతదేహాలను అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు.

**కాకినాడ జిల్లాలో భారీ పేలుడు.. మంటల్లో 50 మంది..!**

ప్రమాదం సమయంలో 70 మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. పేలుడు ధాటికి చుట్టు పక్కల ఇళ్లు ధ్వంసమయ్యాయి. దట్టమైన పొగలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది, ఇతర సహాయక బృందాలు సహాయక చర్యల్ని చేపట్టాయి. ఘటనా స్థలంలో బాధిత కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి.

**గతంలో భారీ పేలుళ్లు, విషాదాలు**

బాణసంచా తయారీ సందర్భాల్లో అనేక ప్రమాదాలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. బాణాసంచా తయారీకి ప్రసిద్ధి చెందిన వేట్లపాలెం, పరిసర గ్రామాల్లో ఇలాంటి భారీ ప్రమాదాలు జరగడం, పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వేట్లపాలెం, జువ్విపాడు, ద్రాక్షారామ, వేళంగి, రాయవరం, వి.సావరం, కొమరిపాలెం, బిక్కవోలు, మండపేట తదితర ప్రాంతాల్లో తయారీ కేంద్రాలున్నాయి. ఏడాది పొడవునా ఇక్కడి వ్యాపారులకు చేతినిండా పని ఉంటుంది. బాణసంచా తయారీ కోసం ఫారమ్ 20, కేవలం అమ్మకం కోసం ఫారమ్ 24 జారీ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా లైసెన్స్‌డ్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని మండపేట, జువ్విపాడు, ద్రాక్షారామం, కొమరిపాలెం, రాయవరం, బిక్కవోలు, యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప తదితర చోట్ల బాణసంచా కేంద్రాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే వాకతిప్పలో 2014 అక్టోబర్ 22వ తేదీన చోటు చేసుకున్న ఘటన ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటన అనేక లోపాలను ఎత్తిచూపింది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస గ్రామంలో కిరాణా షాపులో బాణసంచా పేలి భార్యాభర్తలు కంచర్ల శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి మృతిచెందారు. అలాగే గత ఏడాది రాయవరంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన భారీ పేలుడులో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడిక్కడే మరణించారు.

## గత పాలకులు ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్ల లోపు బాలికలంతా విధిగా హెచ్ పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డలు సర్వై కల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశ వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ వల్లే ప్రపంచవ్యాప్తంగా 74 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63 శాతం ఉండగా మన రాష్ట్రంలో 68 శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379 నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లో నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వై కల్ వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువుగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్ష మంది మహిళల్లో 15 నుంచి 20 మంది సర్వై కల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస-్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్ల లోపు వయసున్న బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటు చేసి 16,912 సిబ్బందిని నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 90--70--90 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18 మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతో పాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు, యువిన్ యాప్ ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీని వల్ల ప్రమాదం ఉండదు. 15 ఏళ్ల వయసున్న బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షల మంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. 20 నెలలుగా ఒకటో తేదీన నేను స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 62,76,322 మందికి పింఛన్లు ఇస్తుండగా, నెలకు రూ.2,726 కోట్ల మేర ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి ఈ పథకం కోసం రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే నిలిపి వేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో మూడు నెలలదీ కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

-మొదటిపేజీ తరువాయి

విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభి-ప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభి-ప్రాయపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సంపాదకీయం

# చెంపదెబ్బ.. గోడదెబ్బ!

**భారత న్యాయవ్యవస్థ తన స్వతంత్రతను చాటుకుంటూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సిబిఐ దర్యాప్తును తప్పుబట్టడం ఒకటయితే, పాఠ్యపుస్తకాల్లో న్యాయవ్యవస్థను కించపరిచేలా ఉన్న అంశాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం మరొకటి. ఈ రెండు పరిణామాలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి.**

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి. ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యుడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుం టున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు. ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధం చాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.



**కంచర్ల అచ్యుత రావు**
**ఎడిటర్, మనసులో మాట, తెలుగు దినపత్రిక**

# 21 మంది సజీవ దహనం

- కాకినాడ జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు
- పలువురికి గాయాలు
- సామర్లకోట సమీపం వేట్లపాలెం వద్ద ఘటన
- పేలుడు ధాటికి దట్టంగా అలముకున్న పొగ
- 5 కి.మీ వరకు పేలుడు శబ్దాలు వ్యాప్తి
- రంగంలోకి దిగిన రెండు ఫైర్ ఇంజన్లు



**కాకినాడ, ఫిబ్రవరి 28:** కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



## ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా బాధాకర మన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

## పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ఆరా తసిన సిఎం అధికారులతో మాట్లాడారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటన గురించి అధికారులు తెలియజేశారు. దీంతో విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు... ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# మరోమారు యుద్ధమేఘాలు

**ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు**

**ప్రతిదాడులకు దిగిన ఇరాన్**

**టెలిఅవీవ్, ఫిబ్రవరి 28:** మరోమారు యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణ దాడులకు దిగింది. అణు ఒప్పందంపై అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో టెల్‌అవీవ్ సైన్యం తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. టెల్‌అవీవ్‌తో సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. స్కూళ్లు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది. ఈ దాడుల్లో అమెరికా హస్తం కూడా ఉన్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో పౌర విమానాలకు ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అటు ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకెళ్లాయి. ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఇజ్రాయెల్–అమెరికా కలిపి కొన్నిగంటల క్రితం ఇరాన్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌వైపు నుంచి స్పందన వచ్చింది.



## విమాన సర్వీసుల రద్దు

ఇరాన్, ఇజ్రాయెల్‌కు పలు దేశాలు తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిరిండియా ప్రకటించాయి. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు కీలకమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విమానయాన సంస్థల్లో ఎయిర్ ఫ్రాన్స్, ఎయిరిండియా, బ్రిటిష్ ఎయిర్ వేస్, ఐబీరియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, జపాన్ ఎయిర్‌లైన్స్, ఎల్‌ఓటీ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా, నార్వేజియన్ ఎయిర్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎయిర్ అల్జీరియా, స్కాండేవియన్ ఎయిర్‌లైన్స్, విజ్ ఎయిర్ ఉన్నాయి.

# ఇరాన్‌లో స్కూల్‌పై బాంబు దాడి

- 40మంది మృతి చెందినట్లు సమాచారం
- చాలామందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలుసంయుక్త దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలోనే హార్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45 మంది గాయపడినట్లు తెలిపింది. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్'కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ ఘటనపై ఇంకా స్పందించలేదు. సదరన్ ఇరాన్?లోని మినాబ్ సిటీలో ఉన్న ఒక ఎలిమెంటరీ గర్ల్స్ స్కూల్‌పై ఇజ్రాయెల్ బాంబులేసింది. ఈ దాడిలో 40 మంది విద్యార్థినులు చనిపోయారు. చాలా మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. మినాబ్ సిటీ ఈ బాంబు దాడులతో వణికిపోయింది. మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాల సమయంలో ఈ ఘటన జరిగింది. ఇదిలా ఉండగా..



ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలను కూడా ఇరాన్ టార్గెట్ చేసింది. సౌదీ అరేబియా, అబుదాబితో సహా 8 దేశాలపై ఇరాన్ మిస్సైల్స్‌తో అటాక్ చేస్తుండటంతో యూఏఈ, బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలు భయంతో వణికిపోతున్నాయి. బెహ్రాయిన్‌లోని అమెరికా మిలటరీ బేస్‌పై ఇరాన్ బాంబు దాడులు చేసింది. ఈ దాడి దృశ్యాలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఖతార్ రాజధాని దోహాలో కూడా రెండు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఖతార్ రక్షణ శాఖ ధృవీకరించింది. ఇదిలా ఉండగా.. బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలపై ఇరాన్ అటాక్స్‌ను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
ఆదివారం 1 మార్చి 2026 పేజీ : 5

# ప్రజలను అయోమయంలో పడేసిన ఢిల్లీ లిక్కర్ కేసు : భీశెట్టి



**విజయనగరం (మనసులోమాట) ఫిబ్రవరి 29:** దేశంలోనే సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కేసులో రౌస్ ఆవెన్యూ కోర్టు 598 పేజీల సంచలన తీర్పు దేశ ప్రజలను తీవ్ర అయోమయంలో పడేసిందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన నిందితులుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా,కల్వకుంట్ల కవిత తో పాటుగా 23 మందిని నిర్దోషులుగా రౌస్ ఆవెన్యూ జిల్లా కోర్ట్ స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ ప్రకటించడం దేశంలో వ్యవస్థలు పనిచేస్తున్న తీరుని ప్రతిబింబించాయని, దాదాపు మూడేళ్ళ పాటు ఢిల్లీ రాజకీయాలు లిక్కర్ కేసు చుట్టూనే తిరిగాయని ప్రతి నిత్యం మీడియా లో అనేక చర్చలు కూడా జరిగాయని,చివరికి మద్యం కేసు ఓ ఫార్స్, ఓ ఫాల్స్ గా ప్రజల ముందుకు రావడంతో దర్యాప్తు సంస్థలు దేశంలో దిష్టిబొమ్మలా ప్రజల ముందు నవ్వులపాలు అయ్యే పరిస్థితి ఏర్పడిందని ఈ తీర్పు చట్టపరంగా రాజకీయంగా వ్యవస్థ పై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని సీబీఐ,ఈడి లాంటి సంస్థలు భవిష్యత్తు లో మరింత జాగ్రత్తలు తీసుకోకపోతే కేసులు కుప్పకూలుతాయని ప్రజలకు ఏది నమ్మాలో నమ్మకూడదో తెలియని పరిస్థితి ఉంటుందని భీశెట్టి అన్నారు,ఈ తీర్పు అప్ కి రాజకీయ శక్తిని ఇస్తుందని,విపక్షాలకు దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం అనే ఆయుధం ఇస్తుందని, ప్రజలు గందరగోళం లో ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థ కి చాలా ప్రమాదమని భీశెట్టి హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా

## సుపరిపాలన- ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం

- కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు - మూడేళ్లలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి
- గత పాలనలో ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం - విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు





**విజయనగరం, (మనసులోమాట జిల్లా ప్రతినిధి) ఫిబ్రవరి 28:** రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్ల లోపు బాలికలంతా విధిగా హెచ్ పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావి వలసలో హెచ్ పీవీ వ్యాక్సినేషన్ , పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడబిడ్డలు సర్వై కల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశ వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ వల్లే ప్రపంచవ్యాప్తంగా 74 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63 శాతం ఉండగా మన రాష్ట్రంలో 68 శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379 నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లో నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వై కల్ వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువుగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్ష మంది మహిళల్లో 15 నుంచి 20 మంది సర్వై కల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్ కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్ల లోపు వయసున్న బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటు చేసి 16,912 సిబ్బందిని నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**లక్షలో 18 మంది క్యాన్సర్ బారిన**

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 907090 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18 మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతో పాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు, యువిన్ యాప్ ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీని వల్ల ప్రమాదం ఉండదు. 15 ఏళ్ల వయసున్న బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రజారోగ్యానికి రాష్ట్రంలో అధిక ప్రాధాన్యత**

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తృతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షల మంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. నోటి క్యాన్సర్‌కు సంబంధించి 5,07,590 మందిని, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి 2,50,897 మంది, సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించి 3,40,154 మందిని రిఫర్ చేశాం. కర్నూలులో రూ. 50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. గత బడ్జెట్ కంటే 4 శాతం పెంచి ఈ బడ్జెట్ లో వైద్య ఆరోగ్య రంగానికి రూ.19305 కోట్లు కేటాయించాం. రాష్ట్ర బడ్జెట్ లో ఇది 6 శాతంగా ఉండటం ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యతకు నిదర్శనం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు అందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించేలా ఈ పాలసీ రూపకల్పన జరిగింది. ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. క్రిమిసంహారక మందులతో పండించిన ఆహారం తీసుకుని క్యాన్సర్ బారిన పడుతున్నాం. అలాగే ప్రతి ఒక్కరూ మితాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తీర్చిదిద్దాలనే ది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.



## 50 ఏళ్ల కె పింఛన్ హామీపై స్పష్టత ఇవ్వాలి భీమిరెడ్డి గోవిందరావు డిమాండ్

**మాకవరపాలెం ఫిబ్రవరి 28(మనసులో మాట)..** మాకవరపాలెం మండలంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాలంటీర్ విభాగం సంయుక్త కార్యదర్శి భీమిరెడ్డి గోవిందరావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో "సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ అందిస్తామని ఘనంగా ప్రకటించారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోందని అన్నారు.ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్టీఆర్ పెన్షన్ స్కీమ్ కింద పింఛన్లు పంపిణీ చేస్తూ నాయకులు ప్రతి నెల ఇంటింటికీ వెళ్తున్నారని పేర్కొన్నారు. అయితే 50 ఏళ్ల వారికి పింఛన్ ఇస్తామని చెప్పిన హామీపై మాత్రం ఒక్క ప్రకటన కూడా చేయకపోవడం ప్రజలను మోసం చేసినట్లేనని ఆరోపించారు. ప్రజల ముందుకు వచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అది రాజకీయ బాధ్యతారాహిత్యమని భీమిరెడ్డి గోవిందరావు వ్యాఖ్యానించారు. ప్రచారం కోసం ఇంటింటికీ వెళ్లే నాయకులు, హామీ అమలు విషయంలో ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే 50 సంవత్సరాల పింఛన్ అంశంపై స్పష్టమైన ప్రకటన చేసి, అమలు తేదీని వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## త్వరలో రూ. 185 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం పనులు..

- వేసవికి ముందే మంచినీటి కి చర్యలు...
- సీఎం, స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిలర్ పద్మావతి



నర్సీపట్నం ,ఫిబ్రవరి 28 (మనసులో మాట)

నర్సీపట్నం : శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం కౌన్సిలర్ చింతకాయల పద్మావతి గారు మీడియాతో మాట్లాడారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నందుకు కమిషనర్‌కు, సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. అలాగే పట్టణంలో 150 ఎలక్ట్రికల్ పోల్స్ వేయడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ప్రజలకు శుభవార్త తెలుపుతూ, రూ. 185 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఆమె వెల్లడించారు. వీఎంఆర్డీఏ (వి ఎం ఆర్ డి ఏ) నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ. 8 కోట్లు మంజూరు చేశారని, కొద్ది రోజుల్లోనే ఈ పనులకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కోనేటి రామకృష్ణ చేసిన వ్యాఖ్యలకు పద్మావతి గారు బదులిచ్చారు. గత ప్రభుత్వం రూ. 6 కోట్లతో మెయిన్ రోడ్డు వేసి అభివృద్ధి చేశామని చెబుతోందని, కానీ ఆ రోడ్డు వేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇంకా తిరుగుతూనే ఉన్నారని ఆమె విమర్శించారు. గత సీఎం రాష్ట్రవ్యాప్తంగా రూ. 16 కోట్లు ఇస్తానని బటన్ నొక్కి నిధులు విడుదల చేయలేదని, ఆ భారం ఇప్పుడు మున్సిపాలిటీపై పడిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేవలం 20 నెలల వ్యవధిలోనే మొత్తం రూ. 32 కోట్ల రూపాయలను అందించారని ఆమె స్పష్టం చేశారు.

# అమ్మ భాషను బతికించుకుందాం!

## - ఆంగ్ల మోజులో మాతృభాషను మరువొద్దు.. మాతృభాష నిర్లక్ష్యానికి తల్లిదండ్రులు, పాలకులదే బాధ్యత: ప్రపంచ తెలుగు మహాసభల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు





**నర్సీపట్నం ,ఫిబ్రవరి 28 (మనసులో మాట)..** అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల, రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రసంగించారు. వేదికపై ఆసీనులైన బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు గార్లకు పాదాభివందనం చేసిన అనంతరం, తన రాజకీయ జీవిత ప్రదాత స్వర్గీయ నందమూరి తారకరామారావును ఆయన స్మరించుకున్నారు. ఈ మహాసభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు, ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి తదితరులు హాజరయ్యారు.

ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఎక్కడున్నా మాతృభాషను ఎంతో ఆదరిస్తుంటే, మన సొంత రాష్ట్రంలోనే తెలుగు మాట్లాడే పరిస్థితి కరువవ్వడం అత్యంత బాధాకరమని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ప్రచారాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం కానీ, అమ్మ భాషను బతికించుకునే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఒకప్పుడు 'అమ్మా', 'నాన్నా' అని ఆప్యాయంగా పిలిచే సంస్కృతి ఉండేదని, నేడు ఆ స్థానంలో 'హాయ్ బ్రో', 'సిస్', 'మమ్మీ', 'డాడీ', 'గ్రాండ్ ఫా' వంటి ఆంగ్ల పదాలు వచ్చి చేరాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. విదేశాల్లో స్థిరపడటానికి, ఉద్యోగాల కోసం ఆంగ్లం నేర్చుకోవడం తప్పు కాదని, కానీ కనీసం ఇంట్లో కుటుంబ సభ్యులతోనైనా తెలుగులో మాట్లాడేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. మాతృభాష పట్ల నేటి తరంలో కనిపిస్తున్న ఈ నిర్లక్ష్యానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాలకులదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

మాతృభాష పరిరక్షణ దిశగా శాసనసభ స్పీకర్‌గా తాను ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు అయ్యన్నపాత్రుడు సభముఖంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగును ఒక తప్పనిసరి పాఠ్యాంశంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ఒక తీర్మానం కూడా ప్రవేశపెట్టబోతున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే, శాసనసభలో సభ్యులంతా తప్పనిసరిగా తెలుగులోనే మాట్లాడాలని, ప్రశ్నలు తెలుగులోనే అడగాలని, మంత్రులు సైతం సమాధానాలు తెలుగులోనే చెప్పాలని తాను ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేశారు. ఈ నిర్ణయాల విజయవంతమైన అమలుకు వేదికపై ఉన్న పండితుల, పెద్దల ఆశీస్సులు, సలహాలు ఎంతో అవసరమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు.



## వైభవంగా దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి

# కళ్యాణ మహోత్సవం

### శ్రీవారి ని దర్శించుకున్న దేవాదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ కేఎల్ సుధారాణి

**అనకాపల్లి, ఫిబ్రవరి 28 (మనసు లో మాట):** అనకాపల్లి దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం దేవాదాయ ధర్మదాయ శాఖ ఉపకమిషనర్ కేఎల్ సుధారాణి శ్రీవారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అంతకముందు దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని అమె ప్రారంభించారు. ముందు గా స్వామి వారి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవాదాయ ధర్మాదాయ ఉప కమిషనర్ కేఎల్ సుధారాణి స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాదికార కె.చంద్ర తేజ, దేవాలయ ప్రధాన అర్చకులు పులకడం గిరిబాబు, ధర్మకర్తలు గోలి మురళి, సిహెచ్ నూకరాజు, కొణతాల అరుణ, నిమ్మకాయల తులసి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ



**మాకవరపాలెం ఫిబ్రవరి 28 (మనసులో మాట)..** మాకవరపాలెం మండలం, బూరుగుపాలెం పంచాయితీ: ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం బూరుగుపాలెం పంచాయితీలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి చిరంజీవి పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, విధవులు, దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హుడికి పారదర్శకంగా పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొని పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారు. పెన్షన్‌లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

## ఏఎంఏఎల్ కళాశాలలో ఘనంగా

# 40 వ జాతీయ సైన్స్ దినోత్సవం




**అనకాపల్లి, ఫిబ్రవరి 28 (మనసు లో మాట):** స్థానిక ఏ.ఎం.ఏ.ఎల్. కళాశాలలో శనివారం 40వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి కళాశాల గవర్నింగ్ బాడీ కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సర్ సి.వి. రామన్ జీవిత విశేషాలను తెలియజేసి, వారు కనుగొన్న రామన్ ఎఫెక్ట్ గురించి వివరించి, ప్రతి విద్యార్థి కూడా ఒక సి.వి. రామన్ స్థాయికి ఎదగాలని, ఆ విధమైన ఆచరణ చేయాలని పిలుపునిచ్చారు. తర్వాత కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రీసెర్చ్ జరగాలని ఆ దిశగా విద్యార్థులు ఆలోచన చేయాలని కోరారు. కెమిస్ట్రీ ఫ్యాకల్టీ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లోను కృషి, పట్టుదల ఉన్నట్లయితే ఒక ఋషిగా ఎదగవచ్చు అని సూచన చేశారు. అంతకముందు విద్యార్థులకు వివిధ పోటీ కార్యక్రమాలను నిర్వహించి వాటిలో మొదటి మూడు స్థానాలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు, కళాశాల సూపరింటెండెంట్ పి. అనురాధ, టీచింగ్, నాన్ టీచింగ్ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఈనెల 22నుంచి శాస్త్రీయ సంగీత పోటీలు

**విజయనగరం (మనసులోమాట ) జిల్లా ప్రతినిధి) ఫిబ్రవరి 29:** ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం మార్చి 22,23,24 వ తేదీలలో నిర్వహించు 68వ వార్షికోత్సవాన్ని శాస్త్రీయ పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా అంతర్జాలంలో శాస్త్రీయ సంగీత పోటీలు నిర్వహించబోతోంది. గాత్రం, మృదంగం, వయొలిన్, వీణ, వేణువు, ఉపవాద్యాలైన కంజీర, ఘటం, మోర్సింగ్ మరియు కొనక్కోలు విభాగాలలో ఒక్కొక్క దానిలో 4 అంశాలను పెడుతూ ఇదివరకు ఎప్పుడూ లేని విధంగా నిర్వహించబోతోంది. దీని పూర్తి వివరాలు ఆన్లైన్ లో ఌఌ.టట్లు1958.శీతీస్త్ర అనే ఌవఎంఔవ ద్వారా పొందవచ్చు. లేదా 8500605311 అనే నంబర్ లో వాట్సాప్ ద్వారా మరింత సమాచారాన్ని పొందవచ్చు. పోటీ మార్చి 15 వ తేదీన జరుగుతుంది. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోడానికి ఆఖరి తేదీ మార్చ్ 13. విజేతలను 22వ తేదీన వార్షికోత్సవ సభలో ప్రకటిస్తారు. వారికి బహుమతులుగా సర్టిఫికెట్ తో పాటు ఆగస్టు నెలలో నిర్వహించు కార్యక్రమంలో కచేరి చేసే అవకాశాన్ని కల్పిస్తారు.

# యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా శ్రీరంగం రమేష్

- ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు
- పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ద్వారపురెడ్డి పిలుపు
- అభినందించిన సీనియర్ నాయకులు



అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 28 (మనసులో మాట): అనకాపల్లి జిల్లా యువ మోర్చా అధ్యక్షుడిగా శ్రీరంగం రమేష్ నియమితులయ్యారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు శ్రీరంగం రమేష్ ను నియమించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేసే వారికి బిజెపి పార్టీలో స్థానం ఎప్పుడూ ఉంటుందని, రమేష్ చేసిన సేవలే జిల్లా పదవి వరించిందని ఆయన కొనియాడారు. రమేష్ పాయకరావుపేట కన్వీనర్ గా సేవలందించారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలుచేపడుతున్నారని, అన్ని కార్యక్రమాలలో యువత పాల్గొనేటట్టు కృషి చేయాలనిపిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అలాగే స్థానిక ఎంపీ సీఎం రమేష్ ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పరమేశ్వరరావు కోరారు. జిల్లా యువ మోర్చా అధ్యక్షుడుగా ఎన్నికైన శుభ సందర్భముగాసీనియర్ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, పొలమరశెట్టినాగేశ్వరరావు, ఉడా రమేష్, గంగుపాము నాగేశ్వరరావు, వియ్యపు నర్సింగ్ యాదవ్, మారిశెట్టి భాస్కరరావు, కొణతాల అప్పలరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి తదితరులు శ్రీరంగం రమేష్ ను అభినందించారు.

## అంగరంగ వైభవంగా ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక

# కళ్యాణ మహోత్సవం



**నక్కపల్లి ఫిబ్రవరి 28 మనసులో మాట.** ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు శాస్త్రవేత్తంగా ఘనంగా కళ్యాణం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కనులారా తిలకించారు. ఈ దివ్య వేడుకలకు రాష్ట్ర హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ దివ్య కళ్యాణ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించడం, స్వామివారి ఆశీస్సులు పొందడం ఎంతో మధురమైన అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం అయిన శ్రీ వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని మంత్రి హృదయపూర్వకంగా ప్రార్థించారు. ఈ మహోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య కళ్యాణాన్ని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. దేవస్థానం అధికారులు వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

# కూటమి ప్రభుత్వ పాలనలో ప్రాణాంతకంగా మారిన పాలు, నీళ్లు

### - చిన్న శ్రీను ధ్వజం




**విజయనగరం మనసులోమాట (జిల్లా ప్రతినిధి) ఫిబ్రవరి 29:** రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని లివిజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విమర్శించారు. శనివారం ధర్మపురిలోని తన క్యాంప్ కార్యాలయం సిరి సహస్ర రేసింగ్ ప్యాలెస్ నందు నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రజారోగ్య పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎవరైనా బ్రతకడానికి పాలు, నీళ్లు తాగుతారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఆ రెండూ ప్రాణాంతకంగా మారుతున్నాయి. కల్తీ పాలు, కలుషిత నీటి కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచుగా వెలుగు చూస్తున్నాయి" అని పేర్కొన్నారు.

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, సీఎం నారా చంద్రబాబు నాయుడు పాలనలో డయేరియా, ఫుడ్ పాయిజన్ ఘటనలు అధికమయ్యాయని విమర్శించారు. ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, పరిపాలనపై ప్రభుత్వం తన పట్టు కోల్పోయిందని ఆరోపించారు.

కురుపాం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో ఇటీవల 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురై, వారిలో ఐదుగురిని ఆస్పత్రికి తరలించిన విషయాన్ని ప్రస్తావించారు. గతంలో కూడా ఇదే పాఠశాలలో కలుషిత నీటి కారణంగా ఇద్దరు బాలికలు మృతి చెందగా, దాదాపు 100 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారని గుర్తుచేశారు. ఇంతటి దారుణ ఘటనల అనంతరం కూడా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత 14 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్, కలుషిత నీరు, అపరిశుభ్రత కారణంగా దాదాపు 25 ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ఈ అంశాన్ని జాతీయ మీడియా కూడా ప్రధానంగా ప్రస్తావించిందన్నారు.

గత 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, గుర్ల, శ్రీకాకుళం, తురకపాలెం ప్రాంతాల్లో డయేరియా ప్రబలిందని, వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని తెలిపారు. ముఖ్యంగా కలుషిత నీరు, అపరిశుభ్రతే ప్రధాన కారణాలని పేర్కొన్నారు.

ఇటీవల శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయి, దాదాపు 200 మంది ఆస్పత్రుల పాలయ్యారని తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం నగరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు మరణించగా, మరికొందరు వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. పోషణ ఇవ్వాల్సిన పాలు మరణానికి కారణమవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పరిస్థితిని సమీక్షించి, సురక్షిత నీటి సరఫరా, ఆహార భద్రత పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పరిశుభ్రత ప్రమాణాలను కఠినంగా అమలు చేసి, మరిన్ని ప్రాణనష్టాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు ఆశించడం లేదని, కనీసం ప్రాణ రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మాత్రమే కోరుకుంటున్నారని చిన్న శ్రీను పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో..

వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు కెవి సూర్యనారాయణ రాజు , నెక్కల నాయుడు బాబు , జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి , ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

# అనకాపల్లి సమస్యలపై ఏకరువు పెట్టిన కార్పొరేటర్ మందపాటి

### - సమస్యలపై ప్రాధాన్య ఇస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ హామీ




**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):** అనకాపల్లి సమస్యలు ముఖ్యంగా 82 వార్డు డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ విస్తృత స్థాయి సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు కోరారు. శనివారం విశాఖలో జరిగిన జీవీఎంసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అనకాపల్లి జోన్ 82 వ వార్డు పరిధిలో ప్రజల అవసరాల కొరకు మంజూరు అయిన పనులను ప్రారంభించాలని ఆమె కోరారు. ముఖ్యంగా దోమలు బెడదను దృష్టిలో ఉంచుకుని ఇటీవల తొలగించిన మలేరియా సిబ్బందిని తిరిగినియమించాలని ఆమె డిమాండ్ చేశారు.వార్డు పరిధిలో పరశు రాంపేట స్మశాన వాటిక పనులు వెంటనే పూర్తి చేయాలని, గతంలో ఆమోదం పొందిన పనులను పూర్తి చేయాలని, పనులు ఇంకా ప్రారంభించక పోతే వెంటనే ప్రారంభించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా సమావేశంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ను మందపాటి సునీత కోరారు. అలాగే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# డ్రగ్స్ అండ్ మెడికల్ మాఫియాలను అరికట్టాలి

### - సిపిఐ డిమాండ్




**అనకాపల్లి, ఫిబ్రవరి 28 (మనసు లో మాట) :** ప్రజలను నిట్ట నిలువునా దోపిడీ చేస్తున్న డ్రగ్స్ అండ్ మెడికల్ మాఫియాను అరికట్టాలని సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా డ్రగ్స్ కంట్రోల్ కమిషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, వై ఎన్ భద్రం, కొమ్మనాపల్లి వెంకటరమణ, ముక్కామల చిన్ని తదితరులు మాట్లాడుతూ ఈ దేశంలో,రాష్ట్రంలో నాణ్యత లేని నకిలీ మందులు, తయారుచేసి డ్రగ్స్ మాఫియా ప్రజల ప్రాణాలను తీస్తున్నా మాఫియా తో కుమ్మక్కైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ చర్యలు చేపట్టలేదని వారు విమర్శించారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫార్మా కంపెనీలు వారు తయారు చేస్తున్న నాణ్యతలేని నకిలీ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో అమ్ముడు అవుతున్నా, వాటిని నియంత్రించడంలో ఔషధ నియంత్రణ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. అద్దెకు తీసుకున్న ఫార్మా సర్టిఫికెట్ లతో ఏమాత్రం పరిజ్ఞానం లేని చిన్న పిల్లల చేత మందులు అమ్మకాలు సాగిస్తున్నారని ఇవి తెలిసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కొంతమంది డాక్టర్లు తమ క్లినిక్ లోను, ఆసుపత్రిలోనూ వారే మందుల షాపులు యజమానులతోనూ కుమ్మక్కయి మాఫియాగా మారి ప్రజలని దోస్తునారని దీని అరకట్టుకుంటే సిపిఐ పేద ప్రజల తరపున ఆందోళన చేపడుతుందన్నారు. చౌకగా దొరికే జనరిక్ మందులను ఎక్కువ ధరలకు అమ్మి రోగులను దోచుకుంటున్నారని ఆరోపించారు.

మరోపక్క అనుమతి లేని, తగిన పరికరాలు గాని సౌకర్యాలు గాని లేని మెడికల్ ల్యాబ్ లు విచ్చలవిడిగా తెరుస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు అన్నారు. నెలవారి మామూళ్లకు అలవాటు పడిన అధికారులు, ల్యాబ్ లతోను, ప్రభుత్వం రంగంలోనే మెడికల్ కాలేజీలను నిర్మించాలని పి పి పి విధానంలో మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తుల కు అప్పగిస్తే ఆందోళన తద్యమన్నారు.



# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు

**గాజువాక (మనసులోమాట )ఫిబ్రవరి 28..** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గాజువాక 76వ వార్డు శరత్ హైస్కూల్ లో ప్రిన్సిపాల్ రాము ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు , మండల విద్యాశాఖాధికారి రమణ, టీడీపీ నాయకులు పులి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి ఇరవై ఎనిమిదవ తేదీన భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ సివి రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ ద్వారా ప్రపంచానికి సైన్స్ ని మరింత చేరువ చేసిన సందర్భంగా ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పలువురు విద్యార్థులు వాతావరణ సమతుల్యత గురించి,పాడి పరిశ్రమల గురించి, శౌర కుటుంబం గురించి, ఏటియం గురించి , లావా, కరెంట్ గురించి తెలిసే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి చక్కగా వివరించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. మొదట దీప ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు పులి వెంకట రమణారెడ్డి,బిజెపి మండల అధ్యక్షులు అనిత ,జిల్లా ఎస్సి మోర్చా కార్యదర్శి మనోహర్ ,కోలనీ అధ్యక్షులు రమణ , అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవికి ముందే తాగునీటి సమస్యకు చెక్

### పైపులైన్లు రిపేర్ చేస్తున్న సర్పంచ్ బీసేట్టి గంగప్పలనాయుడు



**మునగపాక, ఫిబ్రవరి 28, మనసులో మాట..** వేసవికి ముందుగానే మూలపేట గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మూలపేట లో శిధిలావస్థలో ఉన్న పైపులు అక్కడక్కడ లీక్ అవుతున్న వాటిని పూర్తిగా తొలగించి కొత్తవి వేసి త్రాగినీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్య తీసుకుంటున్నామని అదేవిధంగా పంచాయతీ పరిధిలో త్రాగినీటితోపాటు పారిశుధ్యం, మరియు వీధి దీపాలపై ఎప్పటికప్పుడు మా పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సర్పంచ్ బిసెట్టి గంగ అప్పలనాయుడు మరియు పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్ తెలిపారు.

# వేసవికి ముందే తాగునీటి సమస్యకు చెక్

### పైపులైన్లు రిపేర్ చేస్తున్న సర్పంచ్ బీసేట్టి గంగప్పలనాయుడు



**మునగపాక, ఫిబ్రవరి 28, మనసులో మాట..** వేసవికి ముందుగానే మూలపేట గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మూలపేట లో శిధిలావస్థలో ఉన్న పైపులు అక్కడక్కడ లీక్ అవుతున్న వాటిని పూర్తిగా తొలగించి కొత్తవి వేసి త్రాగినీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్య తీసుకుంటున్నామని అదేవిధంగా పంచాయతీ పరిధిలో త్రాగినీటితోపాటు పారిశుధ్యం, మరియు వీధి దీపాలపై ఎప్పటికప్పుడు మా పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సర్పంచ్ బిసెట్టి గంగ అప్పలనాయుడు మరియు పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్ తెలిపారు.

# హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

### కరస్పాండెంట్ ఎస్ గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో



**మునగపాక, ఫిబ్రవరి 28, మనసులో మాట..** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో చిట్టి పొట్టి చిన్నారులు తయారుచేసిన సైన్సు నమూనాలను ప్రదర్శించారు. ఆద్యంతం చిన్నారుల కేరింతలు, సంబరమాశ్చర్యాల నడుమ సాగిన వైజ్ఞానిక ఆవిష్కరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సర్ సి వి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులను శాస్త్రీయ దృక్పథం వైపు నడపడమే తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ సునీత తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# వేట్లపాలెం అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన సిఎం

## బాధ్యత కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**కాకినాడ ( మనసులో మాట) ఫిబ్రవరి 28..** వేట్లపాలెంలో జరిగిన సంఘటనపై హుటా హుటేనా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఈ సంఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ఈ ఘటన చాలా బాధాకర విషయం అని వారికి అండగా ఉంటానని ఆయన ధైర్యం చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి సామర్లకోట సిహెచ్ నుండి కాకినాడ ప్రభుత్వ జిజిహెచ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో క్షేత్రగాత్రులను ఆయన పరామర్శించి పరామర్శించి ఓదార్చారు. ఆ ప్రాంతమంతా బాధిత కుటుంబాలను ఏడ్పురు బుడబుబ్బులతో వారిని ఓదార్చా లేని హృదయంకంగా పరిస్థితి నెలకొని ఉంది.వారందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఓదాచారు. వేట్లపాలెం బాణాసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబాలను ఆయన. మెరుగైన వైద్యాన్ని గాయపడ్డ వారికి అందించాలని ఆయన వైద్యాధికారులను ఆదేశించారు.సంఘటనా స్థలాన్ని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్ కూడా ముఖ్య మంత్రి కూడా ఉన్నారు. అలాగే ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయభాస్కర్, రాజ్యసభ సభ్యుడు చాలా సతీష్ కుమార్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంత్రి జిల్లా కలెక్టర్ షణ్ముహన్ సగిలి, ఎస్పీ జి.బిందు మాధవ్ పలువురు నాయకులు పాల్గొని శత గాత్రులను పరామర్శించారు. ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఈ సంఘటనపై ఉన్నతాధికారుల తో దర్యాప్తు నిర్వహించి బాధ్యత అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు.


మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా

గుంటూరు | ప్రకాశం | నెల్లూరు

ఆదివారం 1 మార్చి 2026




# వేట్లపాలెంలో విషాదం









- 18 మంది సజీవ దహనం!
- మొత్తం 20 మంది మృతి
- మృతుల్లో ఎక్కువమంది మహిళలే..
- సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**సామర్లకోట (మనసులో మాట), ఫిబ్రవరి 28:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 20 మంది కార్మికులు మృతి చెందగా, వారిలో 18 మంది అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరికొందరు కాలిన గాయాలతో రక్షించమని బిగ్గరగా అరుస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొలాల్లో పరిగెత్తినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కాగా మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉండటం అత్యంత బాధాకరం. పేలుడు ధాటికి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. దాదాపు నాలుగైదు కిలోమీటర్ల మేర ఈ పేలుడు శబ్ధం వినిపించినట్టు చెబుతున్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన మరో 8 మందిని కాకినాడ జీజీహెచ్ కు తరలించగా, వారి పరిస్థితి విషమంగా ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయనగరం నుంచి హుటాహుటిన వేట్లపాలెం చేరుకుని సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, వారి సమీప బంధువులతో చంద్రబాబు మాట్లాడారు. ఓదార్చారు. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా సీఎం వెంట ఉన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే బాణాసంచా తయారీ కేంద్రానికి అనుమతి ఉందా లేదా, భద్రతాపరమైన ఏర్పాట్లు నిర్వాహకులు తీసుకుంటున్నారా లేదా తదితర విషయాలపై రెవెన్యూ, పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు.

**మృతుల వివరాలు..**

బాణాసంచా కేంద్రం పేలుడు ఘటనలో మృతిచెందిన వారి వివరాలు.

1.గండి మంగ (43) వేట్లపాలెం, 2 వల్లూరి రవి (35) వెట్లపాలెం, 3 కడింపల్లి కృపమ్మ, 4 గంపల మంగ (జీ మేడపాడు), 5 గంపల నాగరాజు గోపి (జీ మేడపాడు), 6 బిక్కిన కరుణ సుబ్బారావు (45) వేట్లపాలెం, 7 సాధనాల సత్యవేణి (44) వేట్లపాలెం, 8 గోదత నాని (26) వేట్లపాలెం, 9 తుంపల లోవ (38) దుర్గా నగర్, వేట్లపాలెం, 10 చింతల రమణ (60), 11 మండపల్లి చిన్ని (44) గుడపర్తి, 12 గోదత మహేష్ (41) గుడపర్తి, 13 దర్శిపాటి నాని (38) కుమ్మరి వీధి, సామర్లకోట, 14 ఏడిద సంపత్ కుమార్ (25) కుమ్మరి వీధి, సామర్లకోట, 15 నుకెళ్ళ దేవి (45) వేట్లపాలెం, 16 గోదత వీర వెంకట రమణ (48) గుడపర్తి, 17 కడింపల్లి ధనరాజు (55) గుడపర్తి, 18 సాకుమళ్ళ రాఘవ (50) వేట్లపాలెం, 19 అడబాల శ్రీనివాసరావు (55) వేట్లపాలెం, 20 మాకర రాఘవమ్మ (55) పెద బ్రహ్మదేవం.



## వేట్లపాలెంలో ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎం

**సామర్లకోట (మనసులో మాట), ఫిబ్రవరి 28:** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో బాణాసంచా పరిశ్రమ ప్రమాద ప్రాంతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కలెక్టర్ ఎస్ ఎస్ మోహన్, రాజ్యసభ ఎంపీ సానా, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతుల నవీన్, తెలుగుదేశం రాష్ట్ర నేత గుణం చంద్రమౌళి, వివిధ శాఖల అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు వెంట పాల్గొన్నారు. ప్రమాద పరిస్థితి పట్ల చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆందోళనను వ్యక్తం చేశారు.

## వేట్లపాలెం ఘటన కలచివేసింది

**- రాజమహేంద్రవరం ఎంపీ పురంధరేశ్వరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** కాకినాడ జిల్లా వేట్లపాలెం సమీపంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం అత్యవసరమని ఎంపీ పురందేశ్వరి తెలియజేశారు.

## వేట్లపాలెం సంఘటనపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ దిగ్భ్రాంతి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనకు సంబంధించి సమాచారం అందగానే ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో బీజేపీ ప్రశిక్షణలో పాల్గొనేందుకు వచ్చిన మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తో సహా బీజేపీ ప్రతినిధి బృందం వేట్లపాలెం బయలు దేరింది. బీజేపీ ప్రశిక్షణ జరుగుతుండగా వేట్లపాలెం విషాద కర సంఘటన తెలియగానే బీజేపీ సమావేశం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. భారీ పేలుడు ఘటనలో మృతుల భౌతిక కాయాలు చెల్లాచెదురు అయిన ఘటనలో మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తూ సమావేశంలో మౌనం పాటించారు.

## మృతుల కుటుంబాలకు

# 20 లక్షల చొప్పున నష్టపరిహారం

- జీజీహెచ్ లో బాణా సంచా పేలిన ఘటనలో క్షతగాత్రులను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు





**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 28..** కాకినాడ జిజిహెచ్ లో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీడియాతో మాట్లాడుతూ వేలుడు ఘటన బాధాకరమని చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది చనిపోయారని ఆయన తెలిపారు. క్షతగాత్రులలో 9 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన శిక్షలు పడేలా చూస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలకు 20 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరక్కుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బాధ్యులైన వ్యక్తుల ఆస్తులను కూడా జప్తు చేస్తామని సీఎం వెల్లడించారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించామని ఆయన వెల్లడించారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై సీఎం సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నలుగురు అధికారులను సస్పెండ్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ బాణసంచా ఘటన చాలా దురదృష్టకరం. హదయ విచారకరం గా ఉందన్నారు. ఇద్దరికి ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు . ఈ ప్రమాదం లో 12 మంది ఎస్సీలు, 9 మంది మహిళలు ఉన్నారని తెలిపారు.కూలీ పని కోసం వెళ్లారని చెప్పారు.ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని తెలిపారు .ఇటీవలే ఒక సంఘటన జరిగిందని దాని తర్వాత ఇది రెండో ఘటన అన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్య మంత్రి చెప్పారు.ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యతని ఫిక్స్ చేస్తాం.ఈ సందర్భంగా ఆర్డీఓ, డీఎస్పీ, డిస్టిక్ లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్ ను సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు .ఈ ఘటన పై విచారణ అనంతరం సంబంధిత అధికారులపైనా కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కొందరు ఈ ప్రాంతం లో విచ్చలవిడి తనానికి అలవాటు పడి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని ఆ సంఘటనపై సీరియస్ అయ్యారు. అలాంటి వారిపై అరెస్టే కాకుండా ప్రాసిక్యూషన్ చేస్తామని తెలిపారు .వారి ఆస్తులు కూడా జప్తు చేసి బాధితులకు అప్పగిస్తాం. వారి ఇష్టనుచారం ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి వీల్లేదని ఆయన అన్నారు. ప్రభుత్వ పరంగా ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వారికి మరో 2 లక్షలు ప్రకటించిందన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని కూడా ఆదుకుంటాం.చిన్న పిల్లలు ఉండి, చదువుకునేవారికి రెసిడెన్సియల్ స్కూళ్లలో చదివిస్తామని తెలిపారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మిస్తామన్నారు. చనిపోయిన వారిని తీసుకురాలేము. కానీ వారి కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు.మృతి చెందిన వారి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఘటనలో అనుమతులు వచ్చాక మనుషులను నియమించుకున్నారని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడం వలననే ఈ సంఘటన జరిగిందని అన్నారు.

ఎక్స్ ప్లోజివ్ మెటీరియల్ ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు.

ఎన్ని బాణసంచా కేంద్రాలు ఉన్నాయో సమాచారం తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతం లో ఉన్న ప్రొసీజర్స్ కూడా సరిపోవడం లేదని చెప్పారు. ఈ ప్రాంతాలంతా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూములకు అనుసంధానిస్తామని తెలిపారు.

బాణసంచా కేంద్రాలకు అనుమతులు కఠినతరం చేస్తామనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు.



## వేట్లపాలెం ఘటన మాటలకందని విషాదం

- ప్రమాదంలో పెద్ద ఎత్తున కార్మికులు మృతి చెందడం బాధాకరం
- బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటాం
- కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ( మనసులో మాట) ఫిబ్రవరి 28..** సామర్లకోట మండలం, వేట్లపాలెం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుళ్ళు ఘటన మాటలకందని విషాదమని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హుటాహుటిన వేట్లపాలెంలో ఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రెవెన్యూ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేశారు. అనంతరం ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఘటనా స్థలం నుండి నేరుగా కాకినాడ జిజిహెచ్ కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదంలో పెద్ద ఎత్తున కార్మికులు మృతి చెందడం బాధాకరమని, బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.

## బాణాసంచా ప్రమాదంలో మృతులకు 50 లక్షలు అందించాలి - సిపిఎం డిమాండ్




సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 28; సామర్లకోట బాణాసంచా పరిశ్రమ ప్రమాద బాధితులకు ప్రభుత్వం 50 లక్షల వంతెన పరిహారం అందించాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. వేట్లపాలెంలో ప్రమాద ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం నేతలు దువా శేష బాబ్జి, నీలపాల సూరిబాబు, బాలము శ్రీనివాస్, కరణం ప్రసాదరావు తదితరులు మాట్లాడుతూ భద్రతా ప్రమాణాల వైఫల్యం వల్లే భారీ ప్రమాదం సంభవించిందని, అధికార యంత్రాంగం ప్రమాదానికి బాధ్యత వహించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి 50 లక్షల మంది పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం పట్ల సిపిఎం నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గడి గట్ల సత్తిబాబు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో వైభవంగా ప్రారంభమైన

# తెలుగు ప్రపంచ మహాసభలు



**అమలాపురం(మనసులో మాట) 28 :** అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో శనివారం మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కిమ్స్ అధినేత చైతన్య రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు ఏపీ శాసనమండలి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామ్ మాధవ్ ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి ఆధ్యాత్మికవేత్తలు చాగంటి కోటేశ్వరరావు గరికపాటి నరసింహారావు ఎమ్మెల్యేలు ఐతాబత్తుల ఆనందరావు గిడ్డి సత్యనారాయణ దాట్ల బుచ్చిబాబు తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు గరికపాటి నరసింహారావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యత గురించి చాగంటి కోటేశ్వరరావు వివరిస్తూ తెలుగు భాష పట్ల ప్రస్తుతం ప్రజలు ఆదరణ తగ్గిందని తెలుగు భాషయొక్క గొప్పతనం ప్రతి తెలుగువాడు గుర్తించుకోవాలన్నారు. తెలుగు భాష యొక్క గొప్పతనం కవి సమ్మేళనంలో పద్యాల రూపంలో వారి వివరించారు. తెలుగు భాష పట్ల ప్రస్తుతం యువతకు ఆదరణ తగ్గిందని పుట్టిన ఊరు బాషా పట్ల ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ తెలుగు భాష యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ ఏ రాష్ట్రమైనా ఏ దేశమైనా ఉన్న ప్రాంతాన్ని తన మాతృభాష పట్ల ప్రత్యేక శ్రద్ధ,భాషా ప్రాముఖ్యతను వారు చాటుకోవాలన్నారు. అనంతరం ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు కోనసీమ ప్రాంతంలో పెట్టడానికి కారుకులైన చైతన్య రాజును ఆయన అభినందించారు. కోనసీమ యొక్క ప్రాముఖ్యత ప్రపంచ దేశాలకు వినబడేలా ఇంత మహోత్తరమైన కార్యక్రమం కోనసీమలో పెట్టడం కోనసీమ వాసులకు గర్వకారణమన్నారు. తెలుగు భాష పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలుగు భాష ప్రాముఖ్యత నేటి తరం యువతకు అర్థమయ్యే విధంగా చెప్పే బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రస్తుతం పిల్లలను ఇంగ్లీష్ మీడియం లో చేర్పించి తెలుగు భాషకు దూరం చేస్తున్నారని ఇలా బాసపట్ల నిర్లక్ష్యం వహిస్తే ఇది ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తుందని తెలుగు భాష పట్ల ప్రతి ఒక్కరు మక్కువ చూపాలని ఆయన అన్నారు .కిమ్స్ ప్రాంగణంలో వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి భద్రాచలం సీతారాముల వారు ఉత్సవ విగ్రహాలను భక్తులు ప్రదర్శన నిమిత్తం పెట్టారు. అక్కడ వారు ఆ దేవుళ్లను దర్శించుకుంటే ఆ ప్రాంతం వెళ్లినట్టు వారు అనుభూతిని పొందుతున్నారు ఈ తెలుగు మహాసభలకు వందలాదిగా ప్రజలు హాజరయ్యారు. అదే విధంగా నేడు కూడా మరి కొంతమంది ప్రముఖులు ఈ తెలుగు మహాసభలకు హాజరయ్యే అవకాశం ఉంది .ఈ ప్రాంగణానికి వచ్చే వారికి అల్పాహారం మధ్యాహ్న భోజనం సాయంత్రం భోజనం ఏర్పాట్లను కిమ్స్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అదేవిధంగా పాఠశాల విద్యార్థులు తెలుగు తల్లి నృత్య ప్రదర్శనలు చూపర్లను ఆకట్టుకున్నాయి.



## ప్రపంచ తెలుగు మహా సభల్లో సప్పాకు సత్కారం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** అమలాపురంలో కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రముఖ నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ ను సత్కరించారు. సంగీత సాహిత్య నృత్య సభకు అధ్యక్ష స్థానం వహించి అశేషమైన విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు భాషా వైభవం సంగీత, నృత్య వైభవం తెలుగు భాష చరిత్ర తదితర అనేక అంశాలపై సప్పా ఆసక్తికర ప్రసంగం చేశారు. అనంతరం ప్రధాన వేదికపై శాసన మండలి అధ్యక్షుడు మోషన్ రాజు, సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, మాజీ శాసనమండలి సభ్యుడు చైతన్య రాజు తదితర ప్రముఖులచే చైతన్య ఉగాది పురస్కారం 2026 తో సత్కరించారు. నాట్య పండితులు, నర్తన ఋషి, ఆలయ నృత్య పునర్ సృష్టికర్తగా సప్పా అందించిన సేవలను వారు కొనియాడారు.



## వేట్లపాలెం ఘటనపై

# సీఎం డిప్యూటీ సీఎం చర్చ

**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28:** సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణాసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్చించుకున్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో వీరిద్దరూ కొద్దిసేపు చర్చింకున్నారు. ప్రమాద ఘటనా స్థలం పరిశీలించి, బాధిత కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శించి అమరావతికి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎదురయ్యారు. పేలుడు ఘటనలో బాధితులను పరామర్శించేందుకు కాకినాడ వెళ్లడానికి రాజమండ్రి ఎయిర్ పోర్టుకు పవన్ కళ్యాణ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం-డిప్యూటీ సీఎం మధ్య పేలుడు ఘటనపై చర్చ జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగ్గకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.

## వేట్లపాలెంలో బాణాసంచా పేలుడు ఘటనపై బీసీవై పార్టీ దిగ్భ్రాంతి

- రేపు రానున్న బీసీ వై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్
- పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు అత్తిలి రాజు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** సామర్లకోట మండలం వెట్లపాలెం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో ఘోర అగ్ని ప్రమాదం కారణంగా ఇప్పటి వరకు 26 మంది మృతి చెందటం అత్యంత విషాదకరమని బీసీవై పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు అత్తిలి రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సామర్లకోట మండలంలో చోటు చేసుకున్న ఈ దుర్ఘటన నేపథ్యంలో బీసీ వై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఇతర రాష్ట్రాల పర్యటనలను రద్దు చేసుకుని సోమవారం సంఘటనా స్థలానికి రానున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు తక్షణ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రమాదకరమైన బాణాసంచా సామాగ్రి నిల్వలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం, అలాగే సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.



# ఘనంగా టైలర్స్ డే

ముమ్మిడివరం( మనసులో మాట) ఫిబ్రవరి 28.కాట్రేనికోన మండలం పల్లంకురు పంచాయతీ పరిధిలోని చీకురుమల్లి వారి పేట లో టైలర్స్" డే" ను శ్రీ చైతన్య టైలరింగ్ యువజన సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక హై స్కూల్ సెంటర్ వద్ద టైలర్స్ డే సందర్భంగా కుట్టు మిషన్ సృష్టికర్త ఏలియాస్ హైజాక్ కు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త ఏలియాస్ వల్ల టైలరింగ్ పై ఆధారపడి బతుకుతున్నారు. నేడు రెడీమేడ్ రావడం వల్ల టైలరింగ్ వృత్తిలో ఆశించిన ఆదాయం దొరకడం లేదన్నారు. షాపులు అద్దెకు కట్టుకోవడం కూడా కూలీ డబ్బులు రావడం లేదని పలువురు టైలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక పద్ధతుల ద్వారా టైలరింగ్ చేయాలంటే దానికి తగిన నూతన మిషన్లు కొనుగోలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్నదని ప్రభుత్వం సబ్సిడీ రుణాలు పిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టైలరింగ్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కే సుబ్బారావు, కే రామ్ శంకర్, మోకా భాస్కర్, కే శ్రీరాములు, కే తాతాజీ, జి. అంబేద్కర్ బి. రామకృష్ణ, ఆర్.ఏసుబాబు పాల్గొన్నారు.

## పేలుళ్లతో దద్దరిల్లిన వేట్లపాలెం

**సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 28;** సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం సమీప ఐదు కిలోమీటర్ల పరిధిలో భూకంపం తరహాలో పేలుళ్లతో దద్దరిల్లినట్లు ఆయా ప్రాంతాల ప్రజలు వివరించారు. శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా పేలుళ్లు సంభవించినట్లు స్థానికులు తెలిపారు. పరిమితికి మించి బాణాసంచా తయారీ జరగటం, పరిశ్రమలో సుమారు 70 మంది కార్మికులు పనులు సాగిస్తుండగా ప్రమాదం సంభవించడంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రమాదంలో 18 మంది మృతిచెందగా, మరో 20 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. బాణాసంచా తయారీ కేంద్రం యజమాని అడబాల శ్రీను కూడా ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పరిశ్రమలు నిర్వహిస్తున్న శ్రీను కుమారులు నాని, అర్జునుడు ప్రమాదం నుండి బయటపడినట్లు తెలియ వచ్చింది. క్షతగాత్రులు, మృతదేహాలతో ఆ ప్రాంతం అత్యంత భయానక పరిస్థితిగా మారింది. వేట్లపాలెం, హుస్సేన్ పురం, మేడపాడు గ్రామాల్లో పెంకుల ఇళ్ళు, భూకంపం తరహాలో ఊగిపోగా, భవనాల యొక్క కిటికీలు అద్దాలు పగిలినట్లు స్థానికులు తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జిల్లా కలెక్టర్ ఎస్ ఎస్ మోహన్ ప్రమాద ప్రాంతంలో ఉండి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## కల్తీ పాలు ఘటనలో బాధితులకు

# అత్యుత్తమ వైద్య సేవలు

- నగరానికి చేరుకోనున్న ప్రత్యేక వైద్య నిపుణుల బృందం
- ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వ నిరంతర నిబద్ధత, బాధితుల పూర్తి వైద్య ఖర్చులను భర్తీ చేస్తూ చర్యలు
- జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** తూర్పు గోదావరి జిల్లాలో కల్తీ పాలు ఘటనపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించడం జరిగిందని, మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ప్రత్యేక నిపుణుల బృందం రావడం జరుగుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు తెలిపారు.

శనివారం నగరంలోని కిమ్స్, రెయిన్‌బో ఆసుపత్రులను సందర్శించి అక్కడ బాధితుల కు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని, వైద్య సేవల స్థితి, చికిత్సా వివరాలను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వివరించారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బల రామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, డీఎంహెచ్ఓ డాక్టర్ కే వెంకటేశ్వర రావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఈ ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన శ్రీకాకుళం త్రాగునీటి, రాజమండ్రి కల్తీ పాల ఘటనలు ప్రభుత్వ ప్రతిస్పందనలో కఠినత, జాగ్రత్తల అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయని మంత్రి తెలిపారు. సాధారణంగా ప్రజలు గేదె పాలను ఎక్కువగా తీసుకుంటున్నందున, అటువంటి పాలను నిల్వ, సరఫరా చేసే విధానంలో ఏర్పడే ప్రమాదాలు మళ్లీ జరుగకుండా అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ, తగిన కఠిన చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. కల్తీ పాల కారణంగా అనారోగ్యంతో బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వ నిబద్ధత ప్రతిబింబిస్తోందన్నారు. హైదరాబాదు నుండి అపోలో, ఏఐజీ తదితర ఆసుపత్రులకి చెందిన ప్రత్యేక వైద్య నిపుణుల బృందాన్ని రాజమండ్రి తీసుకువచ్చి మరింత సమగ్ర వైద్య పర్యవేక్షణ చెయ్యడం జరుగుతుందని, ఆ మేరకు వైద్య బృందం రావడం జరుగుతోందని వెల్లడించారు.

కిమ్స్, రెయిన్‌బో, ఆసుపత్రులలో వైద్య సేవలు పొందుతున్న బాధితులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు పరామర్శించారు. మధ్యాహ్నం కు కిమ్స్ హైదరాబాద్ నుండి డాక్టర్ సుభాష్ కౌల్, డాక్టర్ కోడూరి వెంకట కృష్ణ చైతన్య, అపోలో హాస్పిటల్ నుండి డాక్టర్ కండి క్రాంతి కుమార్, ఏఐజీ హాస్పిటల్ నుండి డాక్టర్ ఆదర్శ్ సింగంశెట్టి రాజమండ్రి చేరి బాధితులపై ప్రత్యేక వైద్య సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలుషిత పాలు సరఫరా చేసిన గణేష్ ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి బాధితుడికి ప్రభుత్వం మెరుగైన వైద్య పర్యవేక్షణ, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను నిరంతరం అందిస్తూ, మరింత శ్రద్ధతో పరిష్కారం చేపడుతోందని ఈ సందర్భంగా అధికార వర్గాలు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కల్తీ పాల ఘటన అత్యంత బాధాకరమైనదన్నారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధితులకు అండగా నిలవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యంత్రాంగాలను అప్రమత్తం చేశారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా, అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టంగా సూచించినట్లు తెలిపారు. ఈ దిశలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రోజు బాధితులను ప్రత్యక్షంగా పరామర్శించినట్లు చెప్పారు. అలాగే, కల్తీ పాల ఘటన ఎలా జరిగింది, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో మంత్రి పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ఘటనపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఈ ఘటనపై నిమగ్నమై, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఘటనకు సంబంధించిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడమే కాకుండా, బాధితులకు అవసరమైన పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తున్నట్లు కూడా వెల్లడించారు.

## పేద కుటుంబానికి

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** ఒక నిరుపేద కుటుంబానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న స్థానిక 30వ డివిజన్ చర్చిపేటకు చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త ఈతలపాక డేవిడ్ రాజు ఆర్థికంగా ఇబ్బందిపడుతూ కుటుంబ పోషణ సక్రమంగా జరగడం లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సదరు కుటుంబ అవసరాల కోసం ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పేదలను ఆదుకోవడం మనస్సుకు చాలా ఆనందంగా ఉందన్నారు. కష్టాల్లో ఉన్న ఇటువంటి పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదలకు ఆర్థికంగా, సామాజికంగా సహాయ సహకారాలు అందించేందుకే తమ భవానీ చారిటబుల్ ట్రస్టును స్థాపించినట్టు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువులు నిమిత్తం ఫీజులు చెల్లించడం, పేదలకు ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. సహాయం అంటూ తమ వద్దకు వచ్చిన వారికి మాత్రమే కాకుండా తమ కూటమి నాయకులు, కార్యకర్తల ద్వారా కష్టాల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకుని కూడా తమ ట్రస్టు తరపున సహకారం అందిస్తున్నామన్నారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము చేసే సేవా కార్యక్రమాలు మాత్రం నిలిచిపోవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల రమణ, మాలే విజయలక్ష్మి, ద్వారా పార్వతి సుందరి, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, చాపల చిన్నరాజు, చాన్ భాషా పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామికి వెండి పుష్పాలు బహుకరించిన

# ప్రముఖ సినీ నటుడు సంగీత్ శోభన్



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 28..** ఏడు వారాల వెంకన్నగా పేరుపొందిన కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి కి 442 గ్రాముల బరువు గల వెండి పుష్పాలను ప్రముఖ సినినటుడు సంగీత్ శోభన్, కుటుంబ సభ్యులు అందజేశారు. దాతలకు అర్చకులు సాయి కృష్ణ ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం శోభన్ మాట్లాడుతూ మా అమ్మ ఏడు వారాలు మొక్కు తీర్చుకున్నారని, నాకు స్వామి కటాక్షంతో ఇప్పటికి దర్శనం అయిందని తెలిపారు. ఆలయం దర్శించడం చాలా ఆనందంగా ఉంది ,ఈపరిసరాల్లోనే నూతన చిత్రం చిత్రీకరించనున్నట్లు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఆనంద్ నగర్ పాఠశాలలో సైన్స్ డే

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** స్థానిక ఆనంద్ నగర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ఎం అంకం మల్లేశ్వరరావు సైన్స్ యొక్క విశిష్టతను, ఏ విధంగా సైన్స్ ను అభ్యసించాలో తెలుపుతూ భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామి దేశంగా నిలపాలి అంటే విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచిని కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా సైన్స్ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో పాల్గొన్న 140 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలను, సైన్స్ ఫెయిర్ లో గెలుపొందిన విద్యార్థులకు కంపెస్ బాక్స్ లను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ ఎన్ మణి కుమారి, సైన్స్ ఉపాధ్యాయులు సీహెచ్ పార్థసారథి, సుజాత, డీవీఎన్ దుర్గాప్రసాద్, ఎస్ దీపిక, బీ భువనేశ్వరి, కే రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి - కృష్ణ భగవాన్



**సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 28;** ద్విచక్ర వాహనాలతో రోడ్లపైకి వచ్చే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సామర్లకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ కోరారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెల్మెట్ లేకపోవడంతో జరిగే ప్రమాదాలు అత్యంత దారుణంగా ఉంటున్నాయని, ద్విచక్ర నడిపే వాళ్ళు, ద్విచక్రంపై కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనాలపై చర్యలు తప్పవని సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ హెచ్చరించారు. శనివారం సామర్లకోట ఫ్లైఓవర్ వంతెన పై ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న యువకులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. రెండవసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కృష్ణ భగవాన్ హెచ్చరించారు. హెల్మెట్ లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో మరణాలే అధికంగా ఉంటున్నాయని కృష్ణ భగవాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ గారగారావ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక్కరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 28..** ఒకటో తేదీ ఆదివారం వస్తే ఒకరోజు ముందే పింఛన్లు అందిస్తూ అవ్వ తాతలు, దివ్యాంగుల కళ్ళల్లో ఆనందాన్ని కూటమి ప్రభుత్వం చూస్తుంది అని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట మండలం అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలనకొనసాగుతోందన్నారు. వృద్ధులు, వితంతువులకు ప్రతి నెల రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 నుండి రూ. 10,000 వరకు, మంచానికి పరిమితమైన వారికి రూ. 15,000 చొప్పున పింఛన్‌లు అందజేస్తూ ప్రభుత్వం వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని తెలిపారు. ప్రతి నెల 1వ తేదీన పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని, ఒకవేళ 1వ తేదీ ఆదివారం వస్తే ముందురోజే పంపిణీ చేసి అవ్వ, తాతల ముఖాల్లో ఆనందం నింపుతున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారుల గృహాల వద్దకే పింఛన్‌లు అందజేయడం ద్వారా ప్రభుత్వం పారదర్శకతతో పాటు సౌకర్యాన్ని కల్పిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జ్యోతుల నాగబాబు, జ్యోతుల సత్యమూర్తి, పంతం సత్యనారాయణ, సెక్రెటరీ శివ, పంతం తమ్మి రాజుబాబు, పాల్గొన్నారు.

### పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు

# పోలీసు అవుట్ పోస్ట్ నూతన భవనం నిర్మాణం

- భవన నిర్మాణానికి రూ.50 వేలు ఆర్థిక సాయం
- కొంతమూరులో పోలీసు అవుట్ పోస్ట్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీస్ అవుట్ పోస్ట్ నూతన భవనం నిర్మాణం చేస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు గ్రామంలో పంచాయతీ కేటాయించిన స్థలంలో పోలీసు అవుట్ పోస్ట్ నూతన భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా 50 వేల రూపాయలు అందిస్తానని తెలిపారు. అలాగే గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిన్నమరెడ్డి ఈశ్వరుడు కూడా పోలీసు వారికి సహాయ సహకారం అందించి త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, ఎంపీడీఓ సునీల్ ఆర్ స్ట్రాంగ్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వేమన నారాయణ గౌడ్, డైరెక్టర్ కర్రీ అప్పలస్వామి, సొసైటీ అధ్యక్షుడు అడ్డాల శ్రీను, సీఐ వీరయ్య గౌడ్, ఎస్ఐ ప్రియ కుమార్, దండమూడి తేజ, ఉండవల్లి బంగారాజు, తాడేపల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గోకా శ్రీను, అల్లాడ వెంకటేశ్వరరావు, వేమగిరి రాజు, పూడిమూడి సుదీర్ , బత్తిన కొండబాబు, సయ్యద్ ఉమర్, బేసే నటరాజ్, కోమలి శ్రీను, పోసుపో జీవన్, మద్ది సతీష్, న ం ని ం ప ా , రామారావు, వీరమళ్ళ సత్తిబాబు, గొర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎమ్మెల్యేలు సోముకి క్షమాపణ చెప్పాలి

- జిల్లా బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజు పై వైసీపీ ఎమ్మెల్సీలు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేష్ యాదవ్ ల దురుసు ప్రవర్తనను ఖండిస్తూ శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గోకవరం బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా సిద్ధాంత ప్రాతిపదికగా సుదీర్ఘంగా రాజకీయాల్లో పనిచేసిన పెద్ద వయసని కూడా చూడకుండా సోము వీర్రాజు లాంటి సీనియర్ నేతపై వైసీపీ ఎమ్మెల్సీలు అనుచితంగా ప్రవర్తించిన చర్యను తీవ్రంగా ఖండించారు. దీనిపై సోము కు వైసీపీ నేత జగన్, ఎమ్మెల్సీలు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా అవమానించారని పార్టీ శ్రేణుల నుంచి ఎదురయ్యే ప్రతిస్పందనకు వైసీపీనే బాధ్యత వహించాలని అన్నారు. పెద్దల సభలో చర్చలతో ప్రజాస్వామ్య యుతంగా జరగాల్సిన ప్రక్రియను వైసీపీ దిగజార్చిందన్నారు. వైసీపీ హయాంలో శాసన సభల్లో అరాచకం సాగిందని, ఇప్పుడు కూడా తీరు మార్చుకోకపోతే ప్రజలకు శాశ్వతంగా దూరం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. బిజెపి సీనియర్ నాయకుడు, అడబాల రామకృష్ణా రావు మాట్లాడుతూ తిరుమల లడ్డు కల్తీ చేయడం, దేవాలయాల్లో ఇచ్చే తీర్థాన్ని పారబోయడం వంటి చర్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీల ప్రవర్తనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోకవరం బస్టాండు నుంచి ప్రదర్శనగా దేవీ చౌక్, కంబాల చెరువు మీదుగా వివేకానంద విగ్రహం వద్ద ఉన్న దండి మార్చ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యానాపు ఏసు, లలిత కుమార్ జైన్, కమిడీ మురళీకృష్ణ, పడాల నాగరాజు, ముగ్గల శ్రీనివాసు పార్టీ శ్రేణులు నిరసనలో పాల్గొన్నారు.

# పేదల సేవలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం

**నియోజకవర్గ, లబ్ధిదారులకు రూ.18.26కోట్ల పంపిణీ - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట మనసులో మాట ఫిబ్రవరి 28..** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పేదల సేవలో ముందుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన పింఛన్లను అందించడం, ఒకటో తేదీన సెలవు అయితే ముందు రోజే పింఛన్లను అందించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రావులపాలెం మండలం రావులపాడులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. నాలుగు మండలాల్లో 57 గ్రామాలకు 42వేల మందికి రూ. 18. 26కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దేశంలో అధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, రూ. 4వేలు పింఛను అందిస్తు, ప్రభుత్వ పరంగా పేదవర్గాలకు నేరుగా నగదు ఇస్తున్న అతి పెద్ద కార్యక్రమం దేశంలో ఇదేనని, పింఛన్లు అందుకున్న వారి కళ్లలో ఆనందం కనపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రూ. 3వేల పింఛను రూ. 4వేలకు, దివ్యాంగుల పింఛను రూ. 6000, మిగిలినవారికి సైతం రూ. 10వేలు, రూ. 15వేల వరకూ పెంచిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. స్పౌజ్ పింఛన్లు వెంటనే అందించడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేషనల్ ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు ఎక్కడ?

- చిన్నారుల ఆరోగ్యానికి ఏది భరోసా? - అసలు పాలలో ఏమి కలిసిందో నిజనిర్ధారణ చేయరా?
- ఘటన జరిగి పది రోజులపైన అయింది.. - పాల కల్తీ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** పాల కల్తీ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక 50 వార్డుకు చెందిన ఐదుగురు మృతిచెందారని, సుమారు 15 మంది సిటీలో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. వారిలో 11 మంది వెంటిలేటర్ పైన చికిత్స పొందుతూ ప్రాణాల కోసం పోరాడుతున్నారన్నారు.
రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను చూస్తుంటే గుండెలు పిండేసే దృశ్యాలన్నారు. వారి తల్లిదండ్రుల హృదయ విదారక ఆక్రందనలకు కూటమి ప్రభుత్వ స్పందన ఏదని ప్రశ్నించారు. చనిపోయిన కనకరత్నం, రాజానగరం నియోజకవర్గ మహిళ పేర్లను ప్రభుత్వ పరిహార జాబితాలో ఎందుకు చేర్చలేదని భరత్ ప్రశ్నించారు. పరిహారం తూతూ మంత్రంగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. డయాలసిస్ చికిత్స పొందుతున్న పసి పిల్లల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. వారి ఆరోగ్యం కుదుటపడిన తరువాత భవిష్యత్తులో ఏమన్నా ఆరోగ్య సమస్యలు వస్తే బాధ్యులు ఎవరు?..దీని బాధ్యత ప్రభుత్వానిది కదా! దాని మీద కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనను ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నానని భరత్ అన్నారు.
ఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా కల్తీ ఘటనకు కారకులు, కారణాలు, నివేదికలు ఏమి లేవు.. ఇంత గోప్యంగా ఏమి చేస్తునట్టని ప్రశ్నించారు. అసలు వైద్యం పొందుతున్న బాధితులకు ఏ విధమైన ట్రీట్ మెంట్ చేస్తున్నారో ప్రతీ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. దీనికి కారకులైన ప్రతీ ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. చనిపోయిన ప్రతీ ఒక్కరికి ఇరువై అయిదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని భరత్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.
జరిగిన దుర్ఘటనకి మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించవలసిన ప్రభుత్వం, సాక్షాత్తు వైద్య శాఖ మంత్రి, షాడో ముఖ్యమంత్రి లోకేష్, చంద్రబాబు నాయుడు, ప్రశ్నించని పవన్ కళ్యాణ్ ఎక్కడ అని ప్రశ్నించారు.
క్రీడలు, వినోదాలు అంటూ చేస్తున్న నిర్వాకం..ఇప్పుడు ఏదో కంటి తుడుపు కింద మంత్రులు రావడం విచారకరం అన్నారు. ప్రతి పక్ష హోదాలో మేము ముందర నుండీ ఈ ఘటనలో ప్రజల పక్షాన నిలబడి, వారి ఆరోగ్య భద్రత కోసం పోరాడుతున్నామని, లేకుంటే కూటమి ప్రభుత్వం ఈ బాధితులను పట్టించుకునే వారే కాదన్నారు. ఇదీ నేటి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన..ప్రజల ప్రాణాలకు విలువ లేదు, ఆరోగ్య భద్రత లేదు, జగనన్న తలపెట్టిన ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం అర్ధాంతరంగా ఆపేశారు, సిబ్బంది వుండరు, సరి అయిన మందులు ఉండవు, మౌళిక సదుపాయాలు లేనే లేవు అని భరత్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున భరత్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీతాల కంటే ముందుగానే పెన్షన్లు ఇస్తున్నాం

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**ఏలూరు, ఫిబ్రవరి 28(మనసులో మాట)..** పేదలు, వృద్ధులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కంటే ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. శనివారం ఉదయం ఏలూరు పట్టణం శనివారపుపేటలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి పాలన నడుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల దాదాపు 63 లక్షల మంది పెన్షన్ దారులకు నెలకు 2,734 కోట్ల రూపాయల పెన్షన్లు కింద అందిస్తున్నామని, ఒక్క ఏలూరు జిల్లాలోనే 2,58,275 మంది పెన్షన్ దారులకి ప్రతి నెల 113 కోట్లకు పైగా పంపిణీ చేస్తున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. అన్ని విధాలా పేదలను ఆదుకుంటున్న కూటమి సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆదరించాలని కోరారు.

# జిల్లా వైద్య శాఖ నిర్లక్ష్యమే కొంపముంచింది

- కల్తీ పాలు మృతులకు 50 లక్షలు పరిహారం ఇవ్వాలి
- గ్రామీణ స్థాయి నుండే ఆరోగ్య వ్యవస్థను నిత్యం పర్యవేక్షించాలి
- సీపీఐ జాతీయ నేత డాక్టర్ కే నారాయణ
- రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన సీపీఐ బృందం





**రాజమహేంద్రవరం (మనసులో మాట), పిబ్రవరి 28:** రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన తర్వాత జిల్లా వైద్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఇంత వరకూ దారి తీసిందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి ఆరోగ్య వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించి పటిష్ఠ పరచాలని, అప్పుడే అత్యవసర ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.
రాజమండ్రిలో ఇటీవల కల్తీ పాల వల్ల ప్రమాద సందర్భంగా కిమ్స్ ఆసుపత్రిలో జాయిన్ అయినా బాధితులు వద్దకు శనివారం ఉదయం వెళ్లి పరామర్శించారు. అనంతరం ఈ ఘటనపై విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన కల్తీపాల విషయం, ప్రజలు ఆరోగ్య సమస్యలు వచ్చి ఆసుపత్రిలో చేరితే..నాలుగు రోజుల తరువాత అంటే 19వ తేదీ వరకు ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకోలేదని అన్నారు. జిల్లా వైద్య శాఖ నిర్లక్ష్యం తీవ్రంగా కనబడుతోందన్నారు. కనీసం ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేని కారణంగానే ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్నారని, పాలకులు కూడా కార్పొరేట్ ఆసుపత్రిలను ప్రోత్సహిస్తున్నారని నారాయణ ఆక్షేపించారు. ఏ ప్రభుత్వమైనా గ్రామీణ ప్రాంతాల నుండి ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరిస్తే ఇటువంటి ఘటనలు జరగవని ఆయన మరోసారి గుర్తు చేశారు. కల్తీ పాల సంఘటనలో మరణించిన వారికి రూ. 50 లక్షలు పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన రూ. 10 లక్షలు సరిపోదని నారాయణ అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, వైద్యులతో మాట్లాడి ప్రమాద తీవ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. నారాయణ వెంట సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి రేకా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే సత్తిబాబు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రసాద్, కాకినాడ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సామర్లకోటలో ఇంటింటా పింఛన్ల పంపిణీ



**సామర్లకోట (మనసులో మాట) ఫిబ్రవరి 28;** సామర్లకోట పట్టణంలో శనివారం కూటమి నేతలు ఇంటింటా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ భరోసా పథకంలో అందిస్తున్న సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందించాలని ఆదేశించడంతో మార్చి నెల పింఛన్లను ఫిబ్రవరి 28 శనివారం పంపిణీకి శ్రీకారం చుట్టారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలుగుదేశం పార్టీ సామర్లకోట పట్టణ అధ్యక్షులు రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ తెలిపారు. కూటమిన్ నేతలు ఆయా వార్డుల వారీగా పింఛన్ల పంపిణీ తెల్లవారకముందే చేపట్టినట్లు సీనియర్ నాయకులు అడబాల కుమారస్వామి వివరించారు. కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర, గోల్టి సత్యనారాయణ, పడాల వీరబాబు, వల్లూరి శివశంకర్ (దొరబాబు), అరుణ వంశీ, నిడదవోలు వీర్రాజు, సోమేశ్వరరావు మాస్టర్ తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సహకారంతో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అందించేందుకు కృషి చేస్తామని బడుగు శ్రీకాంత్ తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# నన్నయలో ఘనంగా నేషనల్ సైన్స్ డే

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా "శాస్త్ర జగతి – వికసిత భారత మహిళా ఉత్ప్రేరక జాగృతి" అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, వర్క్ షాప్ కన్వీనర్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ విజయనిర్మల, రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి నన్నయ విగ్రహానికి, సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నేషనల్ సైన్స్ డే ను ప్రారంభించారు. వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ సైన్స్‌లో మహిళలు రాణించాలని, వినూత్న నిర్మాణాత్మక ఆలోచనలతో భారత అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ వెన్నెముకగా నిలవాలన్నారు. 2047 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, విద్య, సాంకేతికత మరియు స్వావలంబనలో మన భారతదేశాన్ని అగ్రగామి దేశంగా అభివృద్ధి చేయాలనే దార్శనికత కలిగిన విక్షిత్ భారత్‌పై మన దేశం ప్రధానంగా దృష్టి పెడుతుందన్నారు. వైద్యం, పరిశోధన, ఆవిష్కరణ, అంతరిక్ష సాంకేతికత, వ్యవసాయం, పర్యావరణ స్థిరత్వం వంటి వివిధ రంగాలలో పాల్గొనడం ద్వారా భారతదేశ వృద్ధిని వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన మహిళల గర్వ వారసత్వం భారతదేశంలో ఉందన్నారు. భారతదేశంలో అంతరిక్షంలోకి ప్రయాణించిన మొదటి భారతీయ మహిళ కల్పనా చావ్లా వంటి అనేక మంది స్ఫూర్తిదాయక మహిళలు మన దగ్గర ఉన్నారని చెప్పారు. జీవితం లక్షలాది మంది బాలికలను ఏరోస్పేస్, ఇంజనీరింగ్‌లో కెరీర్‌లను కొనసాగించడానికి ప్రేరేపిస్తుందన్నారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ అగ్ని క్షిపణి ప్రాజెక్టులలో కీలక పాత్ర పోషించిన "భారతదేశ క్షిపణి మహిళ"గా పిలువబడే టెస్సీ థామస్, వ్యాక్సిన్ పరిశోధన అంటు వ్యాధులలో ప్రముఖ శాస్త్రవేత్త గగన్‌దీప్ కాంగ్, ప్రపంచ ఆరోగ్య పరిశోధనకు గణనీయంగా దోహదపడిందన్నారు. శాస్త్రీయ, సాంకేతిక రంగంలో మహిళలు తమ ప్రగతిశీల పనిని చూపించినప్పటికీ, లింగ పక్షపాతం, కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్ విరామాలు, పరిమిత నాయకత్వ అవకాశాలు, పని–జీవిత సమతుల్యత సమస్యలు వంటి అనేక సవాళ్లను వారు ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ సవాళ్లను పరిష్కరించడం దేశ నిర్మాణంలో మహిళల సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి చాలా అవసరం అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, మన భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళలకు మద్దతు ఇవ్వడానికి అనేక చొరవలు తీసుకుందని, స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్)లో మహిళలను ప్రోత్సహించడానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. యువతులు శాస్త్రీయ విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించడం, సమాన అవకాశాలను అందించడం మరియు సహాయక విధానాలను రూపొందించడం వల్ల మహిళలు భారతదేశాన్ని ప్రకాశవంతమైన, మరింత సంపన్నమైన భవిష్యత్తు వైపు నడిపిస్తున్నారని నిర్ధారిస్తుందన్నారు. యువత శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు సాగాలని ముఖ్యంగా మహిళలు సవాళ్ళను అదిగమించి ముందుకు సాగాలని సూచించారు. ప్రధాన వక్తగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ వేదిక్ సైన్సెస్ డైరెక్టర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అనుబంధ ప్రొఫెసర్, డిఫెన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీ పూర్వ ఉపకులపతి డాక్టర్ ప్రహ్లాద రామారావు మాట్లాడుతూ ఎక్కువ కాలం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ తో పని చేసే అవకాశం దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బాధలో కృంగిపోకుండదని, విజయంలో గర్వపడకుండదని అబ్దుల్ కలామ్ తనతో చెప్పిన మాటలు నేటి యువతకు ఎంతో అవసరమని అన్నారు. వికసిత్ భారత్, సురక్షిత భారత్, సంమృద్ధి భారత్, వైజ్ఞానిక భారత్, విలువలతో కూడిన సమాజ వృద్ధి అనే పంచసూత్రాలపై ప్రశంగించారు. యువత ఈ ఐదు సూత్రాలతో దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు. మహిళా పరిశోధకులు ఔషధ అభివృద్ధి, వ్యాక్సిన్ ఉత్పత్తి, మాలిక్యులర్ బయాలజీ, ప్రజారోగ్యంలో చురుకుగా పనిచేస్తున్నారని చెప్పారు. వారి పని ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన వర్గాలలో వ్యాధి నివారణ, చికిత్సను మెరుగుపరుస్తుందన్నారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) వంటి సంస్థలలో మార్స్ ఆర్బిటర్ మిషన్ వంటి విజయవంతమైన మిషన్లకు నాయకత్వం వహించిన అనేక మంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నారని గుర్తుచేశారు. వారి సహకారం అంతరిక్ష పరిశోధనలో భారతదేశం యొక్క ప్రపంచ ఇమేజ్‌ను బలపరుస్తుందని తెలిపారు. మహిళా శాస్త్రవేత్తలు వాతావరణ–స్థితిస్థాపక పంటలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ వ్యూహాలను అభివృద్ధి చేస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డేటా సైన్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో, మహిళలు డిజిటల్ పరివర్తనకు దోహదపడతారని, ఇది అభివృద్ధి చెందిన భారతదేశానికి చాలా అవసరం అని అన్నారు.

అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. అలాగే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాజెక్టులను సందర్శించిన అతిథులు విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ప్రాజెక్టులకు సర్టిఫికెట్లులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...

- కారుణ్య నియామకాలు చేపట్టాలి....
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్....
- ఏపి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు...




**ఏలూరు ఫిబ్రవరి 28 (మనసులో మాట)..** మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఏలూరు నగర మహాసభ ఆర్.ఆర్.పేట, స్ఫూర్తి భవన్ నందు యలగాడ శివకుమార్ అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభలో పాల్గొన్న ముఖ్యఅతిథిగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రతకు నిరంతరం పనిచేస్తున్న గొప్ప యోధులు మునిసిపల్ కార్మికులు అని కొనియాడారు. తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుట కోసం నిరంతరం పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తూ, మురుగు కాలువలలో సిల్టు తొలగిస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల ఆరోగ్యాలకు రక్షణ కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, కార్మికులకు సకాలంలో జీతాలను కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలను ఉద్యమాలను నిర్వహించిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభలలో ఎన్నికయ్యే నూతన నాయకత్వం మరిన్ని ఉద్యమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కార్యదర్శి పల్లెం కిషోర్, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి తో ఉందని ఆరోపించారు. కనీసం మునిసిపల్ కార్మికులు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం సమర్ధించడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ అనైతిక చట్టాలను బిజెపి పాలిత రాష్ట్రాలలో కన్నా ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 10 గంటలు 12 గంటల పని విధానాన్ని అమలు చేయుటకు చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి మాత్రం ఎందుకు చొరవ చేయడం లేదని ప్రశ్నించారు. అత్యవసర సేవలలో మాత్రమే రాత్రిపూట మహిళలు పనిచేస్తున్నారని కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల వలన అన్ని రంగాలలో మహిళలు సైతం రాత్రి పని చేయవలసి ఉంటుందని తెలిపారు. ఇటువంటి అనైతిక కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాడాలని, మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ అనేక పోరాటాలను నిర్వహించిందని ఆ పోరాటాల జయప్రదం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. సంస్థాగతంగా ప్రతి రెండేళ్లకు ఒకసారి యూనియన్ మహాసభలు నిర్వహించుకోవడం ద్వారా గత కార్యక్రమాలను పునః సమీక్షించుకోవడం,సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాలను వాటి ఫలితాలను మహాసభలలో చర్చించి భవిష్యత్తు పోరాటాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు రాజమండ్రిలో జరగనున్న నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు,నగర పంచాయతీలు,పంచాయతీలలో మహాసభలు నిర్వహించి ఏలూరు జిల్లా మహాసభ నిర్వహించుకోవాలని,అందుకు మున్సిపల్ కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# జగ్గంపేటలో ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు

**టైలర్ అసోసియేషన్ భవనంకు స్థలం, నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే నెహ్రూ కు నవీన్ కు ధన్యవాదాలు తెలియజేసిన టైలర్స్ అసోసియేషన్**



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 28..** జగ్గంపేట పట్టణంలోని శ్రీ షిరిడి సాయి ప్రైమరీ టైలర్స్ కో ఆపరేషన్ సొసైటీ అసోసియేషన్ టైలర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మంచినీరు చెరువు గట్టు పక్కన గల సంఘ భవనం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ కె రమణ, వైస్ ప్రెసిడెంట్ టీ 4 శ్రీను హాజరై మొదట కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టైలర్స్ జండా ఆవిష్కరించి జండా వందనం చేశారు. జగ్గంపేట పట్టణంలో విలియమ్స్ హోవే చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగి పోతున్న రేడిమేడ్ రంగం ప్రభావంతో మేర కులస్తులు, దీనిపై ఆధారపడి జీవించే అనేక కుటుంబాల పరిస్థితి ఆగమ్యగో చరంగా మారిందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సహకారంతో టైలర్ అసోసియేషన్ భవనానికి స్థలం, నిధులు సమకూర్చగా భవనం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఇల్లు లేని టైలర్స్ అందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కోరుకుంటు న్నామని తెలియజేశారు. టైలర్స్ ను అన్ని విధాల ఆదుకోవాలని కూటమి ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో గౌరవాధ్యక్షుడు వై నాగబాబు, సెక్రెటరీ కే నాగేశ్వర రావు (చిన్ని) ట్రెజరర్ ఏ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఎన్ వాసు, శ్రీ షిరిడి సాయి ప్రైమరీ టైలర్స్ కో ఆపరేషన్ సొసైటీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు బడుగు, బలహీన వర్గాలు జీవనోపాధికి**

# ఆర్థిక భద్రతతో గౌరవం కలిగించే సంక్షేమ పథకం

- జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు 2,57, 658 మందికి రూ 113.09 కోట్ల రూపాయిలు పంపిణీ.
- పెన్షన్లు లబ్ధిదారులు సమాజంలో చిరునవ్వులతో జీవిస్తూ రేపటి అవసరాలు కోసం కొంత సొమ్మును పొదుపు చేసుకోవాలి.
- మార్చి 01వ తేదీ సెలవు దినం వలన లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఒక రోజు ముందుగానే పింఛన్ల సొమ్ము పంపిణీ - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి





**ఏలూరు/ నూజివీడు, ఫిబ్రవరి: 28 (మనసులో మాట)..** నూజివీడు మండలం సుంకొల్లు, ముక్కెల్లపాడు గ్రామంలో శనివారం నిరుపేదలు సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్ళి వారి యోగక్షేమాలను, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, గ్రామాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకుని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేసారు. ముందుగా గ్రామస్తులు ఘనస్వాగతం పిలిచారు. మహిళలు మంగళహారతులను ఇచ్చి మంత్రి కొలుసు పార్థసారథి నుదుటన కుంకుమతిలకం దిద్దారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు బడుగు, బలహీన వర్గాలు జీవనోపాధికి ఆర్థిక భద్రతతో గౌరవశీ కలిగించే మంచి సంక్షేమ పథకం అన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు 2,57, 658 మందికి రూ 113.09 కోట్ల రూపాయిలు పంపిణీకి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. పెన్షన్లు లబ్ధిదారులు సమాజంలో చిరునవ్వులతో జీవిస్తూ రేపటి అవసరాలు కోసం కొంత సొమ్మును పొదుపు చేసుకోవాలని సూచించారు. మార్చి 01వ తేదీ సెలవు దినం వలన లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఒక రోజు ముందుగానే పింఛన్ల సొమ్ము పంపిణీకి కూటమి ప్రభుత్వం మంచి ఆలోచనతో నిర్ణయం తీసుకుని అమలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దశలు వారీగా కాకుండా ఒకేసారి పెంచి, మూడు నెలలు ఏరియర్స్ కలిపి ఒకే సారి పంపిణీ చేశామని తెలిపారు. సమాజంలో గౌరవప్రదమైన జీవనాన్ని గడపాలని బెడ్ రెస్టు తీసుకుంటున్న వారు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కుల వృత్తిదారులు మరియు ఇతర చేనేత, మత్స్యకార బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతినెలా మొదటి తారీఖునే ఇంటింటికి వెళ్ళి పింఛన్ల ఆర్థిక సాయంవల్ల కనీస జీవన భద్రత, బరోసా లభిస్తుందన్నారు. సామాజిక రక్షణ బలోపేతం కావాలని ఉద్దేశంతో పింఛన్లను కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఆత్మగౌరవంతో కుటుశీబంపై పూర్తిగా ఆధారపడకుండా పింఛన్లు సాయం ఎంతో దోహదపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక ప్రయోజనాలను పెంచుతాయని అన్నారు.



**'కల్తీ పాలు' బాధితులకు**

# అండగా ప్రభుత్వం

**వైద్య సేవలు మరింత బలోపేతం - మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** కల్తీ పాలు ఘటన నేపథ్యంలో జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని, ప్రభుత్వం తరపున మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైతే హైదరాబాద్ నుండి సీనియర్ వైద్యులను రప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని సూచించారు. కొత్తగా డయాలసిస్ కేసులు నమోదు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి నిమ్మల రామా నాయుడు.. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో తాజా పరిస్థితులపై, క్షేత్ర స్థాయి పరిశీలనలో బయటపడిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, డీఎంహెచ్ఓ కే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు 2,57,658 మందికి**

# రూ.113.09 కోట్ల రూపాయలు పంపిణీ



**ఏలూరు, ఫిబ్రవరి 28(మనసులో మాట)..** స్థానిక 17వ డివిజన్ గాంధీ మైదాన ప్రాంతంలో శనివారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు ఇంటింటికి వెళ్ళి యోగక్షేమాలను, కుటుంబ సభ్యులు వివరాలను అడిగి తెలుసుకుని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి లబ్ధిదారులకు పింఛన్లు సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మార్చి 01వ తేదీ ఆదివారం సెలవు దినం వలన ఒక్క రోజు ముందుగానే ఉదయం 7:00 గంటలు నుండి జిల్లా వ్యాప్తంగా పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మార్చి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 2,57,658 మందికి రూ 113.09 కోట్ల రూపాయలు పంపిణీ చేసామన్నారు. ఇందుకు జిల్లాలో 5047 మంది వార్డు, గ్రామ సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లు పంపిణీ పక్కా ఏర్పాట్లు చెయ్యడం జరిగిందని తెలిపారు. పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులు వారి ఇండ్లలో అందుబాటులో ఉండేలా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ముందస్తు సమాచారం అందించామని తెలిపారు. సామాజిక పెన్షన్ల సొమ్మును భవిష్యత్తు అవసరాలు కోసం లబ్ధిదారులు ఖర్చులు పోను ఎంతో కొంత దాచుకోవాలని సూచించారు. పెన్షన్ సొమ్ము నేరుగా ఇంటి వద్దనే అందించడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిపొందుతున్నామని తెలిపారు. ఈ విధానం పట్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.

# శ్రీ ప్రజ్ఞ లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

- ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయాలి
- జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**జగ్గంపేట(మనసులో మాట) ఫిబ్రవరి 28..** విజ్ఞాన శాస్త్ర పితామహుడు సి వి రామన్ జయంతి, జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల చైర్మన్ బందారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనశాలను , సాంప్రదాయ వంటకాల ప్రదర్శనశాలను ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ విద్య తో పాటు విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికి తీయాలని,వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు ద్వారా విద్యార్థుల ఆలోచనాశక్తి పెరుగుతుందని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఈ తరహా ప్రాజెక్టుల వల్ల విద్యార్థులకు చిననాటి నుండి పరిశోధనలు చేసే ఆసక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జే వి ఆర్ గ్రూప్స్ అధినేత, మండల టిడిపి అధ్యక్షుడు జీను మణిబాబు,పాండ్రంకి రాంబాబు,శ్రీ ప్రజ్ఞ డైరెక్టర్ తుమ్మల శ్వేత, కాలేజ్ ప్రిన్సిపాల్ కె అభి, హై స్కూల్ ప్రిన్సిపాల్ అడపా సాయి దీప్తి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నాగలక్ష్మి, ఇంచార్జీ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నక్సలైట్లు చనిపోవచ్చు..
# కానీ సిద్ధాంతానికి మరణం లేదు



- ప్రజల మధ్య అంతరాలు ఉన్నంతకాలం కమ్యూనిజానికి చావు లేదు
- ట్రంప్ కు బానిసగా మారిన మోదీ - ట్రంప్ అందరికన్నా పెద్ద తీవ్రవాది
- ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కేజ్రీవాల్ పై మద్యం కేసు
- చంద్రబాబు పై ప్రజా వ్యతిరేకత ప్రారంభం అయింది
- పాత్రికేయులతో సీపీఐ జాతీయ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు

**రాజమహేంద్రవరం, (మనసులో మాట), ఫిబ్రవరి 28:** కగర్ ఆపరేషన్ పేరుతో నక్సలిజం పోతుందని అమిత్ షా కలలు కంటున్నారని, ఈ ఆపరేషన్ వెనుక కారణం ప్రజలందరికీ తెలుసని భారత కమ్యూనిటీ పార్టీ (సీపీఐ) జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ అన్నారు. శనివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్వార్థపూరిత రాజకీయాలు, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా విధానాలపై ముక్కుసూటిగా మాట్లాడారు. సంచలన వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా కగర్ ఆపరేషన్ తో నక్సలిజం సమూలంగా కనుమరుగవుతుందని కలలు కంటున్నారన్నారు. నక్సలైట్లు చనిపోవచ్చు కానీ..సిద్ధాంతానికి మరణం లేదన్నారు. ప్రజల మధ్య అంతరాలు ఉన్నంతకాలం కమ్యూనిజానికి చావు లేదని నారాయణ గుర్తు చేశారు. అమెరికా విధానాలకు, ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలోని వ్యవసాయ, చేనేత రంగం నాశనం అయిపోతోందని, ట్రంప్ కు మోదీ బానిసగా మారారని విమర్శించారు. ట్రంప్ విధానాలకు సాగిలపడి ప్రధాని మోదీ బానిసగా వ్యవహరిస్తున్నాడన్నారు. జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేసి వాళ్లకు కోట్లాది రూపాయలను రుణాలు మాఫీ చేస్తోందన్నారు బ్యాంకులకు తాకట్టు పెట్టిన వారిలో 27మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారేనని, సుమారుగా 27 లక్షల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టారన్నారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆ రుణాలను మాఫీ చేస్తోందన్నారు. ప్రపంచాన్ని పట్టి కుదిపేసిన ఎప్స్టీన్ ఫైల్స్లో మోదీ పేరు రావడంతోనే ఆయన అమెరికాకు సాగిల పడి దేశ పరువు తీసేశారన్నారు. కార్పొరేట్ల మేలు కోసం అటవీ చట్టాలను మార్పు చేసి అడవి సంపదను వారికి దోచిపెడుతున్నారన్నారు. ఆదివాసీకి చెందిన రాష్ట్రపతితో అటవీ చట్టాన్ని మార్పు చేసి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి ఆపరేషన్ కాగార్ పేరుతో నక్సల్స్ పేరు పెట్టి గిరిజనులను చంపేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీజేపీతోనే ఉన్నాయని, వీరి పోరాటం రాష్ట్రంలో కూటమి, వైసీపీలుగా ఉన్నా.. ఢిల్లీలో మాత్రం కలిసి ఉంటున్నారని చెప్పారు. బిల్ గేట్స్ ను తీసుకువచ్చి అమరావతిలో అరటి తోటలను చూపించిన సీఎం చంద్రబాబు కేంద్రంలో వ్యవసాయ రంగానికి మోసం చేస్తున్న మోదీని మాత్రం నిలువరించడంలో భయపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పోరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని, ఇలా కార్పోరేట్లకు ఊడిగం చేయడంలో మోదీ, బాబు పోటీ పడుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు. గత ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి బీజేపీని అధికారంలోకి తీసుకు రావడం కోసం మద్యం లిక్కర్ కుంభకోణం ఆరోపణలు చేసి కేజ్రీ వాల్, సిసోడియా, కవిత లపై కేసు పెట్టి జైలుకు పంపించారని, ఇప్పుడు కోర్టులో సాక్ష్యాలు లేక కేసు కొట్టివేశారని నారాయణ అన్నారు. మోదీ పెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై పోరాటం చేసి సీపీఐని బలోపేతం చేస్తామని నారాయణ చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు, సహాయ కార్యదర్శి కే రాంబాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే సత్తిబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



## రాజమండ్రిలో 'బ్యాండ్ మేళం' సందడి

- కథ చెప్పగానే నచ్చేసి, సినిమా చేయాలని తీశా
- ఇండస్ట్రీకి కొత్త దర్శకులు, నటీనటులు రావాలన్నదే నా కోరిక
- గోదావరి ప్రాంతం సినిమా షూటింగులకు చాలా అనుకూలం
- సినిమాలో చూపించాల్సిన లొకేషన్లు ఇక్కడ ఎన్నో ఉన్నాయి
- సౌకర్యాలు కల్పిస్తే సినీ హబ్ గా మారుతుంది :కోన వెంకట్
- 'బ్యాండ్ మేళం' అందరినీ నవ్విస్తుంది :హీరోయిన్ శ్రీదేవి
- ఈ సినిమా అందరినీ అకట్టుకుంటుంది :దర్శకుడు సతీష్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** రాజమహేంద్రవరం నగరంలో 'బ్యాండ్ మేళం' చిత్ర యూనిట్ సందడి చేసింది. కోర్టు మూవీతో సంచలన విజయాన్ని అందుకున్న రోషన్, శ్రీదేవి జంటగా నటించిన 'బ్యాండ్ మేళం' సినిమా మార్చి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తరుణంలో చిత్ర ప్రమోషన్ లో భాగంగా స్థానిక దానవాయి పేటలోని అన్ లిమిటెడ్ హోటల్ లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ యువతను ఆకట్టుకునే రొమాంటిక్ కామెడీ అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాలను జోడించిన 'బ్యాండ్ మేళం' చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు. దర్శకుడు సతీష్ జవ్వాజి రాసుకున్న కథను వినిపించిన వెంటనే నచ్చేసిందని, 'నిను కోరి పార్ట్ 2'లా అన్పించిందని తెలిపారు. ఈ సినిమా ఎవరితో తీయాలా అని ఆలోచించినప్పుడు కోర్టు సినిమాలో హీరో హీరోయిన్స్ సరిపోతారని భావించామని తెలిపారు. వారికి కూడా కథ నచ్చడంతో తెరకెక్కించినట్లు ఆయన తెలిపారు. కోన ఫిలిం కార్పొరేషన్ కొత్త వారితోనే ఎక్కువగా సినిమాలు చేయాలని భావించి ఆ దిశగానే అడుగులు వేస్తున్నట్లు కోన వెంకట్ చెప్పారు. 'బ్యాండ్ మేళం' సినిమాలో కొత్త దర్శకుడు సతీష్ ని పరిచయం చేయడంతో పాటు చాలా మంది కొత్తవాళ్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో ఆఖరి 30 నిముషాలు బాగా ఆకట్టుకుంటుందన్నారు. చంద్రబోస్ రాసిన గీతాలు బాగున్నాయని అన్నారు. గోదావరి తీరం సినిమా షూటింగులకు ఎంతో అనువుగా ఉంటుందని, పోస్ట్ ప్రొడక్షన్ తో సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తే ఈ ప్రాంతం సినీ హబ్ గా మారుతుందని కోన వెంకట్ అంచనా వేశారు. హైదరాబాద్ లో అన్ని లొకేషన్లు చూపించేశామని, గోదావరి ప్రాంతంలో చాలా లొకేషన్లు ఇంకా చూపించాల్సి ఉందని ఆయన అన్నారు. హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ కాకినాడకు చెందిన తాను కోర్టు సినిమాతో సినీ రంగానికి పరిచయమై మంచి హిట్ అందుకున్నానని, ఇప్పుడు 'బ్యాండ్ మేళం' సినిమాతో ప్రమోషన్ వర్కులో భాగంతో గోదావరి జిల్లా నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమా కామెడీ చాలా బాగా వచ్చిందని, సినిమా అందరికీ నచ్చుతుందని, సినిమా చూస్తున్నంత సేపు నవ్వులే నవ్వులు అన్నట్లుగా ఉంటుందని ఆమె తెలిపారు. డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ కోన వెంకట్ తనకు అవకాశం కల్పించి దర్శకుడిగా పరిచయం చేయడం తన అదృష్టమని అన్నారు. అన్ని వర్గాలను ఈ సినిమా ఆకట్టుకుంటుందన్నారు. సినిమాలో నటించిన రిషిత మాట్లాడుతూ తొలి సారిగా నటించిన తనకు ఈ సినిమాలో మంచి పాత్ర లభించిందన్నారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుందన్నారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ చిత్రానికి విజయ్ బుల్గనిన్ సంగీతం అందించారు. ఈ చిత్రం టీజర్ తాజాగా విడుదలై, వీక్షకులకు నవ్వులు పూయిస్తోంది. దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసిన 'తిప్పుకుంటున్నా' అనే పాటకు మంచి స్పందన లభించింది.



## 'అన్నా క్యాంటీన్ల'ను సమర్ధవంతంగా నిర్వహించాలి

- అడ్వైజరీ కమిటీ సమావేశంలో సీఈవో పోతుల వంశీధర్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** 'అన్నా క్యాంటీన్ల' నిర్వహణ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ ఎంతో ముఖ్యం అని సీఈవో పోతుల వంశీధర్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్ఎంసీ కార్యాలయ కౌన్సిల్ హాల్లో అన్నా క్యాంటీన్ల జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అన్నా క్యాంటీన్ల'ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్నా క్యాంటీన్ల ఏర్పాటు నేపథ్యం, లక్ష్యాలు, నిర్వహణ విధానంపై సుదీర్ఘంగా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 205 అన్నా క్యాంటీన్లు ప్రజలకు అందుబాటులో ఉండగా, త్వరలో మరో 70 క్యాంటీన్లు ప్రారంభం కానున్నట్లు సీఈవో వెల్లడించారు. ప్రతి రెండు లక్షల జనాభాకు ఒక క్యాంటీన్ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

రోజూ లక్షలాది మంది నిరుపేదలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్న అన్నా క్యాంటీన్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి క్యాంటీన్ పరిధిలో అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి విస్తృత బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. వారానికి రెండు సార్లు కమిటీ సభ్యులు నిర్దేశిత చెక్లిస్ట్ ఆధారంగా తనిఖీలు నిర్వహించి, సర్వీస్ క్వాలిటీ, ఆహారం రుచి, పదార్థాల నాణ్యత, వంటశాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరణ అత్యంత ముఖ్యమని, సేవల్లో లోపాలు గమనిస్తే వెంటనే పరిష్కరించాల్సిందిగా సూచించారు. అడ్వైజరీ కమిటీల ద్వారా స్థానిక ప్రజల భాగస్వామ్యం పెరిగి, అన్నా క్యాంటీన్ల సేవలు మరింత సమర్థవంతంగా పేదలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అలాగే క్యాంటీన్లను స్వయం సమృద్ధి సాధించే దిశగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సూచనలు చేయడం, వాటిని ఆచరణ సాధ్యం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కొవ్వూరు మునిసిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, అదనపు కమిషనర్ (రాజమహేంద్రవరం) పీవీ రామలింగేశ్వర్, నిడదవోలు మునిసిపల్ కమిషనర్ టీఎల్.పీఎస్ఎస్ కృష్ణవేణి, రెవెన్యూ అధికారి (రాజమహేంద్రవరం) సీహెచ్ శ్రీనివాసరావు, నోడల్ అధికారులు, అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఎన్జీఓ ప్రతినిధులు, క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## నిడదవోలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి కందుల దుర్గేష్
- 17 నెలల్లో సమిశ్రగూడెంలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని వెల్లడి
- నియోజకవర్గంలో రూ. 28 కోట్ల శాస్కి నిధులతో డ్రెయినేజీ వ్యవస్థ ఆధునికీకరణ
- గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమించి అభివృద్ధి పథం దిశగా నిడదవోలును తీసుకెళ్తున్నామన్న మంత్రి దుర్గేష్



**నిడదవోలు (మనసులో మాట), ఫిబ్రవరి 28:** నిడదవోలు నియోజకవర్గాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం సమిశ్రగూడెంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన గత 17 నెలల కాలంలో సాధించిన ప్రగతిని వివరించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నియోజకవర్గంలో చేపట్టిన పనులను మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా వెల్లడించారు. సమిశ్రగూడెం గ్రామంలో రూ. 50 లక్షల విలువైన సీసీ రోడ్లు, రూ. 12 లక్షలతో గోకులం షెడ్డులు ఏర్పాటు చేశామన్నారు. శివాలయం ఆధునికీకరణకు రూ. 1.25 కోట్లు మంజూరు చేయించామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు రూ.30 లక్షలు కేటాయించడమే కాకుండా, నిడదవోలు పట్టణంలోని రెండు ప్రధాన డ్రెయిన్ల కోసం రూ. 1 కోటి మున్సిపల్ నిధులు సాధించామన్నారు. 'పల్లె పండుగ' 1, 2 విడతల్లో రూ. 20 కోట్లతో గ్రామీణ లింకు రోడ్లు నిర్మించామన్నారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రూ. 28 కోట్ల శాస్కి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం ఇవి టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. అర్హులకు రూ. 10 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీకి సొంత భవనం ఏర్పాటుపై వ్యవసాయ మంత్రితో చర్చించామని, దానికి సూత్రప్రాయంగా అంగీకారం లభించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. అలాగే పీఏసీఎస్ శాశ్వత భవన నిర్మాణం, పుంత రోడ్ల అభివృద్ధి, ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. 2019-24 మధ్య గత ప్రభుత్వంలో మచ్చుకైనా కనిపించని అభివృద్ధి, నేడు సీఎం చంద్రబాబు నాయుడు చొరవ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో సాధ్యమవుతోందన్నారు. నిడదవోలు ముఖ చిత్రాన్ని మార్చేందుకు కూటమి నాయకులమంతా కలిసి కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

**ఎంపీడీవో టి.వి. సత్యనారాయణకు ఘన సన్మానం..** అభివృద్ధి సమీక్ష అనంతరం సమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఎంపీడీవో టి.వి. సత్యనారాయణ వీడ్కోలు సమావేశంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. సుదీర్ఘ కాలం పాటు పారదర్శకతతో, నిబద్ధతతో పనిచేసిన సత్యనారాయణ సేవలను మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఆయనను ఘనంగా సన్మానించి, భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు.

## రాజమండ్రి చేరుకున్న ప్రత్యేక వైద్య నిపుణుల బృందం

-హైదరాబాదు నుంచి వచ్చిన నలుగురు ప్రత్యేక వైద్యులు - 'పాల కల్తీ' బాధితుల ఆరోగ్య పరిస్థితిపై సమీక్ష





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** రాజమహేంద్రవరం నగరంలో 'కల్తీ పాల' బాధితుల ఆరోగ్యాన్ని సమీక్షించేందుకు హైదరాబాదు నుంచి నలుగురు ప్రత్యేక వైద్య నిపుణుల బృందం శనివారం నగరానికి చేరుకుంది. ప్రభావితమైన 15 మంది రోగులు ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో 8 మంది, డెల్టా హాస్పిటల్ లో ఇద్దరు, రాక్ హాస్పిటల్ లో ఒకరు, రవి చైతన్య హాస్పిటల్ లో ఒకరు, రెయిన్బో హాస్పిటల్ లో (పిల్లల ఆసుపత్రి)-ముగ్గురు పిల్లలు చికిత్స పొందుతున్నారు. అన్ని ఆసుపత్రుల్లో చికిత్సను సీనియర్ నెఫ్రాలజిస్ట్ పర్యవేక్షణలో, నిర్ణీత చికిత్స విధానాల ప్రకారం నిర్వహిస్తున్నారన్నారని డీఎంహెచ్ఓ కే వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా హైదరాబాద్ నుండి రాజమండ్రి వచ్చిన నలుగురు నిపుణులైన ప్రత్యేక వైద్యుల బృందం స్థానిక వైద్యులకు అధునాతన వైద్య మార్గదర్శకాలు అందిస్తూ, రోగుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తోంది. ఈ బృందంలో డాక్టర్ సుభాష్ కౌల్ (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కిమ్స్ ఆసుపత్రి), డాక్టర్ కే క్రాంతి కుమార్ (క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, అపోలో హాస్పిటల్స్), డాక్టర్ ఆదర్శ్ సింగంశెట్టి (సీనియర్ కన్సల్టెంట్ - అసిస్టెంట్ డైరెక్టర్, డిపార్ట్మెంట్ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, ఏఐజీ హాస్పిటల్స్),

డాక్టర్ వెంకట కృష్ణ చైతన్య కొడూరి (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ అండ్ న్యూరో ఇంటర్వెన్షనిస్ట్, క్లినికల్ లీడ్ స్ట్రోక్ అండ్ న్యూరోఇంటర్వెన్షన్స్, కిమ్స్ హాస్పిటల్) కి చెందిన వారు ఉన్నారు. ఈ బృందంలోని వైద్యులు ఐదు ఆసుపత్రుల వైద్యులు, నిపుణుల మధ్య నిరంతర సమన్వయం కొనసాగుతోందని డీఎంహెచ్ఓ తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా హాజరై అందజేస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు.

ఆసుపత్రుల్లో చేరిన ప్రతి రోగిని సీనియర్ నిపుణులు సమీపంగా పర్యవేక్షిస్తున్నట్లు డీఎంహెచ్ఓ వెంకటేశ్వర రావు తెలియజేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స ఫలితాలపై క్రమం తప్పకుండా సమీక్ష జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ, ఆసుపత్రి యాజమాన్యాల మధ్య బలమైన సమన్వయం కొనసాగుతోందని తెలిపారు.

జిల్లా పరిపాలన, రాష్ట్ర ఆరోగ్య అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కల్తీ పాలు ఘటన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిపుణుల వైద్య సేవలను అందిస్తూ, ప్రభావితులకు పూర్తి వైద్య, ఆర్థిక రక్షణ కల్పిస్తోందన్నారు. వైద్యం చేసే క్రమంలో పారదర్శక సమన్వయం, పర్యవేక్షణతో పరిపాలన, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తోందన్నారు. ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఆరోగ్య శాఖ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని డీఎంహెచ్ఓ వెంకటేశ్వర రావు తెలిపారు.

## పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులకు ఎస్పీ సత్కారం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** తూర్పు గోదావరి జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన అధికారులను జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పదవీ విరమణ చేసిన ఏకే సత్యనారాయణ (ఎస్ఐ డీటీఆర్బీ), జీ జ్ఞాన ప్రకాశరావు (ఏఎస్ఐ దేవరపల్లి) లను ఎస్పీ డీ నరసింహ కిషోర్ సాలువ కప్పి ఘనంగా సన్మానం చేసి పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీరు పోలీసు డిపార్ట్మెంట్ కు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్ చెంచు రెడ్డి, జోనల్ డీఎస్పీలు, ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 50వ వార్డులో పెన్షన్ల పంపిణీ

-టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో..



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 28:** స్థానిక 50వ వార్డులో తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరుతూ ప్రజల్లో ఆనందాన్ని నింపుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి పెన్షన్లు అందుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తోందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి యాదవ్, అన్నం చిన్న, చింతకాయల నాని, వనచర్ల సుజాత, సావిత్రి, పార్వతి, బొమ్మనబోయిన నాగేంద్ర యాదవ్, తటబాబూ, నాగేశ్వరావు, ఆకుల భారతి, సత్యనారాయణ, మదీనా మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
ఆదివారం 1 మార్చి 2026


# బృందావన్ స్కూల్లో మొదటి వార్షికోత్సవం



పలమనేరు ఫిబ్రవరి 28( మనసులో మాట).. పలమనేరు పట్టణంలోని మదనపల్లి రోడ్డులో జరిగిన బృందావన్ స్కూల్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ఆయనకు ఘన స్వాగతం తెలియజేసింది. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని పోటీ ప్రపంచంలో అవకాశాలను అంది పుచ్చుకొని విద్యార్థులు రానించాలని సూచించారు. తదనంతరం నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలను తిలకించి చదువుతోపాటు వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమశేఖర్ గౌడు, ప్రతాపరెడ్డి, ప్రసాద్ నాయుడు, నాగరాజు రెడ్డి, గణేష్, వెంకట ముని రెడ్డి, మురళి, బి ఆర్ సి కుమార్, కోటేశ్వర్, రాము, రవి,నదీమ్, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పలమనేరు ఫిబ్రవరి 28( మనసులో మాట).. పలమనేరు మండలంలో 5 సి ఆర్ సి సెంటర్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, కొలమాసనపల్లి, దొడ్డిపల్లి,బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని (నేషనల్ సైన్స్ డే ) జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలకు మండల విద్యాశాఖ అధికారులు పి. లీలారాణి, సి. బాలసుందరం హాజరై పాఠశాలలను, సి.ఆర్.సి సెంటర్లను సందర్శించారు. అక్కడ విద్యార్థు ప్రదర్శిచిన విజ్ఞాన శస్త్ర ప్రదర్శనను పరిశీలించడం జరిగిది. విద్యార్థులందరూ కూడా వారి ప్రదర్శనల గురించి వివరించడం జరిగింది. లీలారాణి మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న శాస్త్రవేత్త సి.వి. రామన్ గారి "రామన్ ప్రభావం" ఆవిష్కరణను స్మరించుకుంటూ జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, సృజనాత్మక ఆలోచనలు చేయాలని, పాఠశాల ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సి. బాలసుందరం, విద్యార్థులకు క్రమశిక్షణ, కష్టపడి చదవడం, పట్టుదల అవసరమని తెలియజేశారు. పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు ప్రాయోగిక జ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలని ఉన్నత విద్యలో పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదే విధంగా అత్యుత్తమ ప్రదర్శిన కనబరచిన విద్యార్థుల ఎక్సిహిబిట్స్ బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పలమనేరు ప్రధానోపాధ్యాయులు శంషీర్, జాయింట్ సెక్రటరీ రజాక్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పలమనేరు ప్రధానోపాధ్యాయులు, సుజాత,జాయింట్ సెక్రటరీ రామారాణి, ఉర్దూ హై స్కూల్ షైక్ సబజు సాహెబ్ , జాయింట్ సెక్రటరీ హరి కృష్ణ,సి ఆర్ పి లు గీత, హరిబాబు, అనిల్ ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కంపోస్ట్ యార్డ్ ను సందర్శించిన కమిషనర్



పలమనేరు ఫిబ్రవరి 28 ( మనసులో మాట): మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పురపాలక సంఘ పరిధిలో పూల మార్కెట్, జిలాని సర్కిల్, బజారు వీధి, గంటవూర్, యూపీహెచ్ సి, లక్ష్మీ నగర్ కాలనీ, పోలీస్ లైన్, ఏరియాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తనిఖీ చేసి తడి చెత్త పొడి చెత్త సేకరణ నిర్వహణ రవాణాలపై వార్డులలో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. సంబంధిత వార్డ్ శానిటేషన్ సెక్రటరీలకు పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. పట్టణ ప్రజలంతా తడి చెత్త పొడి చెత్తను విడివిడిగా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. ఎద్దుల సంత వీధిలో ఉన్న డబ్ల్యూటీపి వాటర్ ప్లాంట్ ను తనిఖీ చేసిన్నారు. నీటి స్వచ్ఛతపై ఆర్ సి ఫ్లోరిన్ టెస్ట్ నిర్వహించారు. నీటి బోర్లు ఉన్న నీటి సామర్థ్యాలను నీటి లభ్యతలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పట్టణ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలని తెలిపారు. అంబేద్కర్ నగర్ వేణుగోపాలస్వామి ఏరియాలలో తనిఖీ చేయడం జరిగింది. పట్టణంలోని ప్రజలకు పెన్షన్లను గంటవూర్, అంబేద్కర్ నగర్, వేణుగోపాల స్వామి ఏరియాలలో తనిఖీ నిర్వహించారు. పంపిణీ చేయునప్పుడు పాటించవలసిన సూచనలను జాగ్రత్తలను పంపిణీదారులకు తెలియజేశారు. ఈనెల మొత్తం పెన్షన్లు 4477 గాను4249 మంది లబ్ధిదారులకు 94.91 శాతం తో పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కంపోస్టు యార్డును సందర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఈ సి ఓ ఎన్ ఎక్స్ కంపెనీ రాధా, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, ఏఈ శిరీష, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మక నేషనల్ యూత్ ఇన్స్పిరేషన్ -2026 అవార్డు అందుకున్న సాయి కిరణ్




పలమనేరు ఫిబ్రవరి 28( మనసులో మాట): నియోజకవర్గంలోని పెద్ద పంజాణి మండలం,వీరప్పల్లి పంచాయతీ, కెళవాతి గ్రామానికి చెందిన ఎంపిటిసి సుబ్రమణ్యం కుమారుడు సాయి కిరణ్ అంబుతోటి ప్రతిష్టాత్మక "నేషనల్ యూత్ ఇన్స్పిరేషన్ అవార్డు" అందుకున్నారు. ఈ నెల 27న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖా మద్దతుతో భారతి యువ వెల్ఫేర్ అసోసియేషన్ 2026 ఏడాదికి గాను నేషనల్ యూత్ ఇన్స్పిరేషన్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డియన్(గ్రూప్స్ (దిం(గ్రూప్స్ ) వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన సాయికిరణ్ ఆధునిక డిజిటల్ మార్కెటింగ్, పనితీరు ఆధారిత వృద్ధి వ్యూహాలు, వ్యాపార నాయకత్వంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందుకున్నారు. డియాన్ గ్రూప్స్ అనేది పనితీరు ఆధారిత మార్కెటింగ్ సంస్థ. డేటా ఆధారిత ప్రకటనలు, ఆదాయ కేంద్రిత సేల్స్ సిస్టమ్స్ మరియు సమగ్ర వృద్ధి వ్యూహాల ద్వారా డి 2సి బ్రాండ్లు, లీడ్ జనరేషన్ వ్యాపారాలను విస్తరించడంలో ఈ సంస్థ ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంది. మెటా వెరిఫైడ్ పార్ట్నర్‌గా ఈ సంస్థ ప్లాట్‌ఫామ్ స్థాయి ఉత్తమ ప్రమాణాలు, ఆధునిక ప్రకటన ఫ్రేమ్‌వర్క్‌లు, అనుసరణ ఆధారిత వృద్ధి వ్యవస్థలతో కొలిచే ఫలితాలు, లాభదాయకత మరియు స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది.దీంతో కేంద్ర మంత్రులు మరియు దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ, వ్యాపార ప్రముఖులు పాల్గొని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా వారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నా రు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అతవాలే గృహ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, నిత్యానంద్ రాయ్,లోక్‌సభ సభ్యుడు మాజీ మంత్రి జనార్దన్ సింగ్, లోక్‌సభ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తే, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వేత్తల అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి (స్వతంత్ర బాధ్యత) జయంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. తమ సంస్థ ఏర్పాటు చేసిన మూడేళ్లలోనే అవార్డును దక్కించుకోవడం ఆనందంగా ఉందని కిరణ్ పేర్కొన్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సహకారంతో తాను ఈ స్థాయికి చేరుకున్నానని తన విద్యకు ఆయన చేసిన సాయం మరువలేనిదని ఆయనకు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటామని గుర్తు చేసుకున్నారు. ఇలా ఉండగా కిరణ్ కు అవార్డు రావడం పట్ల వారి తల్లిదండ్రులతో పాటు పంజాణి మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు.




## సైన్సు యొక్క ప్రాముఖ్యత దైనందిన జీవితంలో దాని అవసరాన్ని వివరిస్తుంది..

### - కరెస్పాండెంట్ నిర్మలాదేవి

ధర్మవరం ఫిబ్రవరి 28 (మనసులో మాట).. సైన్స్ యొక్క ప్రాముఖ్యత దైనందిన జీవితంలో దాని అవసరాన్ని వివరిస్తుందని కరెస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాకతీయ విద్యా నికాతనలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల నమూనాలు ప్రదర్శనలు, తమ సొంత సైన్స్ పరికరాలు, గుండె యొక్క రక్త సరఫరా, జీర్ణ వ్యవస్థ లాంటి నమూనాలు ఆకర్షణీయంగా వెలుగొందాయి. అనంతరం నిర్మలాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడినటువంటి విద్యను అభ్యసిస్తే భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని తెలిపారు. విద్యార్థులతో దాగివున్న సృజనాత్మకతను ఈ ప్రాజెక్టుల ద్వారా బయటపడ్డాయని తెలిపారు. తదుపరి ప్రముఖ శాస్త్రవేత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శెట్టిపి సూర్య ప్రకాశ్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు



ధర్మవరం ఫిబ్రవరి 28 (మనసులో మాట) పట్టణంలోని సభ్యులను ఆకస్మికంగా సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలు ఉండే గదులను, వంటగదిని, పరిసరాలను, వివిధ రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం ఖైదీలు భుజించే అన్నాన్ని కూడా వారు రుచి చూశారు. అనంతరం జడ్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖైదీలకు అన్ని వసతులు, నాణ్యమైన భోజనం, భద్రత తప్పనిసరిగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఇన్చార్జ్ సూపర్డెంట్ కు తెలియజేశారు. ఎవరికైనా న్యాయవాదులు లేకపోతే ఉచితంగా న్యాయ సహాయం లాయర్ల ద్వారా కల్పిస్తామని తెలిపారు. అనంతరం ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలుగా మీ సమస్యలు ఏదైనా ఉంటే జైలులో గల కంప్లైంట్ బాక్సులు వేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ నరసింహమూర్తి ,శామీర్ భాష ,పారా లీగల్ వాలంటీర్, కోటి సిబ్బంది పాల్గొన్నారు.

## రిషి విద్యాలయంలో ఘనంగా విద్యా ప్రదర్శన



ధర్మవరం ఫిబ్రవరి 28 (మనసులో మాట) జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా రిషి విద్యాలయ లో విద్యా ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల తల్లిదండ్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు ప్రదర్శన స్టాళ్లను సందర్శించి విద్యార్థుల ప్రతిభను ఆసక్తిగా వీక్షించారు.

అన్ని విషయాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని ప్రయోగాలు, మోడళ్లు, చార్టులు, పాత్రాభినయాలు మరియు డిజిటల్ ప్రదర్శనలు నిర్వహించారు.

డీన్ భాస్కర్ రెడ్డి విద్యార్థులు ప్రాయోగిక జ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. సీఏఓ రవీంద్ర ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయని పేర్కొన్నారు.

ప్రిన్సిపాల్ కరణ్ స్వరూప మాట్లాడుతూ, "విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా భావన పెంపొందించడం మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి ప్రతి విద్యార్థికి తన ప్రతిభను ప్రదర్శించే వేదిక కల్పించడం మా లక్ష్యమని తెలిపారు. ఏఓ రంగారెడ్డి , ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు.

తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కృషిని హృదయపూర్వకంగా అభినందించారు.

# విచారణకు బదులుగా బాధితులనే రికార్డులు చూడమంటారా?

# పరిపాలన వైఫల్యంపై సాకే కుళ్లాయప్ప ఆగ్రహం

## - పీజీఆర్ఎస్‌ను దొంగ సాక్షాలతో క్లోజ్ చేశారా?

## - అవినీతి బయటపడకుండా నకిలీ ఆధారాల సృష్టి?

## - అవినీతిని కప్పిపుచ్చేందుకే ఈ పరిపాలనా డ్రామా?



ధర్మవరం ఫిబ్రవరి 28 (మనసులో మాట).. ఎస్సీ జన సంఘం ఆధ్వర్యంలో ధర్మవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యసి జన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు కర్ణాటక ఇంచార్జ్ సాకే కుళ్లాయప్ప మాట్లాడుతూ సత్యసాయి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిపాలనా వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అవినీతి ఎలా జరిగిందో ఆధారాలతో సహా ఫిర్యాదుదారులు సమర్పించినప్పటికీ, సంబంధిత అధికారులు నిష్పక్షపాత విచారణ చేపట్టాల్సింది పోయి బాధితులకే "మీరు రికార్డులు చూసుకోండి" అని చెప్పడం పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని అన్నారు. దొంగ సంతకాలు, తప్పుడు సాక్ష్యాలు, నకిలీ నివేదికలు సృష్టించడం వంటి చర్యలు నైతికంగా తప్పు మాత్రమే కాకుండా చట్టపరంగా కూడా తీవ్రమైన ఉల్లంఘనలని ఆయన స్పష్టం చేశారు. అవినీతి అధికారులను రక్షించేందుకే ఈ చర్యలు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ధర్మవరం నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదులపై సరైన విచారణ జరపకుండా వాటిని తప్పుడు విధానాల్లో మూసివేయడం ద్వారా పీడీ ప్రమీల అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందని కులాయప్ప తెలిపారు. ఎస్సీ ఉద్యోగి సుదీష్ వర్మను ఎటువంటి సరైన విచారణ లేకుండా అక్రమంగా టర్మినేట్ చేయడం అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని, మెమోలు జారీ చేసి ఎస్సీలపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ధర్మవరంలో పనిచేస్తున్న సీడీపీఓ ఎర్రిలక్ష్మిని అనవసరంగా బదిలీ చేసి అడిషనల్ సీడీపీఓగా పంపించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రశ్నించారు. అలాగే పుట్టపర్తి సీడీపీఓగా ఉన్న జయంతిని స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్నప్పటికీ ధర్మవరంలో అడిషనల్ సీడీపీఓగా నియమించడం కూడా అనుమానాస్పదమని పేర్కొన్నారు. తనకు అనుకూలంగా ఉన్నవారిని ఒకలా, అవినీతికి సహకరించని వారిని మరోలా చూడటం పరిపాలనా దుర్వినియోగమని, ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను అణగదొక్కే చర్యగా మారిందని తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పీడీ ప్రమీలను వెంటనే సస్పెండ్ చేయాలని, తప్పుడు ఎండార్స్‌మెంట్ ఇచ్చి గ్రీవెన్స్‌ను మూసివేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా తొలగించబడిన సుదీష్ వర్మకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు అందుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పందించకపోవడం ఆందోళనకరమని తెలిపారు. అదేవిధంగా ఆర్జేడీ రోహిణి విచారణలు చేస్తున్నప్పటికీ వాటి నివేదికలు ప్రజలకు వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది అని, నైతికంగా ఆమె పీడీ ప్రమీలకు సహకరిస్తున్నట్లుగా కనిపిస్తున్నదని విమర్శించారు. సాకే వినయ్ కుమార్ సమర్పించిన అర్జీని దొంగ సాక్ష్యాల ఆధారంగా అన్యాయంగా క్లోజ్ చేయడం విచారకరమని తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలపై విచారణలు తూతూ మంత్రంగా జరగడం వెనుక అంతర్గత కారణాలు ఏమిటో వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు సంబంధిత మంత్రి గుమ్మడి సంధ్యారాణి జోక్యం చేసుకుని అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని ఉద్యోగాల నుండి తొలగించే వరకు చర్యలు చేపట్టాలని ఎస్సీ జన సంఘం డిమాండ్ చేసింది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
ఆదివారం 01 మార్చ్ 2026


# కోకాపేటలో జలమండలికి 3.95 ఎకరాల భూమి

**గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు నిర్మాణాలు**

**హరీష్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వ వివరణ**



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** కోకాపేట్ నియోపోలిస్‌లోని శారదా పీఠం భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు సంధించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హరీశ్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వం శనివారం క్లారిటీ ఇచ్చింది. నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూమి కేటాయింపు చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఉన్న 8.75 ఎకరాలు ఎంబీఆర్, ఈఎల్ఎస్ఆర్ ల నిర్మాణానికే సరిపోతాయని స్పష్టం చేసింది. ఓహెచ్‌టీ, సైట్ ఆఫీస్, మెయింటెనెన్స్ కోసం అదనపు భూమి అవసరమని జలమండలి ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని గుర్తు చేసింది. 592 మీటర్ల ఎత్తులో భూభాగం - గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అనుకూలమని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపింగ్ అవసరం లేకుండా నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని స్పష్టత ఇచ్చింది. బోజగుట్ట రిజర్వాయర్‌కు గోదావరి జలాల గ్రావిటీ సరఫరా చేస్తామని వివరించారు. తద్వారా ఓల్డ్ సిటీ, షేక్‌పేట్, రెడ్ హిల్స్, మెహిదీపట్నం ప్రాంతాలకు లాభం చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. అంతేకాకుండా కరెంట్ ఛార్జీలు భారీగా ఆదా అవుతాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇక గోదావరి ఫేజ్- ప్రాజెక్ట్ ద్వారా అదనంగా 300 ఎంజిడి నీటి తరలింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



## మదీనా బస్సు ప్రమాద బాధితులకు

# సర్కార్ భరోసా

**కుటుంబాలకు రూ. 5 లక్షల సాయం**

**సచివాలయంలో 44మందికి చెక్కులు పంపిణీ**

**అండగా ఉంటామని సీఎం రేవంత్ వాగ్దానం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు. గతేడాది నవంబర్ 17న మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమైన విషయం తెలిసిందే. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు ప్రమా దంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మదీనా ప్రమా దం గురించి తెలియగానే సహాయ చర్యలపైన కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ప్రస్తావించారు. మంత్రి అజారుద్దీన్‌ను వెంటనే మదీనా పంపించానుని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించదని.. కానీ బాధితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని అన్నారు. నాంపల్లి అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ప్రజకు కలిగించామని చెప్పుకొచ్చారు. అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కి పిలిచి పరిహారం అందించామని వివరించారు. ఇది ప్రజల ప్రభుత్వమని.. ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రజల కష్టం, ఆనందంలో మీతో ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మదీనాలోప్రమాదఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకుపంపామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకుతక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనాపంపించామన్నారు. అక్కడిభారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నుతుల్బఖీలో చేయించామన్నారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చుని.. కానీ మీ అందరితోకలవాలని.. మీకు అండగాఉంటామనే భరోసాకల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకుపంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మతపెద్దలకే అప్పజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్కమిటీఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ఫహీంఖురేషి, రాష్ట్ర మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల ముస్లింలకు చాలా పవిత్రమైనదని.. అంతా కలిసి మెలిసి ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.



# క్యాన్సర్ రహిత తెలంగాణే లక్ష్యం

తెలంగాణ రాష్ట్రంలో మహిళలను వేధిస్తున్న సర్వైకల్ క్యాన్సర్ మహమ్మారిని అంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని కింగ్ కోఠి ఆస్పత్రిలో శనివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 'హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్'ను అధికారికంగా ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు మంత్రి సర్టిఫికెట్లను అందజేశారు.

**రాష్ట్రంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్**

- ఆడబిడ్డల ఆరోగ్యం కోసం చారిత్రాత్మక ఘట్టం
- కింగ్ కోఠి ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి దామోదర
- 3 నెలల పాటు కొనసాగనున్న డ్రైవ్..
- 4 లక్షల మంది బాలికలే లక్ష్యం




**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** హైదరాబాద్ కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు మంత్రి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నేటి నుం చి 3 నెలల వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనున్నది. తొలి నెల రోజుల వరకూ ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో వ్యాక్సినేషన్ ఉండనున్నది.. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నది. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఈ రోజు మనం ఆరోగ్య రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించుకున్నాం అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టుకున్నాం అన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది. దురదృష్టవశాత్తు, మన రాష్ట్రంలో కూడా ఏటా 55,000 నుండి 60,000 క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మన ప్రభుత్వం ఒక సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించింది. కేన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా ఇప్పుడు కీమోథెరపీ సేవలను అందు బాటులోకి తీసుకొచ్చాం. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశాం. వ్యాధిని ముందే గుర్తించడానికి మొబైల్ స్క్రీనింగ్ యూనిట్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా మహిళలకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. త్వరలోనే క్యాన్సర్‌ను నోటి÷బుల్ డిసీజ్‌గా ప్రకటించి, వ్యాధి నియంత్రణకు మరింత పక డ్బందీ చర్యలు తీసుకోబోతున్నాం. కేన్సర్ చికిత్సా రంగం లో ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు గారిని సలహాదారుగా నియమించు కుని, ఆయన సలహాలు, సూచనలతో కేన్సర్ కట్టడికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. దేశంలో మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ కేన్సర్ రెండవ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో ఏటా సగటున 3,200 మంది మహిళలు ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచంలో ముందస్తుగా నివారించగలిగే ఏకైక క్యాన్సర్ ఇదే. ఈ క్యాన్సర్ 99.7శాతం మంది పేషెంట్లకు హ్యూ మన్ పాపిలోమా అనే వైరస్ వల్లే వస్తుంది. ఆ వైరస్‌ను అంతం చేయడానికే.. ఈ రోజు కేంద్ర ప్రభుత్వ సహకారం తో, రాష్ట్రవ్యాప్తంగా వ్యాక్సినేషన్ డ్రైవ్ మనం ప్రారంభించు కున్నాం. ఈ డ్రైవ్‌లో భాగంగా, 14 ఏళ్లు నిండి, 15 ఏ ళ్లు లోపు ఉ న్న మనం వ్యాక్సిన్ వేయబోతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.5 నుండి 4 లక్షల మంది బాలికలకు రాబోయే 3 నెలల్లో వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. బయట ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ 'గార్డాసిల్' వ్యాక్సిన్ ఒక్క డోసు వేసుకోవాలంటే 3,000 నుండి 4,000 రూపాయలు అవుతుంది. కానీ, ప్రభుత్వం దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. త్వరలోనే పీహెచ్‌సీల్లో కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. తల్లిదండ్రులందరికీ నా విజ్ఞప్తి. మీ ఇంట్లో 14 ఏళ్ల ఆడబిడ్డ ఉ ంటే, వెంటనే ముందుకు వచ్చి ఈ టీకా ఇప్పించండి. మన ఆడబిడ్డల భవిష్యత్తును, తద్వారా తెలంగాణ భవిష్యత్తును కాపాడుకుందాం అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కార్యక్రమంలోహెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు

# పామాయిల్ రైతులకు శుభవార్త

- టన్ను గెలల ధర రూ.21546
- 15024 మంది రైతులకు రూ. 2 కోట్ల మేర అదనపు లబ్ధి
- పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఆయిల్ ఫెడ్ ఫాక్టరీలలో ఆధునిక యంత్రాల ఏర్పాటు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** తెలంగాణ ప్రభుత్వం వ్యవసా య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత, వంట నూనెలను డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయిం చిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటికి టన్నుకి ఆయిల్ పామ్ గెలల ధర రూ.12534 ఉండగా ఈ నెల ఆయిల్ పామ్ గెలల ధర రూ.21546 పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రివర్యులు పేర్కొన్నా రు. ఆయిల్ పామ్ రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్ పామ్ సాగును లాభ సాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వారి ప్రోసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం మరియు ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుంది. అయితే తెలంగాణ ఆయిల్ ఫెడ్ ద్వారా నడపబడుతున్న అప్పరావ్ పేట మరియు అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యం త్రాలు ఏర్పాటు చేయడం, ఉన్న యంత్రాలను అధునికరిం చడం వల్ల ఆయిల్ పామ్ గెలల నుండి వచ్చే నూనె రికవరీ శాతం టన్నుకు 20.01 శాతముకు పెరగడం వల్ల టన్నుకు ఆయిల్ పామ్ గెలల ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రివర్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్ణయించబడిన ఆయిల్ పామ్ గెలల ధరను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవ్వాల్సి రావ డంతో అక్కడ పామ్ ఆయిల్ రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1992-93 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాల ను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందని, ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1,07,400 ఎకరాలలో 33500 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టరని 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం 456 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం 68,600 ఎకరాల నుండి ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తి జరుగుతున్నదని అన్నారు. రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించెందుకు ఏకరాకు రూ.50918 రాయి తిని 4 సంవత్సరాల కాలానికి ఇవ్వడం జరుగుతున్నదని, దీర్ఘకాలిక లాభాల నుండి ఆయిల్ పామ్ సాగు కోసం రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలని మంత్రి కోరారు.



# శారద పీఠం భూములు కొనసాగింపు

**జలమండలికి కేటాయింపులు రద్దు**

**అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ముఖ్యమంత్రి, పీఠం ప్రతినిధులకు సూచించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

## టీచర్ల జీతలు తగ్గించాలని సూచిస్తారా

## విద్యారంగ అభ్యున్నతికి ఒక్క సిఫార్స్ ఏదీ

## సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** ఇటీవల సీఎం రేవంత్‌కు సమర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

# భూదాన్ భూముల అక్రమాలపై ఉక్కుపాదం

## కబ్జాదారుల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దు

## బాధితులను ఆదుకుంటాం.. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

## రాజకీయ దుమారం రేపుతున్న బీఆర్ఎస్ తీరుపై మంత్రి మండిపాటు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలోని భూదాన్ భూముల వ్యవహారంలో కొందరు కబ్జాదారులు పేదలను అడ్డం పెట్టుకుని చేస్తున్న దందాపై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదల ముసుగులో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్న ముఠాల పట్ల కఠినంగా ఉంటామని, అదే సమయంలో మోసపోయిన అమాయక పేదల పట్ల మానవీయ కోణంలో వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. భూదాన్ భూముల్లో నివసిస్తున్న వారిలో నిజమైన అర్హులైన పేదలను గుర్తించాలని జిల్లా కలెక్టర్‌ను ఇప్పటికే ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ఇందుకోసం 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్‌కు సూచించినట్లు చెప్పారు. గత ఆరేడేళ్లుగా ఈ భూముల్లో పేదలు కరెంట్, డ్రైనేజీ, తాగునీరు వంటి కనీస వసతులు లేక దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారని, వారికి సకల సౌకర్యాలతో కూడిన పక్కా ఇళ్లు కట్టించి ఆత్మగౌరవంతో బతికేలా చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న విలువైన భూమిలో నకిలీ పట్టాలు సృష్టించి, పేదల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ముఠాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తుమ్మల పేర్కొన్నారు. "ప్రభుత్వ ఆస్తులను కాపాడటం బాధ్యత గల ప్రభుత్వంగా మా విధి. పేదల పేరుతో సాగుతున్న ఈ భూదందాను కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఖండించాయి. కానీ బాధ్యత లేని బీఆర్ఎస్ మాత్రం అక్రమార్కులను కాపాడేలా హంగామా చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం" అని మండిపడ్డారు.

### సంయమనం పాటించండి

సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాల పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేశానికి లోనుకాకుండా సంయమనంతో ఉండాలని మంత్రి కోరారు. యూట్యూబ్ జర్నలిస్టులపై పోలీస్ కేసులు పెట్టాల్సిన అవసరం లేదని, విచారణ పూర్తయ్యాక వాస్తవాలు తెలిసి వారే పశ్చాత్తాపపడతారని వ్యాఖ్యానించారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో పేదల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యమని, ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగనివ్వబోనని మంత్రి తుమ్మల పునరుద్ఘాటించారు.

# దేవుడి మీదే పడతావా..

- పోయేకాలం దాపురించింది
- అల్లుడి కోసం ఆలయాన్ని బలిస్తారా?
- రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కాదు.. ఇప్పుడు గుళ్లను కూడా కూలుస్తారా అని ధ్వజం
- కోకాపేట శారదాపీఠం కూల్చివేత యత్నాలపై బీఆర్ఎస్ సెగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లనే కాకుండా, ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారదాపీఠం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆలయానికి చేరుకుని ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడంతో, హరీశ్ రావు హుటాహుటిన అక్కడికి చేరుకుని పీఠాధిపతులకు మద్దతు ప్రకటించారు.



### అల్లుడి వ్యాపారం కోసం అమ్మవారి ఆలయమా?

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. "వాటర్ వర్క్స్ నిర్మించడానికే ఈ స్థలం కావాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ, సరిగ్గా ఇదే ఆలయానికి అవతలే 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని రేవంత్ రెడ్డి తన అల్లుడికి చెందిన 'భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్' సంస్థకు అక్రమంగా కట్టబెట్టారు. అల్లుడి క్రషర్ల కోసం 17 ఎకరాలు ఇస్తూ, హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే శారదాపీఠం రెండు ఎకరాలను లాక్కుంటారా?" అని నిలదీశారు. ఓఆర్ఆర్ నిబంధనలకు విరుద్ధంగా అక్కడ రెడీమిక్స్ ప్లాంట్లు నడుస్తున్నాయని, బిల్డర్లందరూ తన అల్లుడి దగ్గరే కంకర కొనాలని సీఎం బెదిరిస్తున్నారని ఆరోపించారు.

### చట్టబద్ధంగా ఇచ్చిన భూమిపై కక్ష సాధింపా?

2019లో కేసీఆర్ ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదంతో, పీఠం నిర్వాహకులు రూ. 1.05 కోట్లు చెల్లించి ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. "ఇక్కడ రాజశ్యామల అమ్మవారి ఆలయం, వేద పాఠశాల, గోశాల ఉన్నాయి. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలన్న కక్షతో భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా? దేవుడి మీద పడ్డవాడు ఎవడూ బాగుపడలేదు.. ఆ దేవుడి శాపం రేవంత్ రెడ్డికి తప్పక తగులుతుంది" అని హెచ్చరించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి పోలీసులు వచ్చి భయభ్రాంతులకు గురిచేయడం ఏ రకమైన పాలన అని ప్రశ్నించారు.

### బీఆర్ఎస్ పోరాటం ఖాయం

దేవాలయాన్ని, మఠాన్ని కూల్చకుండా క్యాబినెట్ మంత్రులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని హరీశ్ రావు కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకునే బాధ్యత మాదే. రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వం, ఎంత దూరమైనా పోరాడుతాం" అని ఆయన శపథం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు, పెద్ద ఎత్తున భక్తులు మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# దానమిచ్చిన భూమిలో పేదలకు స్థానం లేదా

- పెద్దల ఆక్రమణలు వదిలేసి, పేదల గుడిసెలు కూలుస్తారా
- ఎంపీ ఈటల రాజేందర్‌హా

**ఖమ్మం, ఫిబ్రవరి 28 :** భూదానోద్యమ పితామహుడు వినోబా భావే పేదల కోసం దానం చేసిన భూమిలో, పేదలకు స్థానం లేకుండా చేయడం రాష్ట్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. శనివారం వెలుగుమట్ల ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, కూల్చివేతలకు గురైన బాధితులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. "తొమ్మిది అసెంబ్లీ స్థానాలు కట్టబెట్టిన ఖమ్మం జిల్లా ప్రజల పట్ల అధికార పక్షం కక్ష సాధింపునకు పాల్పడటం శోచనీయం. ముగ్గురు కీలక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో నిరుపేదలకు రక్షణ లేకుండా పోయింది. హైదరాబాద్‌లో 'హైడ్రా' పేరుతో పేదల ఇళ్లను ఎలా కూల్చారో, అదే విధ్వంసాన్ని ఖమ్మంలో అమలు చేస్తున్నారు" అని ఈటల ఆరోపించారు. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చి, చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్న అభాగ్యులపై దౌర్జన్యం చేయడం అమానుషమని అన్నారు. వెలుగుమట్ల సర్వే నంబర్లు 147, 148, 149లలో ఉన్న 62 ఎకరాల భూమిలో సగం బడా బాబుల ఆక్రమణలో ఉందని ఈటల స్పష్టం చేశారు. "పేదలు వేసుకున్న గుడిసెలను నేలమట్టం చేసే దమ్మున్న ప్రభుత్వానికి, 31 ఎకరాలను ఆక్రమించుకున్న బడా బాబుల జోలికి వెళ్లే ధైర్యం ఉందా?" అని సవాల్ విసిరారు. ఏ కోర్టు ఉత్తర్వులూ లేకుండానే, తెల్లవారుజామున 4 గంటలకే భారీ పోలీసు బలగాలతో వచ్చి నిరుపేదల సామాగ్రిని ధ్వంసం చేయడం అధికారుల బానిసత్వానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని ఈటల హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి అదే స్థలంలో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, తక్షణ సాయం కింద ప్రతి కుటుంబానికి రూ. 50 వేల నుండి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం చెల్లించాలని, అమానుషంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, పేదల ఇళ్ల కూల్చివేతల్లో మాత్రం వేగం చూపిస్తోందని విమర్శించారు. పేదల ఉసురు తగిలి ఈ ప్రభుత్వం త్వరలోనే పతనం కావడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# 99 రోజుల 'ప్రగతి ప్రణాళిక'

- అధికారులకు సీఎం దిశానిర్దేశం
- ప్రతి శాఖకు సొంత భవనం.. నిర్ణీత సమయంలోనే ఫైళ్ల క్లియరెన్స్!
- ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి
- జూన్ 2 నాటికి కొత్త రూపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** తెలంగాణ పాలనలో వేగం పెంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించారు. శనివారం సచివాలయంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయాల్సిన 99 రోజుల యాక్షన్ ప్లాన్పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పారిశ్రామికీకరణ, డిజిటల్ గవర్నెన్స్ మరియు ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మార్చి 6 నుండి 99 రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుంది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని, పండుగను ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని, ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలని స్పష్టం చేశారు. పాత సర్వర్లను అప్‌డేట్ చేసి, ఆన్‌లైన్ విధానంలో పనులు వేగవంతం చేయాలని, ఫైళ్లు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత సమయంలో క్లియర్ చేయాలని సూచించారు. తెలంగాణ పారిశ్రామికంగా దేశానికి ఆదర్శంగా ఉండాలని, 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ప్రారంభించబోతున్నామని, ప్రభుత్వ విద్యను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని వెల్లడించారు. అలాగే, ప్రాంతాల వారీగా ప్రజల మెడికల్ డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. "ప్రతి ఎన్నికలోనూ ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు. ఇప్పుడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మేలు చేయడమే మా లక్ష్యం. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి, ఈ 99 రోజుల ప్రణాళికలో ఎవరికీ మినహాయింపులు ఉండవు" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మార్చి 4న జరిగే కలెక్టర్ల సమావేశంలో అధికారుల పనితీరుపై లోతుగా సమీక్షిస్తానని ఆయన వెల్లడించారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ అధికారులు మరియు వివిధ శాఖల సెక్రటరీలు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో ఇఫ్తార్ విందు

## పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**వికారాబాద్, ఫిబ్రవరి 28 :** పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా వికారాబాద్ పట్టణంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం శాంతి, సహనం, సేవా భావం మరియు మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సామరస్యం పెంపొందించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ లౌకికవాదం, సామాజిక న్యాయం మరియు సమానత్వానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన గౌరవం కల్పించడం ప్రభుత్వం మరియు రాజకీయ పార్టీల బాధ్యత అని పేర్కొన్నారు.






# బెజ్జంకి మండలంలో ఘనంగా సైన్స్ దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ నమూనాలు
- రక్త వర్గాల పరీక్షలు నిర్వహించిన తోటపల్లి విద్యార్థులు




**బెజ్జంకి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

బెజ్జంకి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీవీ రామన్ సేవలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్లు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ మేధస్సుకు పదును పెట్టిన విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి చక్కగా అలంకరించి ప్రదర్శించారు. తోటపల్లి పాఠశాల విద్యార్థులు ఊపిరితిత్తులు, గుండె, మెదడు, మూత్రపిండాల నమూనాలను తీసుకువచ్చి వాటి పనితీరును ప్రయోగాత్మకంగా వివరించారు. అక్కడికి వచ్చిన అతిథులందరికీ రక్త వర్గాల నమూనా పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యేసు రేవతి, తోటపల్లి గ్రామ సర్పంచ్ ఖమ్మంపల్లి అశ్విని, ఉప సర్పంచ్ నాంపల్లి శంకర్, ఉపాధ్యాయులు జీ సరస్వతి, కే సురేష్, బాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నంగునూరు మండలంలో ఘనంగా టైలర్స్ డే

- మేరు కుల సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ
- ప్రభుత్వానికి పలు డిమాండ్లు వెల్లడి



**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో మేరు కుల సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మేరు కుల సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కీర్తి బాలరాజు అధ్యక్షత వహించగా.. ఉపాధ్యక్షులు గూడూరు యాదగిరి, కోశాధికారి కీర్తి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులు కీర్తి రాజు, అన్న రాజయ్య, కీర్తి ఆంజనేయులు, కాటారం ఆంజనేయులు హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం సభ్యుల ఐక్యతను చాటుతూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం నాయకులు ప్రభుత్వానికి పలు డిమాండ్లు వినిపించారు. మేరు కుల వృత్తిదారులకు సబ్సిడీతో కూడిన కుట్టు మిషన్లు అందజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫార్మ్ కుట్టు పనులను తప్పనిసరిగా మేరు కుల సంఘాలకే కేటాయించాలని విన్నవించారు. అలాగే మేరు సంఘంలో 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## వృత్తిదారులకు ప్రోత్సాహం అవసరం

మేరు వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. తమ వృత్తికి తగిన ప్రోత్సాహం లభిస్తే అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నంగునూరు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో.. సభ్యులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

# అడవుల రక్షణకు 'డ్రోన్' నిఘా

**ఇందన్‌పల్లిలో అటవీ శాఖ ప్రత్యేక శిక్షణ**

**సాంకేతికతతో పటిష్టమైన అటవీ సంరక్షణ**

**కలప అక్రమ రవాణా, ఇసుక మాఫియాపై డేగ కన్ను**

**రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రత ఆధారిత పర్యవేక్షణ**




**జన్నారం, ఫిబ్రవరి 28 (మనసులో మాట)**

అడవుల సంరక్షణలో ఆధునిక సాంకేతికతను జోడించి, నిఘాను మరింత పటిష్టం చేసే దిశగా అటవీ శాఖ కీలక అడుగులు వేస్తోంది. మంచిర్యాల జిల్లా జన్నరం అటవీ విభాగం పరిధిలోని ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలో గత రెండు రోజులుగా డ్రోన్ల నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన భౌగోళిక సమాచార వ్యవస్థ ప్రతినిధి రవికిరణ్ బృందం సభ్యులు జన్నరం అటవీ సిబ్బందికి డ్రోన్ వినియోగంపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. అటవీ ప్రాంతంలో డ్రోన్లను ఎలా నడపాలి, సమాచారాన్ని ఎలా సేకరించాలి అనే అంశాలపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా అటవీ పర్యవేక్షణ అత్యంత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అక్రమంగా చెట్లు నరికే వారు, కలప రవాణా చేసేవారు, ఇసుక మాఫియా కదలికలను వీటి ద్వారా సులభంగా పసిగట్టవచ్చని వివరించారు. అటవీ లోతట్టు ప్రాంతాల్లో జంతువుల సంచారాన్ని నిరంతరం గమనిస్తూ వన్యప్రాణుల సంరక్షణకు ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో అటవీ మంటలను ముందుగానే గుర్తించి భారీ నష్టాన్ని నివారించే వీలుంటుందని వెల్లడించారు. ఇకమీదట జన్నరం విభాగంలో నిరంతరం డ్రోన్ నిఘా ఉంటుందని ఇందన్‌పల్లి అటవీ క్షేత్రాధికారి ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ డ్రోన్లు రాత్రి సమయంలో కూడా ఉష్ణోగ్రత గుర్తుల ఆధారంగా పనిచేస్తాయి. దీనివల్ల చీకటిలో అడవిలోకి ప్రవేశించే వ్యక్తులను, జంతువులను స్పష్టంగా గుర్తించే వీలుంటుందని ఆయన వెల్లడించారు. అడవుల రక్షణ కోసం సిబ్బందికి ఇటువంటి అధునాతన శిక్షణ ఇవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# పొనకల్ పాఠశాలలో సైన్స్ వేడుకలు.. విద్యార్థుల అద్భుత ప్రదర్శన

**వైజ్ఞానిక నమూనాలతో మెరిసిన చిన్నారులు**

**శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సర్పంచ్ సుష్మ పిలుపు**



**జన్నారం, ఫిబ్రవరి 28 (మనసులో మాట)**

జన్నరం మండల పరిధిలోని పొనకల్ ప్రాథమిక పాఠశాల వేదికగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సైన్స్ ఫెయిర్ ను పొనకల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు, నమూనాలను వారు నిశితంగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు పనితీరును చిన్నారులను అడిగి తెలుసుకుని వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు పునాది వేయాలని, ప్రయోగాత్మక విద్యపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. చక్కటి సైన్స్ ఫెయిర్ నిర్వహించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ మూల రేణుక, ఉపాధ్యాయులు రాజేశం, శ్రీకాంత్, వనిత, సుజాత, సమ్రీన్ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు తయారు చేసిన ప్రయోగాలు వైజ్ఞానిక స్ఫూర్తిని రగిలించేలా సాగడంతో పాఠశాల ప్రాంగణం కోలాహలంగా మారింది.

# ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడి ఆత్మహత్య

**కుమార్తె అనారోగ్యం.. అప్పుల బాధతో మనస్థాపం**

**రేకుల షెడ్డులో ఉరివేసుకున్న రాజయ్య**

**కేసు నమోదు చేసిన ఎస్ఐ బోయిని సౌజన్య**



**బెజ్జంకి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

బెజ్జంకి మండల కేంద్రంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గుబిరె రాజయ్య (64) శనివారం ఉదయం తన నివాసంలోని రేకుల షెడ్డులో నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి భార్య నరసవ్వ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. వారి కుమార్తె అనారోగ్య కారణాలతో హైదరాబాద్ లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల వల్ల తలెత్తిన ఆర్థిక ఇబ్బందులతో రాజయ్య తీవ్ర మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ ఐదుగురు కుమార్తెలను సాకుతున్నారు. రాజయ్య ఆత్మహత్యతో ఎల్లంపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బోయిని సౌజన్య వెల్లడించారు.

# పీఎంఎఫ్ఎంఈ లబ్ధిదారులకు అవగాహన సదస్సు

**బిచ్కుందలో జుక్కల్ నియోజకవర్గ స్థాయి కార్యక్రమం**

**ఆరు మండలాల మహిళా సంఘాల సభ్యుల హాజరు**

**ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ మెలకువలపై అవగాహన**



**బిచ్కుంద, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ, జుక్కల్, పెద్ద కోడపగల్, పిట్లం మండలాలకు చెందిన పీఎంఎఫ్ఎంఈ లబ్ధిదారులకు బిచ్కుంద మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో అదనపు డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఎం ఫామ్ సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ప్రాముఖ్యతను వివరిస్తూ.. ఫుడ్ ప్రాసెస్ విధానం, దానికి సంబంధించిన వివిధ స్కీమ్ ల గురించి అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆహార ఉత్పత్తుల తయారీకి అవసరమైన యంత్రాలు, ప్యాకింగ్, లేబులింగ్ తో పాటు మార్కెటింగ్ పద్ధతులపై కూలంకషంగా వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రవీందర్, గంగారామ్, సాయిలు పాల్గొన్నారు. వీరితో పాటు ఆరు మండలాల సీసీలు, వీఓఏలు, పీఎంఎఫ్ఎంఈ మహిళా సంఘాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమకు ఉన్న సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకున్నారు.

# దేశాభివృద్ధికి రాహుల్ గాంధీ నాయకత్వం అనివార్యం: జగ్గారెడ్డి

**గాంధీ కుటుంబం త్యాగాల వల్లే నేటి అభివృద్ధి**

**తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియా, రాహుల్ గాంధీలదే**

**సంగారెడ్డి పారిశ్రామికాభివృద్ధికి నెహ్రూ, ఇందిరా గాంధీలే పునాది**

**యువత భవిష్యత్తు కోసం రాహుల్ ప్రధాని కావాలి**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

దేశ రాజకీయాల్లో నాయకత్వం అంటే కేవలం కుర్చీ ఎక్కడం కాదని, ప్రజల కష్టాలను గుర్తించి సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందించడమే నిజమైన పాలన అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటువంటి గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్న ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని స్పష్టం చేశారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పోషించిన పాత్ర అపూర్వమని జగ్గారెడ్డి గుర్తు చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పేదలను ఆర్థికంగా ఆదుకుందని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలను జవాబుదారీగా మార్చిన సమాచార హక్కు చట్టం కాంగ్రెస్ తెచ్చిన విప్లవాత్మక మార్పు అని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా.. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన ధైర్యశాలి సోనియా గాంధీ అని కొనియాడారు. ఈ చారిత్రక నిర్ణయంలో రాహుల్ గాంధీ పాత్ర మరువలేనిదని చెప్పారు.

## సంగారెడ్డి అభివృద్ధికి ఇందిరమ్మే పునాది

సంగారెడ్డి ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి గురించి జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ డ్యామ్, ఇక్రిశాట్, బీహెచ్ఈఎల్, ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, పటాన్‌చెరు బీడీఎల్, ఐడీపీఎల్ వంటి సంస్థలు ఇక్కడికి వచ్చాయంటే అది నెహ్రూ, ఇందిరా గాంధీ దూరదృష్టి వల్లే సాధ్యమైందని తెలిపారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనని చెప్పారు. నేడు మనం వాడుతున్న సెల్‌ఫోన్, ఐటీ విప్లవానికి ఆయనే బీజం వేశారని గుర్తు చేశారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావాలి

ప్రస్తుత యువత అనుభవిస్తున్న అభివృద్ధి ఫలాలు కాంగ్రెస్ పార్టీ తీసుకున్న విధాన నిర్ణయాల ఫలితమేనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈ సత్యాన్ని యువత గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశం మళ్లీ ఆర్థికంగా, పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అగ్రగామిగా నిలవాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల పక్షాన నిలిచే నాయకుడికి అండగా ఉండాలని కోరారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# సైన్స్ ద్వారానే మానవ అభివృద్ధి

**ది మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపల్ భారతి లక్ష్మి**

**మియాపూర్ బ్రాంచ్ లో ఘనంగా సైన్స్ డే**




**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**



సైన్స్ ద్వారానే మానవ అభివృద్ధి చెందుతుందని ది మాస్టర్ మైండ్ మియాపూర్ బ్రాంచ్ ప్రిన్సిపల్ భారతి లక్ష్మి అన్నారు. జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను తయారుచేసి స్కూల్ ఆవరణలో ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనను కాలనీకి చెందిన వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త రామ్ ప్రభు మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్సును తమ జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. అనునిత్యం కొత్త విషయాలను నేర్చుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్స్ విభాగాలకు సంబంధించిన ప్రాజెక్టులను చూసి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాడల్ ఐక్యరాజ్యసమితిలో మెరిసిన విద్యార్థులు

**11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక**




**మెదక్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోషల్ ఫోరమ్ సహకారంతో మాడల్ ఐక్యరాజ్యసమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాధికారి విజయ, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోని 28 పీఎమ్ శ్రీ పాఠశాలల నుంచి 56 మంది విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా మారి ఆయా దేశాల తరఫున చర్చల్లో పాల్గొన్నారు. మరో 10 మంది విద్యార్థులు జర్నలిస్టులుగా వ్యవహరించారు. సమావేశంలో ఉత్తమ ప్రసంగాలు చేసిన 11 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు సుదర్శనమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎమ్ ఓ సుదర్శనమూర్తి, వివిధ మండలాల విద్యాధికారులు, న్యాయ నిర్ణేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**కమలాపూర్ పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శన**

**ఆకట్టుకున్న జల చక్రం, సేంద్రియ వ్యవసాయ నమూనాలు**

**సీవీ రామన్ సేవలను స్మరించుకున్న ఉపాధ్యాయులు**



**గొల్లపెల్లి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ఉయ్యాల రజిత మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను వివరించేలా విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎదుల మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు తార్కిక మేధస్సును పెంపొందించేందుకు ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయురాలు గజెల్లి సునీత మాట్లాడుతూ.. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొని భారతదేశానికి నోబెల్ బహుమతిని తీసుకువచ్చిన సందర్భంగా ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన జల చక్రం, సేంద్రియ ఎరువులతో వ్యవసాయం, వర్షపు నీటి వినియోగం, సమతుల్య ఆహారం, నీటి శుద్ధి నమూనా, గాలి చక్రం, ఎలక్ట్రిక్ బెల్, విండ్ మిల్ వంటి సైన్స్ నమూనాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మ్యాన పవన్ కుమార్, నూనావత్ రాజేష్, సంద వెంకటేష్, మాదాసు సూర్య తేజ, భోజనపు శ్రీలత, గర్వందుల సంజన పాల్గొన్నారు.

# తెలంగాణలో అపోలో ఫార్మసీ వెయ్యి స్టోర్ల మైలురాయి

**హైదరాబాద్‌లో వెయ్యో స్టోర్‌ను ప్రారంభించిన ఉపాసన కామినేని కొణిదెల**

- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో విస్తరించిన సేవలు
- 10,000 మందికి పైగా ఉపాధి.. 25 లక్షల మంది వినియోగదారులు
- వచ్చే మూడేళ్లలో మరో 200 కొత్త స్టోర్లకు ప్రణాళిక

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

భారతదేశంలో అతిపెద్ద ఫార్మసీ నెట్‌వర్క్ 'అపోలో ఫార్మసీ' తెలంగాణ రాష్ట్రంలో తన 1,000వ స్టోర్ మైలురాయిని చేరుకుంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ మైలురాయి స్టోర్‌ను అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదెల ప్రారంభించారు. తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో అపోలో ఫార్మసీ తన కార్యకలాపాలను విస్తరించింది. రిటైల్, డిజిటల్, సప్లై చైన్ విభాగాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. ఈ నెట్‌వర్క్ ద్వారా 50,000 పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్నెస్ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇరవై ఐదు లక్షల మంది 24/7 వినియోగదారులు ఈ సేవలను వాడుకుంటున్నారు. ప్రాంతీయ నెట్‌వర్క్, సమగ్ర సరఫరా వ్యవస్థతో అపోలో ప్రతిరోజూ 1.65 లక్షలకు పైగా మందుల ఆర్డర్లు అందిస్తోంది. రాబోయే మూడేళ్లలో తెలంగాణలో మరో 200 పైగా కొత్త ఫార్మసీ స్టోర్లను ప్రారంభించనున్నారు.



### వైద్య సేవలు అందరికీ చేరువ కావడమే లక్ష్యం

ఈ సందర్భంగా ఉపాసన కామినేని కొణిదెల మాట్లాడుతూ.. అత్యధిక స్టోర్లు 24 గంటల పాటు పని చేస్తాయని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ మందుల హోమ్ డెలివరీ సదుపాయం ఉందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు సెమీ-అర్బన్ ప్రాంతాల్లో కూడా




అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా విస్తరణ చేపట్టినట్లు వివరించారు. ప్రాంతీయ నెట్‌వర్క్, సమగ్ర సరఫరా వ్యవస్థతో అపోలో ప్రతిరోజూ 1.65 లక్షలకు పైగా మందుల ఆర్డర్లను అందిస్తోందని చెప్పారు. రాబోయే మూడేళ్లలో తెలంగాణలో మరో 200 పైగా కొత్త ఫార్మసీ స్టోర్లను ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఈ విజయం నాణ్యమైన ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేయాలన్న తమ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కుటుంబాలు, కమ్యూనిటీలు తమ సొంతంగా భావించే ఒక నమ్మకమైన ఫార్మసీ వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. అపోలో ఓమ్నీ ఛానల్ ప్లాట్‌ఫారమ్ 'అపోలో 24/7' ద్వారా ప్రజలు తమ ఇంటి వద్దే సమగ్ర వైద్య సేవలను పొందవచ్చని సూచించారు. ఇందులో అపోలో వైద్యులతో టెలీ-కన్సల్టేషన్లు (వీడియో కాల్ ద్వారా సలహాలు), డయాగ్నస్టిక్ సేవలు, ప్రత్యేక ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### అపోలో హెల్త్ కో గురించి..

అపోలో హెల్త్ కో దేశంలో అతిపెద్ద ఫార్మసీ రిటైల్ నెట్‌వర్క్ అపోలో ఫార్మసీని నిర్వహిస్తోంది. ఇది 19,000 పైగా పిన్ కోడ్లలో 7,100 పైగా స్టోర్లను కలిగి ఉంది. భారతదేశంలో అతిపెద్ద డిజిటల్ హెల్త్ కేర్ ప్లాట్‌ఫారమ్ 'అపోలో 24/7'ను కూడా ఇది నడుపుతోంది. తన ఓమ్నీ-ఛానల్ ద్వారా 4.6 కోట్ల మంది నమోదిత వినియోగదారులకు ప్రతిరోజూ సుమారు ఒక లక్ష మందులను హోమ్ డెలివరీ చేస్తోంది. నెలకు 4.5 లక్షల డాక్టర్ కన్సల్టేషన్ బుకింగ్లను, నెలకు 80 వేల డయాగ్నస్టిక్ బుకింగ్లు చేస్తోంది. ప్రత్యక్షంగా వినియోగదారులకు అందించే సేవలకే పరిమితం కాకుండా అపోలో హెల్త్ కో ఫార్మాస్యూటికల్ పంపిణీ రంగంలో కూడా చురుగ్గా వ్యవహరిస్తోంది. భారీ స్థాయిలో మందులు, ఎఫ్ ఎమ్ సీ జీ, వెల్నెస్ ఉత్పత్తుల సేకరణ, పంపిణీని ఇది నిర్వహిస్తుంది. అత్యాధునిక సాంకేతికత, ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత సాధనాలు, అపోలోకు ఉన్న విశ్వసనీయమైన వైద్య నైపుణ్యంతో అపోలో హెల్త్ కో భారతదేశంలో సమగ్ర ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును తీర్చిదిద్దుతోంది.

# సామాన్య భక్తులకు వీఐపీ సౌకర్యాలు

- 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి అడ్లూరి సమీక్ష
- జగిత్యాల జిల్లాలో రూ. 940 కోట్లతో అభివృద్ధి పనుల అంచనా
- నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ
- 4 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా
- సమీక్షకు రాని అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం




**గొల్లపెల్లి,ఫిబ్రవరి 28 (మనసులో మాట) :**

గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్ పీ అశోక్ కుమార్, అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ తో పాటు వివిధ శాఖల అధికారులు, ఈవై కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### రూ. 940 కోట్లతో ప్రణాళికలు

గత 2015 గోదావరి పుష్కరాలకు జగిత్యాల జిల్లాలోని వివిధ ఘాట్ల వద్ద కోటి 50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించగా.. ఈసారి ఆ సంఖ్య 4 కోట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులకు సుమారు 940 కోట్ల రూపాయలతో అంచనాలు సిద్ధం చేశారు. వీటిపై మంత్రి స్పందిస్తూ.. బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాల కోసం నిధులు కేటాయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారని పేర్కొన్నారు. నిధుల విడుదల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానని చెప్పారు. అధికారులు రూపొందించిన ప్రణాళికల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు.

### సామాన్యులకు పెద్దపీట

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పారిశుద్ధ్యం, పార్కింగ్ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పుష్కరాల సందర్భంగా వీఐపీ భక్తులకు అందే తరహాలోనే సామాన్య భక్తులకు కూడా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. గోదావరి నది వెంట ఉన్న ఆలయాలను ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేయాలని, గత పుష్కరాల కంటే మెరుగ్గా ఈసారి ఏర్పాట్లు ఉండాలని దిశానిర్దేశం చేశారు. కనురెప్ప పాటు కూడా కరెంట్ అంతరాయం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

### అధికారుల తీరుపై ఆగ్రహం

పుష్కరాల వంటి అత్యంత కీలకమైన సమీక్షా సమావేశానికి హాజరు కాని పలువురు అధికారుల తీరుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరో 10 రోజుల్లో పుష్కరాల ఏర్పాట్లపై మళ్లీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

# బీఆర్ఎస్ కార్యకర్త పోచయ్య మృతి.. రూ. 5,000 ఆర్థిక సాయం

**మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి చొరవ**

**అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు నగదు అందజేత**



**చిన్న శంకరంపేట, ఫిబ్రవరి 28 (మనసులో మాట):** మెదక్ నియోజకవర్గ పరిధిలోని చందంపేట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త బుర్క పోచయ్య అనారోగ్యంతో మరణించారు. పోచయ్య మృతికి సంతాపం వ్యక్తంచేసిన నియోజకవర్గ ఇన్చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి.. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మాజీ సర్పంచ్ తాటికొండ స్వామి రాజ్ ద్వారా పంపించారు. స్వామి రాజ్ చందంపేట గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులకు ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ శేరి స్వామి, మాజీ ఎంపీటీసీ పోచాగౌడ్, వార్డు సభ్యులు గరిగే నర్సింలు, డోలి నరేష్, బుర్క సంగయ్య, బుర్క నారాయణ, బుర్క శ్రీనివాసు, బోయిని రాజు, బుర్క దాసు, రోడ్డ భరత్, ముంద్రాతి మురళీ, తప్పటి రామకృష్ణ, తాటికొండ పోచయ్య పాల్గొన్నారు.

పంచాయితీ, మున్సిపాలీటీల గడువు దగ్గర పడుతోన్న క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ స్థానిక పోరుకు సన్నద్ధం అవుతోంది. అధికార పార్టీ ఇప్పటికే పార్టీ నేతలకు, కేడర్‌కు స్థానిక ఎన్నికలపై సంకేతాలు ఇచ్చినట్లుగా సమాచారం అందుతోంది. రానున్న స్థానిక ఎన్నికల్లో టిడిపి కూటమి 90 శాతం సీట్లు సాధించాలన్న భావనతో ఉంది. ఒక వేళ రిజర్వేషన్ ప్రక్రియ అడ్డుగా వస్తే దానిని సమీకృత సర్వే ఆధారంగా రిజర్వేషన్లు చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ఇదిఇలావుండగా, రాష్ట్రంలో రోజురోజుకు మారుతోన్న రాజకీయ పరిణామాల నేపధ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుందా..? అనుకుంటున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి అని ఆదేశించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా అధ్యక్షులు, నియోజవకర్గం ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్యేలకు సంకేతాలు పంపించినట్లు పార్టీలో వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ పరిణామాలు జరిగినా పార్టీ, ప్రభుత్వంపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పార్టీ కేడర్‌కు దిశా నిర్ధేశం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.కాగా, తిరుపతి లడ్డూ వ్యవహారం, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్ళపై దాడి ఎపిసోడ్ గత వారం వరకు జరిగింది. తాజాగా హెరిటేజ్ వ్యవహారం రంగంలోకి వచ్చింది. లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపధ్యంలో ప్రధాన పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో డ్రామాలు, రాజకీయ ఎత్తుగడలు చోటు చేసుకున్నాయి. ఈ ఎపిసోడ్‌లో ప్రభుత్వం కొంత ఇరుకున పడిందని చెప్పవచ్చు. దీనితో ప్రజల్లో వ్యతిరేక భావాలు వచ్చాయని కూటమి ప్రభుత్వంకు తెలుసు. అయితే వాటిని కేడర్ దగ్గరకు వెళ్ళకుండా చేయలగలిగింది.
ఈనేపధ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీతో పంచాయితీ పదవీ కాలం ముగుస్తుంది.

అమరావతి, పొలిటికల్ బ్యూరో
(మనసులో మాట)





## ఇప్పుడు ఎన్నికలు కరెక్టేనా..?

రాష్ట్రంలో జరుగగుతోన్న రాజకీయ పరిణామాల నేపధ్యంలో ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎవరికి అడ్వాంటేజిగా ఉంటుందన్న కోణంలో ప్రభుత్వం యోచిస్తోంది. జరుగుతోన్న పరిణామాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నాయని భావిస్తే స్థానిక ఎన్నికలకు తప్పని సరిగా వెళ్ళే అవకాశం ఉంది. ప్రతిపక్షాలకు అనుకూలంగా మారుతుందన్న భావన ఉంటే ఏదో రకంగా వాయిదా వేసే అవకాశాలు లేకపోలేదు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన ఎన్నికల ప్రక్రియను కూటమి పాటిస్తే 80 శాతం పంచాయితీలు మున్సిపాలిటీలు కూటమికి అనుకూలంగా మారుతాయి. కాబట్టి ఎన్నికల వెళ్ళాలన్న నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

- మార్చి 9లోగా ఓటర్ల జాబిత ప్రకటన
- ఏకీకృత సర్వే ఆధారంగా ఎన్నికలకు వెళ్లే యోచనలో సర్కార్
- 90 శాతం మనేమే గెలవాలని సిఎం దిశా నిర్ధేశం
- స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలా..వద్దా..? సంశయంలో వైసిపి
- గత ఎన్నికలను దృష్టి ఉంచితే..ఈ ఎన్నికలది కూడా అదే పంథా

# స్థానిక సంస్థల ఎన్నికలకు... మొదలైన కసరత్తు!

## ఇప్పటికే పనులు ప్రారంభించిన ఎన్నికల కమీషన్

## మూడు కీలకంశాలపై సిఈసి నోటిఫికేషన్లు

మార్చి 17 తో మున్సిఫల్ ఎన్నికల పదవీ కాలం ముగుస్తుంది. ఇదిఇలావుండగా, రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని మూడు కీలకాంశాలపై నోటిఫికేషన్లు జారీ చేసింది.గ్రామ పంచియితీలలో వార్డుల వారీగా,మున్సిపాలిటీలు,నగరాలలో వార్డులు, డివిజన్ల వారీగా కొత్త ఓటర్ల జాబితాను సిద్దం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వీటన్నింటిని మార్చి 9 వతేదీలోగా ప్రచురించాలని ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించాన నేపధ్యంలో ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే రాష్ట్రం ప్రభుత్వం ' సాధికారత కుటుంబ సర్వే' ఆధారంగా ఎన్నికలు వెళ్ళే ఆలోచనలో ఉంది. సాధికారత సర్వే కేవలం సంక్షమ పథకాల కాకుండా కుటుంబం కులం అంటే ఎస్సి, ఎస్టీ సామాజిక వర్గఆలకు సంబంధించిన జనాభా గణాంకాలు కూడా ఏకీకృత సర్వే లో వస్తున్నాయి. కాబట్టి దానిని పరిగణలోకి తీసుకుని ఎన్నికలకు వెళ్ళుఏ ఆలోచన చేస్తుంది.పంచాయితీ పదవీ కాలం ముగుస్తుంది. మార్చి 17 తో మున్సిఫల్ ఎన్నికల పదవీ కాలం ముగుస్తుంది. ఇదిఇలావుండగా,

రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని మూడు కీలకాంశాలపై నోటిఫికేషన్లు జారీ చేసింది.గ్రామ పంచియితీలలో వార్డుల వారీగా,మున్సిపాలిటీలు,నగరాలలో వార్డులు, డివిజన్ల వారీగా కొత్త ఓటర్ల జాబితాను సిద్దం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వీటన్నింటిని మార్చి 9 వతేదీలోగా ప్రచురించాలని ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించాన నేపధ్యంలో ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే రాష్ట్రం ప్రభుత్వం 'ఏకీకృత కుటుంబ సర్వే' ఆధారంగా ఎన్నికలు వెళ్ళే ఆలోచనలో ఉంది. ఏకీ కృత సర్వే కేవలం సంక్షమ పథకాల కాకుండా కుటుంబం కులం అంటే ఎస్సి, ఎస్టీ సామాజిక వర్గఆలకు సంబంధించిన జనాభా గణాంకాలు క ా ా ఏ కీ క్ృ త స ర్వే లో వస్తున్నాయి. కాబట్టి దానిని పరిగణలోకి తీసుకుని ఎన్నికలకు వెళ్ళుఏ ఆలోచన చేస్తుంది.




## రాష్ట్రంలో 17 నగర కార్పోరేషన్లు, 106 మున్సిపాలిటీలు

రాష్ట్రంలో మెత్తం 17 నగర కార్పోరేషన్లు,106 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో 13 కిర్పోరేషన్లు, 87 మున్సిపాలిటీలకు పాలక వర్గాలు కొనసాగుతున్నాయి.పాలక వర్గాలు కొనసాగుతోన్న 13 కార్పోరేషన్లలో 11 చోట్ల మార్చి 17తో పదవీ కాలం ముగుస్తుంది. 87 మున్సిపాలిటీలకు గను 75 మున్సిపాలిటీలకు మార్చి 17 పదవీకాలం ముగుస్తుంది.అదే విధంగా మున్సిపాలిటీలు,నగర పంచాయితీలు,నగర కార్పోరేషను అన్నీ కలిపి 123 ఉండగా వంద మున్సిపాలిటీలో పాలక వర్గాలు కొనసాగుతున్నాయి.మిగిన మున్సినపాలిటీలలో కొన్ని కోర్టు కేసులలో ఉండగా, మరికొన్ని వివిధ కారణాలతో ఉన్నాయి. ఇదిఇలావుండగా, గతాన్ని పరిశీలిస్తే బీసీ గణాంకాల కారణంగా నిలిచి పోయినవి చాలా ఉన్నాయి. వాటిని అధిగమించాలంటే ఏకీకృత సర్వే ఆధారంగా ఎన్నికలకు వెళతామని కోర్టుకు విన్నవించే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వ వాదనకు బీసీలు ఆమోదించే అవకాశం కనిపించడంలేదు. ఇదిఇలావుండగా, సుప్రీంకోర్టు ఆదేశించిన తీర్పు అదారంగా 'ట్రిపుల్ టెస్టు నబందనను పాటించేందుకు ప్రభుత్వం అవకాశం కలిపిస్తే ఎన్నికలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.




### ఎన్ని అవాంతరాలు ఎదురైన పోటీ చేయాల్సిందే

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను నిలువనివ్వరేమో అన్న అనుమానం వైసిపి నేతల్లో వ్యక్తమవుతోంది.ఈ నేపధ్యంలో ఎన్నికల్లో వైసిపి దిగుతుందా అన్న సందేహం ప్రతి ఒక్కరిలో ఉంది. వైసిపి అధికారంలో ఉన్నప్పడు టిడిపి నేతలు కార్యకర్తలు ఎవరు ముందుకు రాలేదు. వారు బయటకు రావడానికి సుమారు రెండున్నర ఏళ్లు పట్టింది. కాని కూటమి అధికారం లోకి వచ్చిన తరువాత ఏడాదిలోనే వైసిపి బయటకు వచ్చి ఆందోళనలు చేస్తుంది.ఈ తరుణంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని నేతలు, కేడలు భావిస్తున్నారు



# నీలాద్రి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కుంట్లూర్ కాకతీయ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు**

**వైద్యుల సలహాతో ఉచితంగా మందుల పంపిణీ**



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

హయత్ నగర్ లోని నీలాద్రి ఆసుపత్రి, కాకతీయ పాఠశాలల సమూహం సంయుక్త ఆధ్వర్యంలో కుంట్లూర్ గ్రామ కాకతీయ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన ఈ శిబిరంలో వైద్యులు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన విద్యార్థులకు వైద్యుల సలహాల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం

చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో నీలాద్రి ఆసుపత్రి చైర్మన్ జితేందర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, మేనేజర్ లింగం, సందీప్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ చంద్ర, ఇన్ ఛార్జి సరిత, ఆసుపత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామాజిక బాధ్యతగా ఇటువంటి శిబిరాలు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# శంకర్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం



**శంకర్ పల్లి, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శనివారం ప్రారంభించారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి అర్హుడికి పక్కా గృహం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

### అర్హులందరికీ పక్కా ఇళ్లు

సాయి బాబా థియేటర్ వెనుక ప్రాంతంతో పాటు బీవీఆర్ గార్డెన్ సమీపంలో నిర్మించిన ఇళ్లను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులతో ముచ్చటించారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. పారదర్శకమైన పద్ధతిలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమకు సొంత ఇళ్లు సమకూరడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆహార భద్రతా చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి
- రంగారెడ్డి జిల్లాలో ఆహార కమిషన్ బృందం క్షేత్ర పర్యటన
- అంగన్వాడీల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం
- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని కమిషన్ బృందం రంగారెడ్డి జిల్లాలో శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సరూర్ నగర్, హయత్‌నగర్ మండలాల్లో జాతీయ ఆహార భద్రతా పథకం అమలును బృందం సభ్యులు నిశితంగా పరిశీలించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదల సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. పౌష్టికాహార పంపిణీలో ఎక్కడా అలసత్వం వహించకూడదని అధికారులను హెచ్చరించారు.

### అంగన్వాడీల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కమిషన్ బృందం ఆదేశించింది. ముఖ్యంగా బరువు తక్కువ ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని స్పష్టం చేసింది. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల వివరాలు, కేటాయింపు ఉత్తర్వులతో పాటు ఈ-పోస్ లావాదేవీలను అధికారులు స్వయంగా తనిఖీ చేశారు. రేషన్ బియ్యం సకాలంలో లబ్ధిదారులకు అందుతున్నాయా అనే అంశంపై ఆరా తీశారు.

### పథకాల అమలుపై సమగ్ర సమీక్ష

క్షేత్ర పర్యటన అనంతరం ఐసీడీఎస్, పీఎం పోషణ, ప్రసూతి ప్రయోజన పథకాల అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన కుటుంబాల గుర్తింపు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, సామాజిక తనిఖీలు, విజిలెన్స్ కమిటీల పనితీరు, గోదాముల పరిస్థితిపై కూలంకషంగా చర్చించారు. నాణ్యమైన ఆహార ధాన్యాలను పారదర్శకంగా, సకాలంలో లబ్ధిదారులకు చేరవేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక స్ఫూర్తితోనే వికాసిత్ భారత్ సాధ్యం

- హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో సైన్స్ వేడుకలు
- రామన్ ప్రభావం, సైన్స్ లో మహిళల పాత్రపై ప్రత్యేక చర్చ
- పరిశోధనల దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని పిలుపు



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

హయత్ నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం కోలాహలంగా జరిగాయి. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సమాజ అభివృద్ధిలో విజ్ఞాన శాస్త్రం పోషించిన కీలక పాత్రను వివరించడమే లక్ష్యంగా ఈ సమావేశం సాగింది.

### వికాసిత్ భారత్ నిర్మాణంలో మహిళల పాత్ర

ఈ సందర్భంగా డాక్టర్ అవేస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ.. 2026 జాతీయ సైన్స్ దినోత్సవ ఇతివృత్తం "వికాసిత్ భారత్ ను శక్తివంతం చేయడంలో సైన్స్ లో మహిళల పాత్ర" అని వివరించారు. సీవీ రామన్ ఆవిష్కరించిన రామన్ ప్రభావం, కాంతి వ్యాప్తి సిద్ధాంతాలు ఆధునిక సాంకేతికతపై చూపిన ప్రభావాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ప్రతి నిమిషం మారుతున్న నవీకరణలను అందిపుచ్చుకోవాలని, సైన్స్ లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా నిరంతరం కొత్త విషయాలను అన్వేషించాలని, శాస్త్రీయ ఆలోచనలతో నిమగ్నం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధు ధర్మపురి, డాక్టర్ డీ బాల నరసింహ, డాక్టర్ వీ శేఖర్, బీ సుభాషిణి, కే ఉమారాణి, ఏ రజిత, బీ మమత, డాక్టర్ ఏ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. సైన్స్ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# దేశానికి సేవ చేసేలా విద్యార్థులు ఎదగాలి: ఎస్ఐలు కృష్ణ, లక్ష్మీనారాయణ

- నారాయణ పాఠశాలలో ఘనంగా సైన్స్ ఎక్స్ పో
- చంద్రయాన్ నమూనాతో మెరిసిన బాల శాస్త్రవేత్తలు
- ఆధునిక సాంకేతికత, వ్యవసాయంపై చిన్నారుల అవగాహనస్వాగతం

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (మనసులో మాట):**

హయత్ నగర్ లోని నారాయణ పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్ పో వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనలను ప్రారంభించారు. విద్యార్థులు



తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన విజ్ఞాన నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భావి భారత పౌరులుగా విద్యార్థులు దేశానికి సేవ చేసేలా ఎదగాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్షించారు.

### ఆకట్టుకున్న వైజ్ఞానిక నమూనాలు

ఈ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన చంద్రయాన్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రక్త పరీక్షలు నిర్వహించే విధానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అత్యాధునిక సాంకేతికతతో మంటలను ఆర్పడం, భూకంపాల నుంచి ఎలా కాపాడుకోవాలో వివరిస్తూ విద్యార్థులు చేసిన ప్రయోగాలు అధికారులను ఆశ్చర్యపరిచాయి. విద్యార్థుల ప్రతిభను చూసి ఎస్ఐలు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని తమలోని సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న నారాయణ విద్యా సంస్థల యాజమాన్యానికి అధికారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల జీఎమ్ గోపాల్ రెడ్డి, ఏజీఎమ్ రవీంద్రబాబు, ప్రిన్సిపాల్స్ లావణ్య, మానస, డీన్ శ్రీనివాస్, మంజుల, పీఆర్ఓ చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేలా సాగిన ఈ ప్రదర్శన తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన పొందింది.





# జమ్మూకాశ్మీర్ సంచలనం

## 67 ఏళ్ల తర్వాత మొదటిసారి రంజీ ట్రోఫీ కైవసం

**బెంగళూరు:** హుబ్లీ వేదికగా జరిగిన రంజీ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో జమ్మూ అండ్ కాశ్మీర్ జట్టు కర్ణాటకపై చారిత్రాత్మక ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ మెగా టోర్నీలో జమ్మూకాశ్మీర్ జట్టు 67 ఏళ్ల తర్వాత మొదటి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. శుభమ్ పుండిర్ తన సెంచరీతో మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. ఆ తర్వాత ఔకిబ్ నబీ ఐదు వికెట్లు తీయడం జేఅండ్‌కే 291 పరుగుల ఆధిక్యాన్ని సాధించడంలో సహాయపడింది. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జరిగిన ఈ నిర్ణయాత్మక పోరులో జమ్మూకాశ్మీర్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించి సత్తా చాటింది. మొదటి ఇన్నింగ్స్‌లో జే అండ్ కే ఏకంగా 584 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులో శుభమ్ పుండిర్ 121 పరుగులతో అద్భుత సెంచరీ బాదగా, యావర్ హసన్ (88), సాహిల్ లోత్రా (72), కెప్టెన్ పరాస్ డోగ్రా (70), కన్హయ్య వాధావన్ (70) అర్ధసెంచరీలతో కీలక పాత్ర పోషించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో రాణించినప్పటికీ, మిగితా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు.

అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటక జట్టు జమ్మూకాశ్మీర్ బౌలర్ల ధాటికి తలవంచింది. కేవలం 293 పరుగులకే కర్ణాటక జట్టు కుప్పకూలింది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ 160 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా, ఇతర స్టార్ ఆటగాళ్లు కె.ఎల్. రాహుల్ (13), దేవదత్ పడిక్కల్ (11), కరుణ్ నాయర్ (0) విఫలమయ్యారు. జమ్మూకాశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ 5 వికెట్లతో కర్ణాటక బ్యాటింగ్ వెన్నువిరిచాడు. దీనితో జమ్మూకాశ్మీర్‌కు 291 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా జమ్మూకాశ్మీర్ నిలకడగా ఆడి 4 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ 160 పరుగులతో అజేయంగా నిలిచి కర్ణాటక బౌలర్లను విసిగించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీతో జట్టు భారీ స్కోరుకు పునాది వేసిన శుభమ్ పుండిర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. హుబ్లీ మైదానంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్ జమ్మూ కాశ్మీర్ క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

# మహేంద్ర సింగ్ ధోనికి భారీ షాక్!

ఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి బిగ్ షాక్ తగిలింది. జార్ఖండ్ స్టేట్ హౌసింగ్ బోర్డు అధికారులు అతడికి నోటీసులు జారీ చేశారు. మైదానంలో వివాదరహితుడగా, మిస్టర్ కూల్ కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ధోనికి నోటీసులు రావడంపై అతడి అభిమానులతో పాటు అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. జార్ఖండ్‌లోని హర్మూ రోడ్‌లో గృహ అవసరాల నిమిత్తం ధోని రెసిడెన్షియల్ ప్లాట్ సొంతం చేసుకున్నాడు. దీనిని కేవలం నివాస స్థలంగా మాత్రమే ఉపయోగించాలని జార్ఖండ్ స్టేట్ హౌసింగ్ బోర్డుస్పష్టం చేసింది. అయితే, ఈ ప్లాట్‌లో డయాగ్నస్టిక్ సెంటర్ నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. అక్కడి నుంచి ధోని కొత్త ఇంటికి మారిన తర్వాతే ఆరోపణలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో హౌసింగ్ బోర్డు విచారణ చేపట్టి.. ధోనికి నోటీసులు జారీ చేసింది. వివరణ ఇచ్చేందుకు ఇదే ఆఖరి అవకాశమని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. ధోనిపై వస్తున్న ఆరోపణలు నిజమని తేలితే అతడికి ఇచ్చిన ప్లాట్ కేటాయింపును రద్దు చేస్తారు. హౌసింగ్ బోర్డు చైర్మన్ సంజయ్ లాల్ పాశ్వాన్ మాట్లాడుతూ.. 'గృహ అవసరాల నిమిత్తమే ఈ ప్లాట్‌ను ధోనికి కేటాయించాం. అక్కడ వాణిజ్యపరమైన కార్యకలాపాలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. అందుకే ధోనికి నోటీసులు జారీ చేశాం. అయితే, ధోని ఒక్కరికే కాకుండా హర్మూ రోడ్డులో ప్లాట్లు సొంతం చేసుకున్న మరికొందరిపై కూడా ఇలాంటి ఆరోపణలే రాగా.. వారిని కూడా నోటీసులు జారీ చేశాం. ఒకవేళ ఆరోపణలు నిజమని తేలితే వారి కేటాయింపులను రద్దు చేసి.. ప్లాట్లను వెనక్కి తీసుకుంటాం' అని ఆయన స్పష్టం చేశారు. తన అద్భుతమైన సారథ్య నైపుణ్యాలతో టీమిండియాకు ఏకంగా మూడు ఐసీసీ టైటిళ్లు అందించాడు. ఈ ఘనత సాధించిన ఏకైక భారత కెప్టెన్‌గా ధోని నేటికీ కొనసాగుతున్నాడు.



# పాకిస్థాన్‌కు శ్రీలంక షాక్

## మ్యాచ్‌కు ముందే సెమీస్ రేసు నుంచి పాక్ అవుట్

**శ్రీలంక:** పాకిస్థాన్ పని అయిపోయింది. శ్రీలంకతో పాటు పాకిస్థాన్ ఇంటి బాట పట్టింది. శనివారం శ్రీలంక, పాకిస్థాన్ మధ్య ఉత్కంఠభరితమైన మ్యాచ్ జరుగుతోంది. అయితే, మ్యాచ్ తుది ఫలితం రాకముందే పాకిస్థాన్ సెమీ-ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. శ్రీలంక టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. సాహిబ్జాదా ఫర్హాన్ సెంచరీ చేసినా ఫలితం లేకపోయింది. పాకిస్థాన్ శ్రీలంకకు 213 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒకవేళ పాకిస్థాన్ బౌలర్లు శ్రీలంకను 147 పరుగులకే పరిమితం చేసి ఉంటే, సెమీ-ఫైనల్‌కు చేరుకునేది. అయితే, శ్రీలంక 16వ ఓవర్‌లో 147 మార్కును ఇప్పటికే దాటింది. శ్రీలంక బ్యాటింగ్ ఇంకా కొనసాగుతోంది. 16.2 ఓవర్ల వద్ద శ్రీలంక స్కోర్ 157 పరుగులకు చేరుకుంది. గ్రూప్-2 నుంచి ఇప్పటికే ఇంగ్లండ్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇక రెండో స్థానం బరిలో న్యూజిలాండ్ (+1.390 ఎన్ఆర్ఆర్) తో పాకిస్థాన్ (-0.461 ఎన్ఆర్ఆర్) పోటీ పడుతోంది. కివీస్‌ను వెనక్కి నెట్టాలంటే లంకపై పాక్ ఒక భారీ మిరాకిల్ చేయాల్సి ఉండేది. పాకిస్థాన్ మొదట బ్యాటింగ్ చేస్తే కనీసం 64 పరుగుల తేడాతో విజయం సాధించాలి. కానీ.. ఇక్కడ అది సాధ్యం కాలేదు. మరోవైపు.. 213 పరుగుల లక్ష్యఛేదనలో శ్రీలంక పేలవంగా ఆడింది. నసీమ్ షా వేసిన రెండో ఓవర్లోనే పాతుమ్ నిస్సాంక వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత శ్రీలంక 33 పరుగుల వద్ద రెండో ఎదురుదెబ్బను చవిచూసింది. ఆ తర్వాత చరిత్ అసలంకా బాగా బ్యాటింగ్ చేసి, స్కోరును 75 పరుగులకు చేర్చి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత శ్రీలంక 94 పరుగుల వద్ద నాలుగో ఎదురుదెబ్బను, 101 పరుగుల వద్ద ఐదో ఎదురుదెబ్బను చవిచూసింది. ఎట్టకేలకు శ్రీలంక తనతో పాటు పాకిస్థాన్‌ను సైతం ఇంటికి తీసుకెళ్లింది.




# క్రికెట్ పండగకు ముహూర్తం ఖరారు

**ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 (ఐపీఎల్19వ సీజన్) సందడి మొదలైంది. అయితే, షెడ్యూల్ విషయంలో బీసీసీఐ ఒక కీలక మార్పు చేసినట్లు సమాచారం. తొలుత మార్చి 26న ప్రారంభం కావాల్సిన ఈ ధనాధన్ టోర్నీ, ఇప్పుడు రెండు రోజులు ఆలస్యంగా అంటే మార్చి 28 (శనివారం) నుండి ప్రారంభం కానుందని సమాచారం. మే 31న గ్రాండ్ ఫైనల్ జరగనుందని టాక్. ఈ నేపథ్యంలో అసలు ఐపీఎల్ ఎందుకు ఆలస్యమవుతోంది? ఎన్నికల ఎఫెక్ట్ ఏయే జట్లపై పడనుంది? బీసీసీఐ ప్లాన్ ఏంటి? వంటి పూర్తి వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.**




త్వరలో జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, భద్రతా కారణాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తేదీలే కాదు, వేదికల విషయంలో కూడా ఈసారి అనూహ్య మార్పులు ఉండబోతున్నాయని ప్రచారం జరుగుతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) తొలి మ్యాచ్ ఆడాల్సి ఉన్నా, చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ నిర్వహణపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది.

ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను బట్టి బీసీసీఐ ఐపీఎల్ పాక్షిక షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో ఐపీఎల్ 2026 గ్రాండ్ ఓపెనింగ్ మార్చి 26 అనుకున్నప్పటికీ, ఇప్పుడు రెండు రోజులు ఆలస్యంగా మార్చి 28న ప్రారంభం కానుందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ మే 31న జరగనుందని తెలుస్తుంది.

### ఆలస్యం ఎందుకు..

తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల తేదీల ప్రకటన కోసం బీసీసీఐ వేచి చూస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఆయా తేదీల్లో మ్యాచ్‌లు నిర్వహించడం కష్టం కాబట్టి, ఎన్నికల షెడ్యూల్ వచ్చాకే పూర్తి ఐపీఎల్ షెడ్యూల్ ఖరారవుతుందని సమాచారం. అలాగే మార్చి 8న ముగిసే టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత స్టేడియాలను ఐపీఎల్ కోసం సిద్ధం చేయడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. ఈ ఐపీఎల్ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తొలి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో భద్రతా కారణాల దృష్ట్యా ఇంకా అనుమతులు రాలేదు. ఒకవేళ అక్కడ సాధ్యం కాకపోతే, నవీ ముంబై, రాయ్‌పూర్ లేదా పూణేలలో ఏదో ఒక స్టేడియంలో తొలి మ్యాచ్ జరిగే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి ఈ ఏడాది ఐపీఎల్ అనుకున్న టైంలో రావచ్చని చెబుతున్నారు.

# 2016 రిపీట్ పక్కా.. భారత్‌ను చిత్తు చేస్తాం..

## టీమిండియాకు వెస్టిండీస్ కోచ్ సవాల్!

**కోల్‌కతా :** నేడు కీలక మ్యాచ్ జరగనుంది. భారత్-వెస్టిండీస్ మధ్య కీలక పోరు జరగనుంది. ఈ మ్యాచ్‌లో సింపుల్ నినాదం ఒక్కటే.. గెలిచిన జట్టు సెమీస్‌కు, ఓడిన జట్టుకు ఇంటికి.. ఇది మాత్రం ఫిక్స్. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరగబోయే మ్యాచ్ కోసం కోట్లాది మంది ఎదురు చూస్తున్నారు. స్టేడియంలో 80 వేల మందికి పైగా ప్రేక్షకులు, బయట 140 కోట్ల ప్రజల ఆశలు ఈ మ్యాచ్‌పైనే ఉన్నాయి. ప్లేయర్స్‌పై ఒత్తిడి సైతం బాగానే ఉంది. ఈ తరుణంలో వెస్టిండీస్ కోచ్ మాత్రం చాలా కూల్‌గా కనిపిస్తున్నారు. ఆయన భారత్‌కు సవాళ్లు సైతం విసురుతున్నారు. "వరల్డ్ కప్ గెలవాలంటే ఎప్పుడో ఒకప్పుడు భారత్‌ను ఓడించాల్సిందే. ఆ రోజు రేపే" అని వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అన్నారు. 2016 జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో భారత నేలపైనే విండీస్ సంచలనం సృష్టించింది. అదే ఊపును ఈ సారి సైతం తేవాలని చూస్తున్నారు. "ఇది డేవిడ్ వర్సెస్ గోలియత్ లా అనిపించవచ్చు. కానీ 2016లో డేవిడ్ గెలిచాడు. అదే సందేశం నా బాయ్స్‌కు ఇస్తున్నాను" అని సామీ నవ్వుతూ చెప్పారు. 2016 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి, భారత్‌ను టోర్నీ నుంచి నిష్క్రమింపజేసింది.




ఈ మ్యాచ్‌ను ఉద్దేశించి సామీ ఈ వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా వెస్టిండీస్ అందరికీ రెండో ఫేవరెట్ టీమ్. కానీ ఈ మ్యాచ్‌లో భారత్‌కు శత్రువులుగా మారుతున్నారు. దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి వచ్చినా సామీ ఆందోళన చెందడం లేదు. "ఒక ఓటమి మీ జట్టును నిర్వచించదు. భారత్ కూడా ఓటమి తర్వాత బలంగా తిరిగి వచ్చింది. ఇప్పుడు మేము స్పందించాలి. ఇది వర్చువల్ క్వార్టర్ ఫైనల్. అమలు ముఖ్యం," అని అన్నారు. జట్టులో మార్పులపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. "నా సైనికులందరూ యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. టాస్ సమయంలో జట్టు తెలుస్తుంది. నా వద్ద 11 మంది డేంజర్ ఆటగాళ్లు ఉన్నారు. మేము ముందే అన్నీ ప్లాన్ చేసుకున్నాం" అంటూ చిరునవ్వు చిందించారు. గత మ్యాచ్‌లో 83/7 స్థితిలోనూ 177 వరకు చేరిన జట్టు పోరాటస్ఫూర్తిని ప్రశంసించారు. "83 పరుగలకే ఏడు వికెట్లు కోల్పోతామని అనుకోలేదు. కానీ ఆ పార్ట్‌నర్‌షిప్ క్యారెక్టర్ చూపించింది" అని చెప్పారు. అదే ధైర్యం మళ్లీ కావాలని కోరారు. గెలిస్తే భారీ సెలబ్రేషన్ ఉంటుంది. 10 ఏళ్లుగా సెమీఫైనల్‌కు చేరలేదు. ఈసారి మైదానంపైనే డ్యాన్స్ చేయాలని ఆశిస్తున్నామని హాస్యంగా చెప్పారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




# హుషారు పిట్టలు నుంచి మంగళస్నానం పాట విడుదల

అన్షు, వాసవి గణెళిషన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిల్మ్స్ విడుదల చేస్తుండటంతో ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన రాగా, తాజాగా ఈ చిత్రం నుంచి 'మంగళస్నానం' అనే హార్ట్ టచింగ్ ఎమోషనల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పాట ఒక తండ్రి తన కూతురిని ఎంత అల్లారుముద్దుగా పెంచుకుంటారో, ఆమెపై ఎంతటి ప్రాణాన్ని పెట్టుకుంటారో అద్భుతంగా ఆవిష్కరించింది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే విడదీ-యలేని అనుబంధానికి ఈ గీతం అద్దం పడుతోంది. ఎస్.ఎస్. చిరంజన్ హృద్యమైన సాహిత్యం అందించగా, యోగి సురేష్ మరియు విహా తమ గాత్రంతో ప్రాణం పోశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 'తండ్రీకూతుళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమను ఈ పాటలో చూపించాం. ఈ సినిమా కేవలం యువతకే కాదు, తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక చక్కని కుటుంబ కథా చిత్రం. నా నిజ జీవితంలో నేను చూసిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాను. యువతకు కావాల్సిన హుషారును ఇస్తూనే, ఒక సరికొత్త థ్రిల్‌ను ఈ సినిమా పంచుతుంది' అని తెలిపారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. 'సినిమా ప్రథమార్ధం అంతా యూత్‌ఫుల్ కంటెంట్‌తో ఎంటర్టైన్ చేస్తే, ద్వితీయార్ధంలో ఒక మెచ్యూర్డ్ పాయింట్ ఉంటుంది. సమాజంలో బాధ్యతాయుతమైన విషయాన్ని వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూశాక ఒక బాధ్యతను గుర్తిస్తారు. నటీనటులందరూ చాలా సహజంగా నటించారు. కచ్చితంగా ఇది పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో అన్షు, వాసవి గణెళిషన్‌లతో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది.ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రీ హీరోయి-న్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు చైనీస్, కొరియన్ సహా పలు విదేశీ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానుంది.

## దురంధర్ పార్ట్2 విడుదలకు సిద్ధం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివేంజ్' విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఈ సినిమా రన్ టైమ్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నిడివి 220 నిమిషాలుగా ఉన్నట్లు సమాచారం. అంటే ఈ చిత్రం దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతుంది. మొదటి భాగం 3 గంటల 34 నిమిషాలు తో పోలిస్తే ఇది 6 నిమిషాలు ఎక్కువ ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘమైన నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత, హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త 'బడే సాబ్' (మేజర్ ఇక్బాల్)ను ఎలా ఎదుర్కొన్నాడు అనే ఉత్కంఠభరితమైన అంశాలతో ఈ సీక్వెల్ సాగనుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, సారా అర్జున్ కథానాయికగా నటించింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యాష్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది.







## విష్ణు విన్యాసం మూవీ లీక్

### అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ప్లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు.నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. 'వరుసగా ఈ సినిమాకు సంబంధించిన వీడియోలను నాకు పంపారు. ఆ సందేశాలు చూడగానే నా భవిష్యత్ కళ్ల ముందు కనపడింది. మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861